
ఆంధ్రపత్రిక

సచిత్ర వారపత్రిక



25 నయాపైసలు
16-10-57

ANDHRA PATRIKA
ILLUSTRATED WEEKLY



సంవత్సర చందా
రు. 13—0—0
విడిప్రతిక 25 న.పై

ఆంధ్రపత్రిక

సచిత్రవారపత్రిక

Founder: K. NAGESWARA RAO

సంపుటము 52
సంచిక 8
16-10-57

హేవిళంబి ఆశ్వయుజం, బహుళ, సప్తమి బుధవారం

విషయానుక్రమణిక

ముఖచిత్రం:
డోసీ ఫిలింస్ వారి "చందన్" చిత్రంలో
నూతన్ సమర్థ్

★




లాస్ ఏంజలిస్ అందచందాలు

హాలీవుడ్ తారల తరహా

పాశ్చాత్య ప్రజాస్వామిక దేశాల్లో స్త్రీలు, పురుషులు, శిశువులు తమ దేశం, తమ నగరం, తమ పరిసరాలు—వీటి మీద కనబరిచే శ్రద్ధాభక్తులు చూస్తే ఆశ్చర్యం వేస్తుంది. ఇంగ్లండులో బ్రైటన్‌లాంటి అనేక పట్టణాలలో సరిగ్గా రోడ్డుమధ్యలో కలకల నవ్వుతూ పలకరించే పూలమళ్లు చూశాను. ఈ పూలమళ్లవలన ఆ వీధు లెంతగా అందించాయో చెప్పలేను. అనగూడదుగాని, మన పార్లమెంటు స్ట్రీట్‌లో వరీంద్రప్లేస్ దగ్గర చూడండి—మొదట్లో అక్కడ మూడు పచ్చికపట్టాలు ఉండేవి. వాటిలో రెండు ఎప్పుడు మాయమయ్యాయో మాయమైపోయాయి. మిగిలిన దాన్నికూడా ధ్వంసం చెయ్యడానికి మోటారుకార్లు లెక్కించన లేకుండా ప్రయత్నిస్తున్నాయి. న్యూఢిల్లీ మునిసిపల్ కమిటీ కూడా నగర సౌందర్య నిర్మూలన కార్యక్రమానికి కాయశక్తులా తోడ్పడుతోంది. రోడ్ల ప్రక్కల ఉండే చక్కటి కాలిబాటలు ఈ పదేళ్లలోనూ ముళ్లడొంకలుగా తయారయ్యాయి. సచివాలయం ఎదురుగా ఉండే పచ్చిక పట్టాలు కూడా ఇలాగే నాశనమయ్యాయి. అయితే ఇది భారతదేశయాత్ర కాదు గనక ఇక్కడితో వదిలేద్దాం.

పసిఫిక్ మహాసముద్ర మధ్యప్రాంతంలో ఉన్న హానోలూలూ దర్శించడం ఒక అందమైన అనుభవం. చూడవచ్చే యాత్రికుల ఆకర్షణకోసం అక్కడి స్త్రీ పురుషులు



అందమైన అమెరికన్ నగరాల్లో లాస్ ఏంజలిస్ (కాలిఫోర్నియా) ఒకటి. పై చిత్రంలో కనిపించే రోడ్డును 'హాలీవుడ్ ఫ్రీవే' అంటారు. నానాటికీ ఎక్కువ అవుతున్న రాకపోకలరద్దీని తగ్గించడానికి అమెరికాలో అనేక పట్టణాలలో ఇలాంటి రోడ్లు వేస్తున్నారు.

యాత్రా విశేషాలు

ఎప్పుడూ ఏవో వింత వింత పనులుచేస్తూనే ఉంటారు. స్విట్జర్ లాండ్ లో ఇంటర్ లేకన్ లాగానే నడి పసిఫిక్ లో హొనొలూలూ యాత్రికులమీద ఆధారపడిన ప్రదేశం.

అమెరికా వాయవ్యకోస్తాన ఉన్న సీయటల్ చాలా అందమైన పట్టణం. రోమ్ లాగానే ఈ పట్టణం కూడా ఏడు కొండల మీద కట్టారు. పట్టణంలో కొండ లుండడం ఇబ్బందిగా ఉంటుంది. అందుకని పట్టణప్రజలు చాలావరకు వాటిని నేల మట్టంచేశారు. పట్టణానికి ఏకాల హిమావృతమైన రెయినీర్ పర్వతం కనిపిస్తూ ఉంటుంది. కొండలమీద అంతస్తు లంతస్తులుగా పట్టణం అందంగా కనిపిస్తుంది. చాలామంది నౌకా గృహాల్లో నివసిస్తారు.

సీయటల్ ప్రజలు మొదటినుంచీ మంచి [illegible]. మొదటి రోజుల్లో పెళ్లీడు వచ్చిన అమ్మాయిలకంటే పెళ్లికాని పురుషులే అధికంగా ఉండేవారు. ప్రతి 9 మంది అవివాహితులకూ ఒక్కత్తే అవివాహిత చొప్పున ఉండేది. ఒక వ్యాపారస్తుడు ఒక భవనం కట్టించాడు. అందులో అంతా ఆడవాళ్ళే. మరో వ్యాపారస్థుడు రెండుసార్లు ఇతర పట్టణాలకుపోయి అవివాహితలైన స్త్రీలను చాలామందిని తీసుకొచ్చాడు. అయితే ఇదంతా గతచరిత్ర. ఈరోజున అమెరికాలో కల్లా అద్భుత సౌందర్యవతులైన అమ్మాయిలు సీయటల్ లోనే కనిపిస్తారు. ఇళ్ళు కూడా అత్యద్భుతంగా ఉంటాయి. పిల్లలు కారు ప్రమాదాలకు లోనుగాకుండా ఈ ఊళ్లో ఒక ఏర్పాటు చేశారు. నివాస ప్రాంతాల్లోని రోడ్లను మిట్ట పల్లాలుగా చేశారు. దీనివల్ల కార్లు ఇష్టమొచ్చినట్లు వేగంగా పోయేందుకు వీలు కలగదు.

అమెరికాలో చాలా నగరాల్లోవలెనే సీయటల్ లో కూడా వృద్ధులైన తల్లిదండ్రులు ఉండడానికి వేరే ఇళ్లుంటాయి. తల్లిదండ్రులతో కొన్ని చిక్కులున్నాయి. కొత్తగా పెళ్లయిన తమ బిడ్డలతో తల్లిదండ్రులు అంత తేలిగా కలిసిమెలిసి ఉండలేరు. నేనొక జంటను చూశాను. ఒక కుటుంబంవారు నన్ను భోజనానికి పిలిచారు. భోజనం చేస్తున్నంతసేపూ దాదాపు రెండు గంటలసేపూ వృద్ధురాలైన తల్లి ఏదో వాగుతూనే ఉంది. అదికూడా అంతా సొంత గొడవే. ఆవిడ బిడ్డలు ఎవరిపాట్లువారు పోసుకుంటున్నారు. అయినా వారు తల్లిదండ్రులతో కలిసే వుంటున్నారు. కాని కుటుంబంలో కలతలు రాకుండా ఉండడానికి తల్లిదండ్రులు వారికోసం కట్టిన ప్రత్యేక గృహాలలో ఉండడం మంచిదనిపిస్తుంది. ఎవరి మానాన వారు హాయిగా ఉండచ్చు. అప్పుడప్పుడూ 'ఫాదర్స్ డే' అనీ 'మదర్స్ డే' అనీ పండగలాగా చేసుకోడానికి సాకు దొరికినట్లు కూడా అవుతుంది.

లాస్ ఏంజలిస్ లో చైనా థియేటర్ ఎదట సిమెంటు పలకలమీద అందమైన చేతుల ముద్రలు కాలిజోళ్లముద్రలు, ఆయా వ్యక్తుల సంతకాలతోసహా కనిపిస్తూ చూపరుల నాకర్షిస్తూ ఉంటాయి. ప్రసిద్ధతార నార్మాషేరర్ జోళ్ల ముద్రలు, సంతకం ఒకచోట చూశాను. ఆశాభంగమైంది. జోళ్ల ముద్రలవల్ల ఏమైనట్టు? కాలి ముద్రలైనా అయితే ఆవిడ పాదాలెంత సుకుమారమైనవో చూచాయగానైనా తెలిసేది.

హాలీవుడ్ తార జోన్ క్రాఫర్డ్ గృహం 'సన్ సెట్ బూలివార్డ్' లో ఉంది. గుబురుగా ఉన్న చెట్ల వెనకాల పొదలమధ్య దాక్కున్నట్లుండే ఆమె ఇంటిముందు ఒక సైన్ బోర్డు మీద "ఇక్కడ తచ్చాడవద్దు. వెళ్ళిపొండి" అని రాసిఉంటుంది. మహారాణికీ, సినిమా తారకీ ఇదే తేడా. బకింగ్ హాం భవనంముందు నిలబడి ఎవరైనా, ఎంతసేపైనా చూడచ్చు. బకింగ్ హాం భవనానికి వెళ్లేదోవ, పరిసరాలు ఎప్పుడూ సందడిగా, సమ్మర్దంగానే ఉంటాయి. కాని లాస్ ఏంజలిస్ లో జోన్ క్రాఫర్డ్ ఇంటికి అయిదుమైళ్ళ మేరలో ఎక్కడా మానవసంచారమైనా కనబడలేదు.

> అమెరికా పర్యటన ముగించుకుని వచ్చిన ప్రముఖ పత్రికా రచయిత శ్రీ కృష్ణ తమ యాత్రా విశేషాలనుగూర్చి వ్రాసిన మొదటి వ్యాసం 5-6-57 పత్రికలో ప్రచురించాము. ఈ రెండవ వ్యాసంలో శ్రీ కృష్ణ ప్రసిద్ధ యాత్రా కేంద్రాలయిన హొనలూలూ, సీయటల్, లాస్ ఏంజలిస్ లను వర్ణించారు.

లాస్ ఏంజలిస్ లో ప్రపంచ ప్రసిద్ధులైన సినిమాతారలు అనేకులు కనిపిస్తారు. చింత చచ్చినా పులుపు చావనట్లు నటించే భారతీయ మహారాజాలు కూడా కనిపిస్తారు: ఒకటే చిక్కు. లాస్ ఏంజలిస్ ఒక దారీతెన్నూ లేకుండా ఎటుపడితే అటు అడ్డదిడ్డంగా అభివృద్ధి అయిన నగరంలా కనిపిస్తుంది. నగరంలోని కొండల్ని చాలమటుకు పడగొట్టి చదునుచేశారు. ఎంత అడ్డదిడ్డంగా పెరిగినా నగర పరిసరాల రామణీయకం ఇప్పటికీ విభ్రాంతిగొలుపుతూనే ఉంటుంది.

యాత్రికులకు అమెరికా స్వర్గధామమే అని చెప్పచ్చు. అమెరికన్లదగ్గిర డబ్బే కాదు, డబ్బును సద్వినియోగంచేసే తెలివికూడా ఉంది. యాత్రికులను ఆకర్షించేందుకు, యాత్ర సుఖంగా జరిగేటందుకు అమెరికన్లు అన్ని సదుపాయాలు కలగజేస్తారు. లాస్ ఏంజలిస్ లో నేను దిగిన హోటలుగదిలో మామూలు సదుపాయాలన్నీ ఉండడమే కాక, డ్రెసింగ్ టేబిల్ మీద ఒక కవరులో పెట్టి కొన్ని బొత్తాములు, సూది, దారంకూడా ఉన్నాయి. ఫౌంటెన్ పెన్నుల్లో సిరా నింపుకోడానికి ప్రత్యేకంగా ఒక 'బూత్' లాంటిది ఉన్నది.

అమెరికాలో ఎవరిహోదాకు సరిపడిన హోటళ్ళువారికి దొరుకుతాయి. రోడ్డు పక్కన ఉండే హోటలును "మొటెల్" అంటారు. ఈ మొటెల్ లోకి కారుపోనిచ్చి ఒక గది అద్దెకు తీసుకోవచ్చు. స్నానంచేసి, భోజనంచేసి హాయిగా ఒక నిద్ర తీయవచ్చు. ఈ కోస్తానుంచి ఆ కోస్తాకు కారులో ప్రయాణం చేసేవారు ప్రతిరోజూ చీకటి పడగానే ఈ 'మొటెల్స్' లో ఆగుతారు. తెల్లారగానే మళ్ళీ ప్రయాణం సాగిస్తారు. "డ్రైవ్ ఇన్ రెస్టారాంటు" లని ఉన్నాయి. ఇవి రోడ్ల పక్కన ఉంటాయి. కారుతో లోపలికి పోవచ్చు. అందమైన ఓ 'చిటితల్లి' మన్ని చిరునవ్వుతో ఆహ్వానించి కారులోకే భోజనం తీసుకొచ్చి అందిస్తుంది. "డ్రైవ్ ఇన్ సినిమా"లని ఉన్నాయి. సినిమా వేసే చోటికి కార్లో షికారుగా పోవడం, కార్లో నే కూర్చుని సినిమా చూడడం, వెళ్ళిపోవడం-అంతే. ప్రతి అయిదేసి మైళ్ళకీ రోడ్ల ప్రక్కల పెట్రోలు స్టేషన్లు ఉంటాయి. వీటిని పెట్రోలు స్టేషన్లు మాత్రమే అనడం అన్యాయం. అమెరికాలో పెట్రోలు దుకాణదార్లు పెట్రోలు నింపడమే కాదు; అద్దాలన్నీ తుడుస్తారు. ఇంజను సరిగ్గా ఉందో లేదో పరీక్షిస్తారు. మోబిల్ ఆయిల్ తగినంత ఉందో లేదో, టైర్లలో గాలి ఉందో లేదో అన్నీ చూస్తారు. దోవ తెలియకపోతే దోవ చెబుతారు. కావలిస్తే మనం ఏ ప్రాంతంలో

(47 వ పేజీ చూడండి)

మత్కుణాఖ్య రామాయణం

"శివు డద్రిని శయనించుట
రవిచంద్రులు మింట నుంట, రాజీవాక్షుం
డవిరళముగ శేషునిపై
బవళించుట నల్లిబాధ పడలేక జుమీ!"

మహామహా కొమ్ములుతిరిగిన శివుడూ, సూర్య చంద్రులూ, నారాయణుడూ అంతటివాళ్ళే నల్లిబాధ పడలేక ఒకరు కొండమీదా, ఇద్దరు ఆకాశంలో, మిగతా ఒక్కరూ శేష శయ్య మీదా వరుసగా నెలవు ఏర్పరచుకున్నారట!

నిజం. మానవుడి ఆరోగ్యానికి ఉపద్రవ మయిన ప్రముఖజీవుల కోవకు నల్లులు కూడా చేరతాయి. శరదృతువులో వృక్షజాలమంతా పచ్చగా కిలకలలాడుతూ వుంటే, ఆ 'కల కల' లకు సమప్రమాణంలో దోమలు ప్రభవించి రాత్రిళ్లు నిద్రపోనీకుండా నానా యాతనా పెడతాయి. అలాగే, సన్నజిల్లేడు దూదితో కాశీపట్టుతో మెత్తగా పరుపులూ దిండ్లూ కుట్టించి, వాటి కొనుకుని ఓ నిముషంసేపు తన్మయత్వం పొందుదామనుకుంటే, ఆ మెత్తకు తగినట్టుగా ఆపరుపుల్లో నల్లులు కాపురంచేస్తో, వాటి కొనుకున్న మానవుల రక్తాన్ని గ్రోలుతూ అవి తన్మయత్వం పొందుతాయి. ఈ నక్కచావు పడలేకనే కాబోలు—విష్ణు మహేశ్వర సూర్య చంద్రులు తమతమ పరుపుల్ని వదిలిపెట్టి తలా ఒకచోటికి చేరుకున్నారు!

ఇలా యీ నలుగురూ—అంటే ఉమాకాంతుడూ, ఉషాకాంతుడూ, తారాకాంతుడూ, రమాకాంతుడూ—తలా ఒక నెలవు చూసుకోవడంలో మరో విశేషంకూడా కలిసివచ్చింది. వెండికొండ అంతా నిరంతర హిమాకరం కావటంవల్లనూ, వినువీధిలో ప్రాణులు మనడానికి సరైన వాతావరణం శూన్యమైనందువల్లనూ (అక్కడ ఆక్సిజన్ లేదుగా మరి!), శేషశయ్య చుట్టూవున్న సముద్ర తరంగాలు విపరీతంగా ఉప్పుఘాటు వెలార్చటం వల్లనూ, ఆయా ప్రదేశాలలో నల్లులేకాకుండా దోమలుకూడా చేరవు. ఈ విధంగా "అద్రినిశయనించుట, మింటనుంట, అవిరళముగ శేషునిపై బవళించుట"లో వీళ్ల బుర్రలు అమోఘంగా పనిచేశాయనే చెప్పాలి.

అయితే ఇక్కడివరకూ వొచ్చాక కొంచెం ధర్మసందేహం కలక్కమానదు. ఇంతాచేసింది కమలభవుడు. ఈయనా త్రిమూరుల బోరులో మెంబరే. (ఈయన

పఱాతుల రామచంద్రయ్య

మట్టుకు ఈయనకూడా నల్లిబాధ పడలేక తరులతాగుల్మాదులచే ఆవృతమైన పాలరాతిమీద కూర్చున్నాడనుకోండి) ఈయనగారు దూరాలోచనలేకుండా నల్లులను పుట్టించి, వాటికి రక్తం ఆహారంగాచేస్తే, తోటిసభ్యులిద్దరూ ఆ విధంగా చోటాచోటికి వెళ్ళిపోవలసిన అగత్యమెందుకు కలిగింది? అందులోనూ బ్రహ్మ నారాయణుడి పుత్రుడేనాయె! అలాంటప్పుడు—శివుడూ విష్ణువూ ఒకటై బ్రహ్మను అదిలించి "ఇలా చేసేవేమిటోయ్?...సరిచెయ్యి." అనేస్తే, బ్రహ్మ తన కృతాన్ని మార్చేసి వుండును కదా! ఈ విషయంలో వీళ్లి బుర్రలు మందగించినయ్యేం?—చూస్తే, మత్కుణ పటు ప్రతాపఘాటికి భయపడి పరిగెత్తేటప్పుడు వీళ్లకు ఆ మాత్రం ఆలోచించుకునేపాటి స్తిమితమైనా చిక్కలేదేమో అనిపిస్తుంది. పైగా సమయానికి ఏ పరాకున వున్నాడో ఆ మహాత్ముడు చతుర్ముఖుడు ఈ నలులకు మృదు హంసతూలికా తల్పాలలో ఉండేట్టు వరంకూడా రాసిపడేసి కూచున్నాడు!

నెత్తురుపీల్చి బాధించడంతోటే ఊరుకోవు

55-వ పేజీ చూడండి)

నక్షత్ర ఫలితాలు

(16-10-57 మొదలు 22-10-57 వరకు)

బి. నరసింగరావు

ఈ వారము గ్రహస్థితి.

	కే		
—	తే 16దీ రాత్రి గం-3-45 లకు రవి తులకుమారును. తే 20 దీని బుధుడు తులకు మారును, గురూదయమగును. మిధున కర్కాటక, సింహ కన్యకులలో చంద్రుడు.		—
	శు శ	రా	ర గు బు కు

అశ్విని [చూ, చే, చో, లా]

బహుకాలమునుండి పరిష్కారము కాకుండా మిమ్మలను చాలా చిక్కులుపెడుతూన్న కార్యములు ఈ వారము సుముఖమవుతాయి. పెద్దలసాంగత్యమువల్ల అనేక నూతనవిషయాలు నేర్చుకుంటారు. కోర్టు వ్యవహారాలు మీకు అనుకూలించే సూచనలున్నాయి. ఉద్యోగులకు అనుకూలకాలము. విద్యార్థులు ఉత్సాహముతో కొత్తవిషయాలను తెలుసుకొని తమ భావి జీవితములో వాటిని మేలుగా ఉపయోగించుకుంటారు. పండితులకు, కళాకారులకు మంచికాలము. కుటుంబములోవారికి నూతన వస్త్రాలంకారములు ప్రాప్తిస్తాయి. 19-వ తేదిని నూతనోల్లాసము కలుగుతుంది. 21, 22 తేదిలలో పిల్లలతోనూ, బంధుమిత్రులతోనూ సంతోషముగా గడుపుతారు. ఖర్చు ఎక్కువ.

భరణి [లీ, లూ, లే, లో]

గతవారాలలో కలిగిన ఆటంకాలు ఈ వారములో మీకు తీరిపోతాయి. వెండి సామగ్రి కొంటారు. బంధుదర్శనమువల్ల లాభముపొంది, విందులతో ఆనందముగా గడుపుతారు. సంతానమునుగురించి సంతోషవార్త వస్తుంది. ఉద్యోగులకు ఒడిదుడుకులు లేకుండా గడుస్తుంది. వర్తకులకు మంచి లాభము కలుగుతుంది. విద్యార్థులకు ఆనందముగా వుంటుంది. కళాకారులకు, నటీనటులకు, గాయకులకు యోగకాలము. 19 తేదీని కొత్తవారితోపరిచయము, లాభము. 21, 22 తేదీలలో ఆనందము పొందుతారు. ఖర్చు ఎక్కువ.

కృత్తిక [అ, ఈ, ఊ, ఏ]

ఈ వారము మీకు యోగకాలము. ధనాదాయము హెచ్చుతుంది. సకాలములో మిత్రుల సహాయమువల్ల కొంతకాలమునుండి వుంటూన్న అశాంతి తొలగిపోయి ఆరాటము లేకుండుటచే తృప్తిని కలిగిస్తుంది. ఉద్యోగులకు యజమానుల ఆదరణ లభిస్తుంది. యత్నకార్యానుకూలత కలుగుతుంది. వర్తకులకు లాభదాయకముగా వుంటుంది. కుటుంబమందుండువారికి నూతన వస్త్రములు కొంటారు. విద్యార్థులకు చదువు చాలా చురుకుగా సాగుతుంది. కవులకు, కళాకారులకు, నటీనటులకు యోగము. 19 వ తేదీని శుభవార్త. 21, 22 తేదీలలో తీపి వస్తువులతో కూడిన భక్ష్యభోజనములతో విలాసముగా గడుస్తుంది. ఖర్చులు ఎక్కువ.

రోహిణి [ఓ, వా, వీ, వూ]

ఈ వారము మీకు అంతగా యోగకాలము కాదు. ఎక్కువ శ్రమకలిగేపనులు చేయవలసివస్తుంది. అందుకుతగ్గఫలము చేతికి రాకపోవుటచేత మనోవ్యధ. అకాల భోజనమువలన అనారోగ్యము. కోర్టు వ్యవహారములు వాయిదాపడతాయి. ఉద్యోగులకూ, వ్యాపారస్తులకూ ఒత్తిడిఎక్కువగావుంటుంది. విద్యార్థులు చదువుపైని అశ్రద్ధచూపుతూ, వినోదాలవైపు మొగ్గు చూపుతారు. 19 తేదీ కొంత ఆశాజనకముగా ఉంటుంది. 21,22 తేదీలలో ఖర్చులు ఎక్కువ, అశాంతి.

మృగశిర [వే, వో, కా, కీ]

ఈ వారము మీకు యోగకాలము కాదు. మొదట్లో కార్యములు అనుకూలించినట్టుగా వుండి చివరకు ప్రతికూలముగా పరిణమించుటచేత ఆశాభంగమగును. మనస్సునకు అస్థిమితము ఎక్కువగును. అయినను వారాంతమందు అజ్ఞాతమిత్రుల సహాయమువల్ల కొంత ఊరట కలుగుతుంది. ఉద్యోగులకు ఆర్థికముగా ఒత్తిడి ఎక్కువవుతుంది. వ్యాపారస్తులకు మాంద్యముగా వుంటుంది. విద్యార్థులకు చదువుమీద శ్రద్ధ తక్కువవుతుంది. 19 వ కొంత ఆశాజనకముగా వుంటుంది. 21, 22 తేదిలలో అవసరాలు తీరనందున మనోవ్యథ, ఖర్చులు ఎక్కువ.

* ఆరుద్ర [కూ, ఖ, ఙ, ఛ] *

ఈ వారములో మీకు కొంత అనుకూలత, కొంత ప్రతికూలత అగుటవల్ల మిశ్రమ యోగము. ఉత్తమ మతగ్రంథములను చదువుటచేత కార్యభంగమువల్ల కలిగిన అశాంతి కొంత ఉపశమిస్తుంది. ఉద్యోగులకు అంత మంచికాలముకాదు. కొంత కష్టపడిన తరువాతను ధనాదాయము కలుగుతుంది. విద్యార్థులకు చదువుపై ఆసక్తి తక్కువవుతుంది. 19 న గ్రంథపఠనం; ఆదాయము కలిగే సూచన. 21, 22 తేదీలలో శ్రమ, ఖర్చులు ఎక్కువ.

* పునర్వసు [కే, కో, హా, హీ,] *

ఈ వారమున సకాలములో చేతికి సొమ్ము రాకపోవుటచేతను, ఖర్చులు ఎక్కువగుటచేతను మనస్సునకు అస్థిమితము కలుగుతుంది. కార్యభారము ఎక్కువవుతుంది. కోర్టువ్యవహారములు కొంతే ప్రతికూలముగా వున్ననూ కొంత అనుకూలిస్తాయి. ఉద్యోగులకు అశాంతి. వ్యాపారస్తులకు ఒత్తిడి ఎక్కువ. స్త్రీలతో వివాదము కలుగుతుంది. ఆరోగ్యభంగము కలిగేసూచనలుకూడా వున్నవి. విద్యార్థులకు చదువుపై బద్ధకము, వినోదములపై ఆసక్తి ఎక్కువవుతుంది. 19 న స్వల్పముగా అనుకూలిస్తుంది. 21, 22 తేదిలు అమిత ఖర్చులు, అస్థిమితము.

పుష్యమి [హూ, హే, హో, డా]

ఈ వారమున మీరు సోదరవర్గమువల్ల ఆశించిన సహాయము సకాలములో పొందకపోవుటచేతను, మిత్రులనుకున్నవారు తటస్థముగ వుండడంచేతను యత్నకార్యములు నెరవేరవు. కార్యహానివల్ల మనోవ్యథ కలుగుతుంది. ఉద్యోగులకు అధికారుల ఒత్తిడి ఎక్కువవుతుంది. విద్యార్థులకు చదువు కుదరక వినోదములు ఎక్కువవుతవి. చేతికిగాని, కాలికిగాని దెబ్బలు తగులవచ్చు. 19 న కొంత ఆశాజనకము. 21, 22 తేదీలలో కలతలు, అమిత ఖర్చు.

ఆశ్లేష [డి, డూ, డే, డో]

ఈ వారమున మీరు స్వప్రయోజనము చేతను, ఉచ్ఛస్థులైనవారి సహాయముచేతను కార్యానుకూలతను పొందుతారు. కొత్త మిత్రులను కలుసుకొనుట, సంతోషవార్తలను వినుట మొదలగు శుభఫలములు కలుగును.

గృహమందుండువారికి నూతనవస్త్రాలంకారములు చేకూరుస్తారు. విద్యార్థులు నూతనాంశములను నేర్చుకుంటారు. ఉద్యోగులకు అధికారుల మన్నన కలుగుతుంది. కళాకారులకు, నటీనటులకు యోగకాలము. వ్యాపారస్తులకు లాభము. 19వ తేదీని క్రొత్తవారితో పరిచయము; లాభము. 21, 22 తేదీలు ఎక్కువఖర్చు, విందులతో విలాసము.

మఖ [మా, మీ, మూ, మే]

ఈ వారము మీకు అన్నివిధాలా యోగకాలము. పెద్దల సాంగత్యమువల్ల కొన్ని క్రొత్తవిషయాలను తెలుసుకుంటారు. వాటివల్ల జీవితమునకు ఎంతో మేలు కలుగుతుంది. కొంతకాలమునుండి పరిష్కారముకాకుండా వున్న సమస్యలు మీకు అనుకూలముగా నెరవేరుతవి. కోర్టు వ్యవహారములు అనుకూలిస్తవి. విద్యార్థులు భావిజీవితమునకు పనికివచ్చే క్రొత్త సంగతులు తెలుసుకుంటారు. ఉద్యోగులకు మేలుకాలము. వర్తకులకు లాభసాటిగా వుంటుంది. భార్యాబిడ్డలకు నూతనవస్తువులను చేయించుతారు. కళాకారులకు, పండితులకు మంచికాలము. 19వ పెద్దల సాంగత్యము. 21, 22 కుటుంబమందుండువారితో వినోదముగా గడుస్తుంది. ఖర్చులు అమితముగా వుంటాయి.

* పూర్వ ఫల్గుణి (పుబ్బ) *
[మో, టా, టీ, టూ]

ఈ వారము మీకు యోగదాయకముగా వుంటుంది. యత్నకార్యములు సిద్ధిస్తాయి. ఉద్యోగులకు అధికారులదయ కలుగుతుంది. మిత్రులతో వినోదములలో పాల్గొంటారు. ఉత్తరదిక్కునుంచి శుభవార్త వింటారు. సకాలములో ధనాదాయము చేతికివస్తుంది. వ్యాపారస్తులకు మంచికాలము. కళాకారులకు, కవులకు, నటీనటులకు యోగము. విద్యార్థులకు నూతనోల్లాసము కలుగుతుంది. కుటుంబమందుండువారికి నూతనాలంకారములు, వస్త్రములు అమరుతవి. 19వ నూతనశోభ. 20వ తేదీ మార్పు. 21,22 తేదిలు గృహమందుండువారితో మృష్టాన్నభోజనముతో ఆనందముగాను, విలాసముగాను గడుపుతారు. స్వల్పప్రతికూలత వుంటుంది.

* ఉత్తర ఫల్గుణి (ఉత్తర) *
[టే, టో, పా, పి]

ఈ వారము మిత్రులతోను, కళాకారులతోను ఆనందముగా గడుస్తుంది. ధనాదాయము ప్రోత్సాహకరముగా వుంటుంది. పుణ్యకార్యములను ఆచరిస్తారు. కార్యభారము ఎక్కువ అయినను మీ సహనబలముతో సక్రమముగా నిర్వహిస్తారు. కోర్టు వ్యవహారాలు సుముఖం కాగలవు. ఉద్యోగులకు ఒత్తిడి వుండదు. వర్తకులకు లాభము కలుగుతుంది. విద్యార్థులకు ఉత్సాహముగా వుంటుంది. కుటుంబమందుండువారికి నూతనవస్త్రాలంకారములు కొంటారు. ఆప్తులతో తీయనిపదార్థాలు ఆరగిస్తారు. 19వ క్రొత్తవారిని కలుసుకుంటారు. 21, 22 తేదీలు ఖర్చులు అమితముగా వుంటవి. కొంత తొందరపాటు కలుగుతుంది.

హస్త [పూ, ష, ణ, ఠ]

ఈ వారము మీరు రాబడి అభివృద్ధిచేసుకోడానికి పెద్దప్రయత్నాలుచేసి విఫలులై ఆశాభంగం చెందుతారు. కార్యభారం ఎక్కువగుటచేతను, అకాలభోజనముచేతను ఉష్ణాధిక్యత కలుగుతుంది. ఈవారం కొన్ని క్రొత్తసమస్యలు - కోర్టు వ్యవహారాలవంటివి తలెత్తి ఆందోళన కలుగజేస్తాయి. మనోధైర్యము లేకపోతుంది. ఆర్థిక ఒడిదుడుకులవల్ల వ్యాపారస్తులకు అశాంతి ఏర్పడుతుంది. ఉద్యోగులకు మంచికాలముకాదు. గృహమందుండువారికి కావలసిన అవసరాలు తీరకపోవడంవల్ల అలకలు కలుగుతవి. విద్యార్థులకు చదువుసాగక వినోదాలవైపు దృష్టిపోతుంది. 19వ కొంత విశ్రాంతి; 20వ పరిస్థితుల మార్పు. 21,22 తేదిలలో ఖర్చులు అమితం, అశాంతి.

చిత్త [పే, పో, రా, రీ]

సాహసముతో కార్యసాధనకు మీ సర్వశక్తులను ఉపయోగించినప్పటికీ, కార్యసాధన కలుగనట్లు కనబడి, మొదట్లో చాలా నిరుత్సాహ మేర్పడినను, వారాంతమందు కొందరి వింతసహాయమువల్ల కార్యము సానుకూలమయే సూచనలు కనుపిస్తున్నవి. శక్తికి మించిన కార్యభారము పైన వేసుకొనుటవల్ల శ్రమేగాని ఫలితము వుండదు. డబ్బుకు ఇబ్బందులు అడుగడుగునా కలుగుతూ వుంటవి. సకాలములో గృహమందుండువారి అవసరాలు తీరక తిరస్కారభావం కలుగుతుంది. ఉద్యోగులకు, వ్యాపారస్తులకు మంచికాలముకాదు. విద్యార్థులకు చదువు సాగక, వినోదాలతో కాలం గడుపుతారు. 19 నుంచి కొంతస్థిమితం వుంటుంది.

నూలు, వస్త్రములు :—కొద్దిగా పెరుగుతవి.

నూనెదినుసులు: సమముగా వుంటవి.

బెల్లము, పంచదార, చింతపండు :- మార్పు వుండదు.

ఆహారధాన్యములు:-మందముగా వుంటవి.

పప్పుదినుసులు :-అనుకూలముగా వుంటవి.

వెండి : కొంచము హెచ్చి, తిరిగి మందగిస్తుంది.

బంగారము : నిలకడగా వుంటుంది.

16, 19, 20, 21 తేదీలలో సువృష్టి.

* * *

జన్మనక్షత్రమునుబట్టిగాని, జన్మనక్షత్రము తెలియనివారు నామనక్షత్రము (వారివారి పేర్లననుసరించి పేరు మొదటి అక్షరము)ను బట్టిగాని ఫలములను చూచుకోవలెను. కృష్ణుడను పేరుకు మృగశిరానక్షత్రమును, కృష్ణుడను పేరుకు స్వాతీనక్షత్రమును, శ్రీధరుడను పేరుకు చిత్తానక్షత్రమున్నూ, క్షేత్రపాలకుడనే పేరుకు హస్తానక్షత్రమును, జ్ఞానుడనే పేరుకు ఆరుద్రానక్షత్రమును, భీముడు భైరవుడు అనే పేర్లకు పూర్వాషాఢనక్షత్రమును చూచుకోవలెను.

20వ పరిస్థితులలో మార్పు. 21,22 తేదీలు అశాంతి; ఖర్చులు ఎక్కువ.

స్వాతి [రూ, రే, రో, తా]

ఈ వారమున ఆర్థికలోపము ఎక్కువగా వున్నను, సకాలములో యత్నకార్యములు అనుకూలించకపోయినను, ఖర్చులు అమితముగా కలిగిననూ మీరు సాధుసజ్జన సాంగత్యమువల్ల నేర్చుకొన్న విషయాలద్వారానూ గ్రంథపఠనంద్వారానూ సమకూర్చుకున్న విజ్ఞానమును ఉపయోగించుకొని ధైర్యముతో వుంటారు. మిత్రులనుకున్నవారు తటస్థులుగావుండి వారివల్ల ఆశించిన సహాయము చేతికందక, గృహమందు అశాంతి ఏర్పడుతుంది. ఉద్యోగులకు ఒత్తిడి ఎక్కువ. విద్యార్థులకు శ్రద్ధ తక్కువైనా, క్రొత్తసంగతులు నేర్చుకుంటారు. 19వ క్రొత్తవారిని కలుసుకుంటారు. 20 మార్పు. 21 22 తేదిలలో ఖర్చులు ఎక్కువ, అశాంతి.

విశాఖ [తీ, తూ, తే, తో]

ఈ వారమున కార్యభారము ఎక్కువగుటచేతను శ్రమ అధికము. సమయమునకు అనుకున్న సహాయము దొరక్కపోవుటచేతను

నక్షత్రఫలితాలు

ఆదాయము తక్కువగా యుండుటచేతను, నీచులతో వివాదము పడడమువల్లనూ మీ హోదా కొంతదెబ్బతింటుంది. గృహములో కలతలు కలుగుతాయి. అనారోగ్యము కలిగే సూచనలు కనపడుతవి. క్రొత్త వ్యాజ్యములు కలుగవచ్చు. ఉద్యోగస్తులకు యజమానుల వల్ల అధికమైన ఒత్తిడి కలుగుతుంది. 19 న కొంత ఊరట; 20 న పరిస్థితులలో మార్పు. 21,22 తేదిలలో వినోదముగా గడపాలనుకున్ననూ భంగము కలుగుతుంది.

అనూరాధ [నా, నీ, నూ, నే]

ఈ వారమున యత్నకార్యములు నెరవేరకపోవుటచేతను, మిత్రులనుకున్న వారు తటస్థముగా వుండడమువల్లను, సోదరవర్గమువల్ల ఆశించిన సహాయము సకాలమునరాకపోవుట చేతను మనోవ్యధ కలుగుతుంది. వాడి వస్తువులు తగులుటవల్ల గాయము కలిగే ప్రమాదము వుంది. ఉద్యోగులకు అన్నివిధములా ప్రతికూలంగా వుంటుంది. బడిపిల్లలకు చదువుమీదకన్న వినోదముల మీద శ్రద్ధ ఎక్కువై ఫలించక, ఆశాభంగము పొందుతారు. 19 న మిత్రులవల్ల లాభము; 20 న మార్పు; 21, 22 తేదిలలో అమిత ఖర్చులు, ఖేదము.

***జ్యేష్ఠ [నో, యా, యీ, యూ] ***

మనశ్శాంతిని సాధించడానికి తగిన అవకాశములు ఈ వారమందు మీకు కలుగుతాయి. మీరు అట్టే ప్రయత్నించకుండానే మీ నేర్పరితనమువల్ల కొన్ని కార్యములు అనుకూలముగా సాధింపబడతాయి. సంఘములో మీ హోదా ఎక్కువవుతుంది. ఉద్యోగులకు అధికారుల ఆదరణ వుంటుంది. కోర్టు వ్యవహారములలో మీ పరముగా తీర్పులు కలుగును. వ్యాపారస్తులకు మేలుకాలము. గృహమందుండువారికి వస్త్రాలంకారములు చేకూరుస్తారు. విద్యార్థులకు జ్ఞానదాయకముగాను, వినోదముగాను గడుస్తుంది. 19 న ఆశాజనకము. 20 న మార్పు, 21,22 వినోదము, అధిక ఖర్చులు; కళాకారులకు, నటీనటులకు యోగం.

మూల [యే, యో, బా, బి]

గత కొద్దికాలమునుండి నెరవేరకుండా వున్న కొన్ని కార్యములు మీకు ఈ వారము లాభదాయకముగా వుంటాయి. సకాలమున మీరు కాంక్షించిన ధనసహాయము పొందుతారు. సంతానవిషయమై సంతోషవార్త ఉత్తరదిక్కునుండి వస్తుంది. శుభకార్య ప్రయత్నాలు నెరవేరుతాయి. కుటుంబమునుండువారికి నూతనవస్త్రాలంకార లాభము. ఉద్యోగులకు తొందరలు వుండవు. 19 నుండి వ్యాపారస్తులకు లాభకరముగా వుంటుంది. విద్యార్థులు లాభించే నూతన విషయాలు తెలుసుకుంటారు. 21,22 తేదిలలో మిత్రులతోను, భార్యాబిడ్డలతోను వినోదముగా గడుపుతారు. పండితులకు, కళాకారులకు మంచికాలము.


పూర్వాషాఢ [బూ, ధ, ఫా, ఢ]

ఈ వారమందు మీకు గతవారము కలిగిన యోగములు ఎక్కువ అవుతాయి. సకాలములో అర్థించిన సహాయ సహకారములు చేకూరి అన్ని పనులను అనుకూలముగా ముగించుకుంటారు. కోరువ్యవహారములలో తీర్పులు మీపరం అవుతాయి. కాని ఖర్చులు ఎక్కువగుటచేత మీకు ఆ ఆనందం నిలవదు. తూర్పుదిక్కునుంచి శుభవర్తమానములు వినవచ్చును. ఉద్యోగులకు వత్తిడి లేకుండా గడుస్తుంది. విద్యార్థులకు అనుకూలముగాను, వినోదముగాను వుంటుంది. 19నుంచి వర్తకులకులాభముఎక్కువ. 21.22 తేదీలు మృష్టాన్నభోజనములతో వినోదముగా గడుపుతారు. గాయకులకు, నటీనటులకు యోగము.

ఉత్తరాషాఢ [బే, బో, జా, జీ]

ఈ వారము అనుకూలముగా కార్యము

(48-వ పేజీ చూడండి)




రాజధాని పరిశుభ్రతకు చర్యలు

శ్రీ కృష్ణ
[ఆంధ్రపత్రిక ప్రతినిధి]

న్యూఢిల్లీలో 'పేవ్ మెంట్లను' ఇక పైనుంచీ పరిశుభ్రంగా ఉంచడానికి అధికారులు గట్టి పట్టుదలతో ఉన్నారని గడచిన నెల 28వ తేదీన ఢిల్లీ పత్రికలు ఒక వార్తను ప్రముఖంగా ప్రచురించాయి. న్యూఢిల్లీలో కొన్ని రోడ్లు "చాకిరేవు"ల్లాగా తయారైనాయని అధిక్షేపిస్తూ ప్రధాన మంత్రి వర్క్సు శాఖామంత్రికి లేఖ వ్రాశారని తెలిసింది. ఈ లేఖను చూసిన తర్వాత భారత ప్రభుత్వం వర్క్సు గృహనిర్మాణ, సరఫరా శాఖ, ఆరోగ్యశాఖ, కేంద్రపబ్లిక్ వర్క్సు కార్యాలయం, న్యూఢిల్లీ పురపాలక సంఘం ప్రతినిధులతో ఒక సారథ్య సంఘాన్ని నియమించింది. ఇదిగాక అధికారుల ప్రాబల్యంలో ఉన్న న్యూఢిల్లీ పురపాలక సంఘం ఒకటి ఉంటూ ఉండగానే "స్థల సౌందర్య" సంఘమని మరో సంఘాన్ని ఇంతకుముందే ఏర్పాటు చేశారు.

న్యూఢిల్లీలో కొన్ని రోడ్లు చాకిరేవుల్లాగా తయారైనాయనే సంగతి న్యూఢిల్లీ అధికారులకు అనేకులు అనేక పర్యాయాలు తెలియజేశారు. అంతేకాదు, న్యూఢిల్లీ నగరమే ఒక మురికి పేటగా తయారవుతోందన్న సంగతిపై ఢిల్లీలో కనీసం రెండు పత్రికలు వారానికొకసారైనా వ్యాఖ్యానిస్తూ ఉంటాయి. అయితే ఇలాంటి విమర్శలన్నా, వ్యాఖ్యలన్నా స్వాతంత్ర్య సిద్ధికి పూర్వం న్యూఢిల్లీలోని "బాధ్యతా రహిత" అధికారులిచ్చినమాత్రపు విలువైనా ఇప్పటి అధికారులు ఇవ్వడం లేదని స్పష్టమైంది. ఇప్పటి పరిస్థితి "ఏనుగుపోతూంటే కుక్కలు మొరుగుతున్నట్లు" ఉంది. విద్యాశాఖామంత్రి, హోంశాఖ మంత్రి ఉపరాష్ట్రపతి నివాస భవనాలున్న ఈ రోడ్లు చాకిరేవుల్లా ఉన్నాయన్న సంగతిని భారత ప్రభుత్వ అధికారులు గాని, అధికారేతరులు గాని ఇప్పటిదాకా పట్టించుకున్న జాడ కనబడదు. ప్రధాన మంత్రి ఒక రోజున యాదృచ్ఛికంగా ఒకానొక రోడ్డుమీద కార్లోపోతూ చాకలివారు ఆరవేసిన బట్టల "జెండాలను, తోరణాలను" చూసి అధిక్షేపించిందాకా మంత్రులెవ్వరూ ఈ సంగతి గమనించనే లేదు. "ప్రజా సంస్కృతి"ని ఉద్ధరించడం కోసం కోట్లకొలది ధనాన్ని వెచ్చించేది మళ్లీ ఈ మంత్రులే!

అటూ ఇటూ చాకలివారు ఆరేసినబట్టలు తప్ప మరే ఆకర్షణాలేని ఒకానొక రోడ్డుమీద తమతో చెప్పాపెట్టాకుండా ప్రధాన మంత్రి కారులో ప్రయాణం చెయ్యడం ఆయా ప్రభుత్వశాఖలకు చాలా ఇబ్బంది కలిగించింది.



జపానులో పదిరోజులపాటు పర్యటించి, ప్రపంచ సమస్యలపై జపాన్ ప్రధానితో చర్చలు జరిపి, జపానీయుల అపూర్వ గౌరవ సత్కారాలందుకుంటున్న భారత ప్రధాని నెహ్రూ.

"ఇంట గెలిచి రచ్చగెలవ"మని ఒక సామెత ఉంది. బోలెడు హంగామాతో ఏర్పాటుచేసిన ఈ "సారథ్య సంఘం" ముందుగా సచివాలయం ఉత్తరపుభాగాన్ని పరిశుభ్రం చేసుకుని ఆ తరవాత న్యూఢిల్లీని శుభ్రం చెయడానికి పూనుకుంటే బావుంటుంది. సారథ్యసంఘ సమావేశకర్త శ్రీ ఎ. వి. వెంకటసుబ్బన్ తనిఖీ చేయవలసింది సచివాలయం పైఅంతస్తులోని మురికి గదుల్ని కాదు—మధ్య అంతస్తులో భారతభావి భాగ్యోన్నతి కోసం మంత్రులూ, కార్యదర్శులు కూర్చుని పనిచేసే గదులను; మంత్రుల, కార్యదర్శుల అంతరంగిక కార్యదర్శులు పని చేసే గదులనుకూడా ఆయనొకసారి తనిఖీ చెయ్యాలి. ఉదాహరణకి ఒక గదిచూస్తే—ఆ గదిలో మనిషి అధికారానికివచ్చిన నాటినుంచి నేటిదాకా దాన్నెవరూ ఊడ్చిన పాపాన పోలేదని అనిపిస్తుంది. ఒకప్పుడు కేంద్ర సచివాలయం ఆసియాకంతటికీ తలమానికంగా ఉండేది. ఈ నాడు దాని పరిస్థితి వేరు. ప్రధానమంత్రి ఒకసారి తీరుబడి చేసుకుని సచివాలయాన్ని కూడా దర్శిస్తే అదికూడా బాగుపడవచ్చు.

ఇదంతా చూస్తే రెండు వికృతవిషయాలు బయటపడతాయి. ఒకటి—ప్రధానమంత్రి కలగజేసుకునేదాకా ఏదీ జరగదు. కింగ్ ఎడ్వర్డ్ రోడ్డును ప్రధానమంత్రి స్వయంగా చూసి బాధపడినదాకా ఆ రోడ్డుమీది చాకి బట్టలు అక్కడి మంత్రులకు, కార్యదర్శులకు, ఇతరులకు కంటబడలేదు.

అయితే ప్రధానమంత్రి ఎన్ని విషయాలని స్వయంగా పర్యవేక్షించగలరు? కేంద్ర మంత్రివర్గం సమష్టి బాధ్యత సూత్రంపై పని చేస్తోందని అంటారు. మరి మిగతా మంత్రులెవరూ తమ తమ కర్తవ్యాల నెందుకు నిర్వర్తించరో అనూహ్యం!

ఇక సారథ్యసంఘం—చట్టాలను ప్రవేశపెట్టడమే ఘనత అయితే భారత దేశం ప్రపంచదేశాలన్నిటికీ శిరోభూషణంగా

★ న్యూఢిల్లీ లేఖ ★

ఉండదగిన దేశమే. కల్తీ చెయ్యడం నేరమని కొన్ని శాసనాలు అమల్లో ఉన్నాయి. కాని ఢిల్లీలో తోటల ఎరువుకూడా కల్తీలేనిది దొరకదూ అంటే, ఆహార పదార్థాలవిషయం వేరే చెప్పాలా? వండిన పదార్థాలను, కోసిన పండ్లను బజార్లలో అమ్మరాదని నిషేధం ఉన్నది. కాని న్యూఢిల్లీలో ఎక్కడచూసినా ఈ నిషిద్ధవస్తువుల అమ్మకమే ముమ్మరంగా సాగుతూ ఉంటుంది. న్యూఢిల్లీలో ఇళ్ళలోపల ఆవులను ఉంచరాదని 'ఉప నిబంధనలు' ఉన్నాయి. కాని ఈ ఉప నిబంధనలను శ్రీ సిరాజని న్యూఢిల్లీలో ప్రతి రెండో ఇంట్లోనూ, ముఖ్యంగా మంత్రులఇళ్లల్లో ఆవులో, గేదెలో ఏవో ఒకటి కనబడుతూనే ఉంటాయి. నే నిదివరలో చెప్పినట్లు, స్వతంత్ర భారతంలో మొదటి దెబ్బతిన్నది కషపడి, నిజాయితీగా పని చెయ్యాలనే శ్రద్ధ. బ్రిటిష్ హయాంలో పన్నెండుగంటలసేపైనా పనిచేసిన అధికారు లిప్పుడు కేవలం ఇతరులు పనిచేస్తుంటే చూస్తూ కూర్చోడంతో అలిసిపోతున్నారు. ఇదికాక పార్లమెంటు సభ్యులు మొదలైన వారిమూలంగా ప్రజాస్వామిక పరిపాలనం సాగడం కష్టమైపోతోంది. వీరు దైనందిన పరిపాలన వ్యవహారాలలో కలగజేసుకుని, అప్రయత్నంగా అవినీతికి తోడ్పడినవారవుతున్నారు.

మునిసిపల్ ఉద్యోగులు కొత్తపద్ధతులు అవలంబిస్తున్నారు. వీరు ఒక సమస్య బయలుదేరడానికి తోడ్పడతారు. చివరికి దాన్ని పరిష్కరించడం వారికి తలకు మించిన పని అయిపోతుంది. సైకిళ్లపై తిరుగుతూ వ్యాపారం చేసేవాళ్లు ఇందుకు ఉదాహరణ. న్యూఢిల్లీ పరిసరాల్లో వ్యాపారం చేసుకోవచ్చునని వీరికి మొదట అనుమతి ఇచ్చారు. ఇప్పుడు ఈ సైకిల్ వాలాలు సచివాలయంప్రాంతంలో కూడా వ్యాపారం సాగిస్తున్నారు. ఈ సైకిల్ వ్యాపారస్థులు కొద్దిమందే ఉండేరోజుల్లో పురపాలకసంఘం వారినిఅరికట్టలేదు. ఇప్పుడు వారు నేలయీనినట్లు బయలుదేరారు. వారికొక సంఘంకూడా ఏర్పడింది. ఇప్పుడు వారిష్టం వచ్చినచోట వ్యాపారం చేస్తున్నారు.

న్యూఢిల్లీలోతప్ప ఇంకెక్కడా టాక్సీ స్టాండులు నివాసప్రాంతాలుగా ఉండవు. న్యూఢిల్లీలోమాత్రం టాక్సీ స్టాండుల్లో డ్రయివర్లు మంచాలు వేసుకునిపడుకుంటారు. ఈ మంచాలు నగరసౌందర్యాన్ని ఇనుమడింపజేస్తూ ఉంటాయి!

ఇండియా గేట్ ప్రాంతంలో ఒక

మార్కెట్టు అయిదేళ్ళనుంచీ ఛండాలపు పరిస్థితుల్లో ఉంటోంది. దాన్ని తొలగించాలని ఎన్నిసార్లు ప్రయత్నం జరిగినా 'మానవ కారుణ్యం' అడ్డురావడం మూలంగా వీలులేక పోతోంది. వండినపదార్థాలు అమ్మే వాళ్లపైనే మానవకారుణ్యం ప్రసరించి, ఆ పదార్థాలు తిని రోగాలు తెచ్చుకునే వాళ్లపైన ప్రసరించదుగాబోలు! వాళ్ళు మానవులు, కొళ్ళు ఆవులకంటే తక్కువ రకం జంతువులు కాబోలు!

మరో ఉదాహరణ! రిజర్వ్ బ్యాంక్



గత మాసం 30 వ తేదీ రాత్రి కీర్తిశేషులైన మద్రాసు గవర్నరు శ్రీ ఎ. జె. జాన్. వీరి వయస్సు 64 సం॥. తిరువాన్కూరు సంస్థానంలో న్యాయవాదిగా పేరుపొంది, తరువాత రాజకీయాల్లో ప్రవేశించారు. కాంగ్రెసు వాదిగా కారాగారశిక్ష అనుభవించారు. తిరువాన్కూరు భారత యూనియన్‌లో విలీనమైనతరువాత శాసనసభ సభాపతిగా, ఆర్థికమంత్రిగా, తిరువాన్కూరు కొచ్చిన్ ముఖ్యమంత్రిగా, హోం మంత్రిగా అనేకవిధాల ప్రజాసేవచేశారు. గత నవంబరునుంచీ మదరాసు గవర్నరు గా పని చేశారు.

పక్కన ఒక మార్కెట్ తయారవుతోంది. ఈ మార్కెట్ ఒక గోడమీద పెట్టిన షాపుతో ముందు ప్రారంభమైంది. ఇప్పుడు ఆ దుకాణం యజమాని వ్యాపారం అభివృద్ధి అయింది. ప్రధానమంత్రికి చూపించడానికి గాపును అతడొక మంచంకూడా అక్కడ ఏర్పాటు చేసుకున్నాడు!

ఈ సారథ్య సంఘాలు, ఇతర సంఘాలు — వీటిని తలుచుకుంటే చాలా బాధకలుగుతుంది. దర్యాప్తు చేయడానికి కష్టంలేనప్పుడు ఇలాంటి సంఘాలు వేస్తూఉంటారు. ఎన్ని సంఘాలు వచ్చినా, కొద్దిరోజుల్లోనే కింగ్ ఎడ్వర్డు రోడ్డులో మళ్ళీ చాకిరేవులు ప్రారంభమవుతాయి. మనుషులు ఎవరిపని వారు సక్రమంగా చేసేటట్లయితే ఈ సంఘాలే అనవసరం. సంఘాల వల్ల అధికారులకు గొప్పపేరూ వగైరా రావచ్చుగాని, పనిమీద శ్రద్ధమాత్రం కలగదు.


మరోవిషయం. న్యూఢిల్లీ రోడ్లపక్కన ఉండే అందమైన వృక్షాలను కేంద్రప్రభుత్వపు నాల్గవ తరగతి సిబ్బందికి వంటచెరకుగా ఉపయోగపడేందుకు ఒకప్పుడు నరికివెయ్యడం జరిగింది. విదేశీరాయబార కార్యాలయోద్యోగి ఒకాయన న్యూఢిల్లీనుంచి స్వదేశం తిరిగివెళ్లి, పైన చెప్పిన విషయమై ఒక వ్యాఖ్య చేశారు. చేసీ చేయగానే ఆదేశంలో ఉన్న భారతరాయబారి ఆవ్యాఖ్యను భారత విదేశాంగశాఖకార్యాలయానికి తెలియజేశారు. వెంటనే న్యూఢిల్లీ వృక్షాలకు జరుగుతున్న అన్యాయానికి ప్రధాన మంత్రి ఆగ్రహించి పురపాలక సంఘానికి ఒక లేఖ వ్రాశారు. న్యూఢిల్లీ వృక్షాలపై మనుషులు, పశువులుచేస్తున్న అత్యాచారాలను అరికట్టడానికి పురపాలక సంఘం సమావేశమై ఎనిమిదిమంది చాకీదార్లను వృక్షరక్షకులుగా నియమించారు. ఇది నాలుగేళ్ళ కిందటి సంగతి. దీన్నందరూ ఇప్పుడు మరిచిపోయారు కాని ఆ ఎనిమిదిమంది చాకీదార్లు ఇంకా ఉద్యోగంలోనేఉండి బహుశా జీతం ఎక్కువ చెయ్యండని ఆందోళనచేస్తూ ఉండి ఉండాలి. ఏమైతేనేం న్యూఢిల్లీ వృక్షాలపై అత్యాచారం ఇంకా సాగుతూనే ఉంది.

* * *

1957 లో వచ్చినపుస్తకాల్లో కల్లా సైమన్ డి బోవార్ వ్రాసిన "ది మాండరిన్స్" అనే పుస్తకం చాలా సంచలనం కలిగించింది. నేటి పోర్చుగల్ పరిస్థితులను రచయిత్రి ఈ పుస్తకంలో చిత్రించింది. గోవాతగాదా దృష్ట్యా ఈ పుస్తకం అంతా శ్రద్ధగా చదవదగినది. లిస్బన్ పరిస్థితిని ఆమె ఇలా వర్ణించింది.

"కాళ్లకి జోళ్ళయినా లేనిస్త్రీలు గుమ్మాల ముందుకూర్చుని కుంపట్లమీద చేపలు వేయిస్తూ ఉంటారు. మరిగిన నూనెవాసన, చేపలవాసన కలిసి ఒకదారుణమైన కంపుగా తయారై ఆప్రాంత మంతటినీ దుర్భరంగా చేస్తూఉంటుంది. వీధుల్లోకి తలుపులు తెరుచుకుని ఉండే కొంపల్లోకి చూస్తే ఒక్క మంచంగాని, ఒకుర్చీగాని, ఓ పటంగాని

(56-వ పేజీ చూడండి)



విక్రమార్కుడి మార్కు సింహాసనం

బాక్సాఫీస్ హిట్ కాబోయి మూడో రోజునే మానేసిన సినిమాలా, ఛాన్సు వస్తోందని గబుక్కుని ఉత్సాహపడబోయి, గారంటీలేదని జ్ఞాపకంరాగానే ఉసూరు మన్నాడు రాజు. అని వెనక్కి మళ్లి స్టుడియో వేపు మెల్లిగా నడకసాగించాడు. కడుపులో కామేశ్వరరావు హాల్లో అంటు న్నాడు. జేబులో ధనపతిరావు 'నిల్లో' అంటున్నాడు. ఇందాకటి కారువాడికి ఉన్న దంతా ఊడ్చి ఇచ్చేశాడు. ఇపుడు శోష వచ్చేలాఉంది. గబుక్కుని సినిమాఛాన్సు వచ్చేస్తే యాక్టు చెయ్యడానికి కూడా ఓపిక ఉన్నట్టులేదు.

గుక్కెడు కాఫీపోస్తే అల్లరి చెయ్యను అని ఆశపెడుతున్నాడు కామేశ్వరరావు.

"వాడిమాటకేంలే. ముందర కాఫీ పంపు. ఆనక ఆలోచిస్తాం పనిలోకి వచ్చేదీరానిదీ" అంటున్నాయి కాళ్ళూ చేతులూ.

రాజు కాస్త తటపటాయించి, తెగించి, 'సార్' అనేశాడు ఎదురుగా వస్తున్న ఒక సుబ్బారావుని ఆపి.

'సార్ మాది మొవ్వారం...సినిమాలో చేరాలి. ఇఫ్ యు డోంట్ కేర్. గివ్ మి— కాఫీ తాగాలండి. ఓ బేడ కావాలి. మళ్ళీ ఇచ్చేస్తాను" అన్నాడు.

సుబ్బారావు తెల్లబోయి నిల్చున్నాడు అర్థంకాక...అయ్యాక పకాలున నవ్వాడు. ఆనక దిగులుమొహం పెట్టాడు.

"పాపం..."అన్నాడు. "కాఫీ యా" అన్నాడు...ఇంకోక్షణం ఆగి 'ఇక్కడా?' అన్నాడు.

'ఔనండి' అన్నాడు రాజు విచారంగా వినయంగా.

"కాస్త ఇసింటా రండి కారుకింద పడ తారు. ఇక్కడ మహాదూకుడుగా పోతారు. ...సరిగ్గా రెండేళ్ళ క్రితం నేను అచ్చు ఇలాటి సన్నివేశములోనే పాల్గొన్నాను... బొంబాయిలో లెండి...అవాళా మీలాటి వాడే కాఫీ గురించే బతిమాలాడు. ఎటొచ్చి అతనికి కొంచెం పేరుంది లెండి. పెళ్ళి పెడా కులూ లేవోమో బాగా పొగరుగా ఉండే వాడు. అంటె ధైర్యం అనుకోండి. ఓరోజున నేను ఓస్టుడియో గేటుదగ్గరకి వెళ్లాను; ఇప్పుడు మీరు వెళ్ళబోతున్న దే...కాని ఆశ్చర్యం! నన్న ఆ రోజున ఏ గూర్ఖా ఆపలేదు! పైగా జాయియే జనాబ్ ... జాయియే. అందర్ జాయియే అని ఆహ్వానించాడు. జనం తండోపతండాలుగా లోపలికి పోతున్నారు. స్టుడియోలో ఔట్‌డోర్ దృశ్యాలు తీసేందు కని అట్టే పెట్టిన ఖాళీస్థలం అంతా నిండి ఉంది.

వి. పార్థసారథి

దొరికిందే ఛాన్సు అని దూసుకు పోయాను నేను.

ఆ మధ్యన ఒక ఆసామి చేతులు కట్టుకు నిల్చున్నాడు. ఎదురుగా ఐదారుగురు పెద్ద మనుషులు చక్కగా ముస్తాబై నిలబడ్డారు. వాళ్ళముందర బాగా పెద్ద మనిషి ఒకడు ఉన్నాడు. అతనే ఓనరుడుట.

ఇవతలగా ఉన్న జనం చాలమందికి సంగ తేమిటో తెలీదు కాబోలు. కాని, తెలిసిన వాళ్ళంతా ఊహూ జాలిపడిపోతున్నారు దేనిమీదో ఎందుకో.

మధ్యన ముద్దాయిలా నిల్చున్న అతను గజ గజ వణికిపోతున్నాడు కారక్టర్ యాకర్ లా.

అతను చాలా ఘోరనేరం చేశాడట. నేను కనుక్కున్నానులే.

అతను కొత్తగా పైకొస్తున్న రైటరన్న మాట. రైటరంటే రచయిత.

ఓ పిక్చరుకి డైలాగులు రాస్తున్నాట్ట. ఆ పిక్చరు హీరో చాలా పెద్దవాడు. బోల్డు గొప్పవాడు. అందరికీ భయంటే. అతను ఇంకోళ్లు రాసిన డైలాగులు అనడు. రచయిత రాసినవి ముసాయదావి అనమాట. అవిమాని సొంతంగా ఇంకో వాక్యం కట్టి దాన్ని డజను ముక్కలుగా విరకొట్టి, మరీ అంటాడు చక్కగా. అనుభవం, కీర్తి ఉన్న పెద్ద రైటర్లెవరూ అతని 'మాట' కాదనరు.

ఈ ముద్దాయికి ఆ సంగతి తెలీదుట. తెలీక, ఆ హీరో ఇతని డైలాగు చింపేసి కొత్తది కుడుతూఉంటే, 'అయ్యో దాన్ని' చంపకండిసార్! అని ఏడిచేశాడు.

'హా! తెరీ ... నేను ఊరికే చింపుతూ ఉంటేనే చంపుతున్నవని అరిచావా. ఇపుడు నిజంగానే చంపేస్తాను కాసుకో" అని కొప్పడి అంతపనీ చేసేశాడు ఆ హీరో. ఈ రైట్రు వల్ల కాదు అన్నాడు.


'అయితే ఏడూ' అనేసి హీరో ఆపళంగా ఇంటికెళ్ళిపోయాడు.

ఇంకేముంది? కొంపలు మునిగె.

హీరో అంతవాడిమాటకి రైటరు...ఉత్తి రైటరుగాడు జవాబిస్తాడా...పుట్టగతు లుం డాలనే? బతికి బాగుపడాలనే? బతికి బాగు పడాలనే?...అని అందరూ ఆశ్చర్యపడి చాలాసేపటికి లేచారు. ఈలోగా అన్ని స్టుడియోలకీ ఈ కబురు పాకిపోయింది. ఈలోగానే ఎమర్జెన్సీ మీటింగు జరిగి పోయింది. కోపంవచ్చిన హీరోగారి సెక్రటరీ అధ్యక్షత వహించాడు.

ఈ ఫలానా కవిగాడు ఇంత ధైర్యంగా జవాబెలా ఇచ్చాడు? వాడురాసిన కథ, మాటలూ వాడి బాబుగాడి సొత్తనుకు న్నాడా?...అసలు వీడికిన్ని దమ్ము లెక్క డివి? అని చర్చజరిపారు. అందరూ గంభీ రోపన్యసించి పారేశారు. సినిమా రైటరుగా చేరి ఏడాదిదాటినా వీడి కింత స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు, ధైర్యం, తనూ మనిషే,

(56- వ పేజీ చూడండి)


ఆంధ్ర ప్రదేశ్
అంతటా
అక్టోబరు
విడుదల!
శ్రీరంజని... అమరనాధ్
కృష్ణకుమారి.. సి.యస్.ఆర్..చలం
గిరిజ
రమణారెడ్డి
విఠల్ ప్రొడక్షన్స్
వద్దంటేపెళ్లి
నిర్మాత, దర్శకుడు... బి.విఠల ఆచార్య...
కృష్ణా పిక్చర్స్ రిలీజ్
FLOODLIGHT
RAMDAS K

అవసరాలు

"శివం"

ఆ పూరి పాకలోనుంచి ఎప్పుడూ నవ్వులు విన్పిస్తూంటాయి. పండగా లేదు, పర్వ దినమూ లేదు, ఎప్పుడూ ఆనవ్వులు అట్లా వినవస్తూనే వుంటాయి.

ఆపాక మేముండే డాబా ప్రక్కన. వాళ్ళు మాయింటికి నీళ్ళకు వస్తూంటారు గనక, మా ఆవిడను అడిగాను. అతనికేం పనని ? ఎక్కడో ప్రెస్‌లోపనని మావాళ్లు చెప్పారు.

ఆపాకలోంచి మళ్ళీ నవ్వులు వినవస్తూం డగా, మా ఆవిడ గొడవచెయ్యడం మొదలు పెట్టింది—"ఏమండీ ? ఆ చిల్లర బాకీలన్నీ అట్లాగే వున్నాయి..." అంటూ.

"అబ్బబ్బ ! మళ్ళీ మొదలెట్టకు ఆ సొదంతా. ఇవ్వేళనే ఎక్కడో తెచ్చి పారవేస్తా...నన్ను విసిగించకు," అని విదిలించి సోమేశ్వరాన్ని వెతుక్కుంటూ వాళ్ళఇంటికి వెళ్లాను. 'ప్రెస్' లో వుంటా రని ఆవిడ యిచ్చిన సమాధానం విని, మళ్లా ఆ—ప్రెస్‌కు బయలుదేరాను.

అందంగా అమర్చిన మేజాముందు, ఓ కుర్చీలో కూర్చుని వున్నాడు ఠీవిగా సోమేశ్వరం.

"ఏమిటోయి, ఈ అదృష్టం ఎప్పటి నుంచి !" అన్నాను.

"సరిలే ! ఇందులో నేను వర్కింగ్ పార్టనర్‌గా నీకు తెలియదా ఏం ? ఆర్నెల్ల నుంచీ."

"అహా ! నష్టంలేదుకదా ! నెలకేమాత్రం గిటుతోంది నీవాటాకి ?"

"ఏదో రెండువందలు గిడతాయి. మేనేజ్‌మెంటు చేస్తున్నందుకు మరో 200 ఇస్తారు."

"ఎంత అదృష్టమోయి !" అనేసి నాలుక కరుచుకున్నాను.

అదృష్టవంతుడిని, అదృష్టవంతుడంటే, మనం ఎక్కడ దిష్టికొడతామో అన్నట్లు వెంటనే చచ్చుమొహంపెట్టి, తన దుర దృష్టాన్ని వర్ణిస్తాడు. సరిగ్గా సోమేశ్వరం కూడా అపనే చేశాడు.

అతడి దురదృష్టాన్నిగురించి వినడానికి సిద్ధపడుతూ, బల్లమీది 'గోల్డుఫ్లేక్ టిన్' లోని ఓసిగరట్ తీసి వెలిగించుకున్నాను.

"ఇదంతా అదృష్ట మనుకుంటున్నారా ? ఈ 'వర్కర్స్'ని ఒక్క నెలరోజులు 'మేనేజ్' చేసిచూడు-తెలుస్తుంది ! అసలు ప్రెస్ మూసేసుకుని ఎక్కడకైనా వెళ్ళి పోతే బాగుండు నన్పిస్తుంది. అబ్బబ్బ ! వీళ్ళతో మహా చెడ్డచికాకులే !" అన్నాడు.

"అదేం, సరిగా పనిచెయ్యరా ?" అడిగాను.

"పనెందుకు చెయ్యరూ, చేస్తారు. కాని వీళ్ళుచేసే గొడవలు భరించలేము. వీళ్ళకు తోడు 'ఎలెక్ట్రిక్ కరెంట్' ఒకటి సరిగా సప్లయిఅయిచావదు. 'ఎక్స్ప్రె'పని చేయిద్దా మనుకున్న రోజున సరిగ్గా కరెంటు బందయి ఊరుకుంటుంది! ఇంకఆ 'మెషీన్స్' వున్నాయి లోపల! అకస్మాత్తుగా వాటి కేదో రోగం వస్తుంది! ఒకరోజు ఒకో 'భాగం' వదులయి పోవడమో, విరిగి పోవ డమో, అదృశ్యమయి పోవడమో జరుగుంది. దానితో నాలుగయిదు గంటలు పని పాడు! 'మెకానిక్' వూళ్ళోకివెళ్ళి అది తీసుకొచ్చి బిగించేవరకు పనంతా నిల్చిపోవలసిందే! ఒక్కొ గంటపని ఆగితే ఎంతనష్టమో తెలుసా-"

"నమస్కారమండి," నల్లగా పొట్టిగా వున్నాయన ఒకాయన నమస్కరించాడు.

"ఓ.మీ రా...రండి. కూర్చోండి. రాములుగారూ!"

రాములుగారు కుర్చీ మీద కూర్చున్నాడు గాని, ఆవెనకే మాసినచొక్కా, గడ్డమూ, ఖాకి నిక్కరు వ్యక్తి వినయంగా నిలబడే వున్నాడు.

"మన బాబూరావు విషయం మాట్లాడదా మని వచ్చాను. దీనికేదో సంజాయిషీ యిమ్మ న్నారుట తమరు.?" అంటూ నాలుగయిదు కాగితాలు కలసివున్న బొత్తిని ఆరాములు గారు సోమేశ్వరానికి అందించాడు.

నేను కొంచెం కుతూహలంతో గమనించ సాగాను.

"సంజాయిషీ అడిగింది నేను కాదు. మా పార్ట్నర్ అయివుంటాడు. అయినా నేనడిగినట్లే!" అంటూ కాగితాలన్నీ చూశాడు సోమేశ్వరం.


ఇంతలో ఒకాయన లోపలనుండి వచ్చి 'ఆ! నేనే అడిగాను.ఏమోయి,బాబూరావు, నిన్న సంజాయిషీ యిమ్మంటే మాట్లాడ కుండా అట్లా వెళ్ళిపోయావే-ఏమిటా తల బిరుసుతనం"?

బాబూరావు తలవంచుకున్నాడు మౌనంగా. బక్కచిక్కివున్న. అతడివైపు చూశాను. ముఖం ఏదో జ్వరం తగిలిన వాడిలా అవ్వస్థుడిది మాదిరిగా అగుపిస్తోంది.


"ఏం మాట్లాడవేం?"

అతను అప్పటికీ మాట్లాడలేదు.

"అయిన దానికీ కాని దానికీ సెలవులు పెట్టెయ్యడం, ఏమిటయ్యా యిదంతే 'యూనియన్' వాళ్ళను పిల్చుకు రావడం?



స్టాన్‌వాక్ స్కాలర్‌షిప్‌పై అమెరికాలో ఉన్నత విద్యాభ్యాసానికి వెళ్ళిన ఆంధ్ర విద్యార్థి శ్రీ చెలుకుపల్లి ఈశ్వర నెహ్రూ. న్యూయార్కు కొలంబియా విశ్వవిద్యాలయం (న్యూయార్కులో) భూగర్భ శాస్త్రంలో శిక్షణ పొందుతారు. భారత ప్రభుత్వం వీరితోపాటు మరి ఇద్దరు విద్యార్థులను కూడా అమెరికా పంపింది.



"మీ రాబోయే చిత్రంలో వారిని హీరోగా బుక్ చేయడానికి వీలువుండదేమో! వారు ఈవేళ అధ్యక్షత వహిస్తున్న మన మంత్రిగారు!"

★ అవసరాలు ★

ఇదేనా నీకు తెల్సింది? సంజాయిషీ యివ్వడం తెలియదేం?"

"కోప్పడకండి గోపాల్రావు గారూ! అతని వంట్లో బాగుండక సెలవు పెట్టాడు. నిన్న కూడా అతను రావలసినది కాదు గాని మీరేమన్నా అంటారని భయపడి వచ్చాడు. అట్లాగే రోగంతో సాయంత్రం వరకు పని చేశాడు."

"అదిసరేనండి. సంజాయిషీ అడిగితే కాగితం జేబులో పెట్టకుని మాట్లాడక వెళ్ళిపోతాడేం నిన్న" గోపాల్రావు యింకా మండిపడుతూనే అన్నాడు.

"ఆ కాగితం పుచ్చుకుని మీరేమన్నా చర్య తీసుకుంటారేమోనని భయపడ్డాడు, అంతే. వాడికి ఏం రాయాలో, ఎట్లా రాయాలో తెలియదు చూడండి," అన్నాడు రాములుగారు వినయంగా.

"అంటే మాకు చర్య తీసుకోడంతప్ప మరేమీ పని లేదన్నమాట! అసలు ఈ ఆరు నెలల్లో అతనెన్నాళ్లు సెలవు పెట్టేడో చూడండి. 20 రోజులు. ఇట్లా ముప్ఫయి మంది వర్కర్లు రోజుకి నలుగురు చొప్పున సెలవు చీటీలు పంపిస్తూవుంటే మా ప్రెస్సు పనిచెయ్యాలా — మూసుకోవాలా? ఆ-మీరే చెప్పండి? పోనీ ముందుగా చెబితే ఫర్వాలేదు...కొందరు అసలు చీటీయే పంపరు. కొందరు మనిషిచేతన్నా కబురంపించరు. ఎట్లా చెప్పండి?"

"అనవసరంగా సెలవుపెడితే వాళ్ళకు మాత్రం జీతం నష్టం కాదండి? ఎంతో అవసరం వుంటేనే వాళ్లూ పెడతారు. ఒకసారి వాళ్ళ అమ్మకు జబ్బుచేస్తే సెలవు పెట్టాడు-8 రోజులు. ఆవిడ పోయింది తీరా. అప్పుడు మరో 3 రోజులు. తర్వాత భార్యా పిల్లలకు 'ఫ్లూ' వచ్చింది. అప్పుడు చేసే పెద్దదిక్కు లేక 4 రోజులు. యీ మధ్య తనకి జ్వరంవచ్చి రెండు రోజులు. యిట్లాగే అవసరం వస్తేనే పెడతాడు."

"రోగం వస్తే సరేనండి! అంతకు మునుపు నేను అతన్ని అనేక సార్లు బజార్లో చూశాను. ఒంట్లో బాగుండలేదని ఒకోరోజు సెలవుపెట్టి బజార్లో తిరుగుతున్నాడు. రెండుసార్లూ అట్లాగే కన్పించాడు. కాదనమనండి."

"ఏంవోయి బాబూరావు-నిజమేనా?"

"కన్పించేనండి. కాని నా వంట్లో బాగుండనిమాట కూడా నిజమేనండి. ఏదో అవసరంవుండి."

"చూశారా నేను చెప్పలేదూ? ఒకటి, రెండుసార్లు అతని మాటలు అబద్ధమని తేల్చాక, యింకెట్లా నమ్మేది? అసలు అదీ ముఖ్యం! పోనీ, సంజాయిషీ అడిగినప్పుడు ఎందుకు ఇవ్వలేదంట? నేనేమన్నా చేస్తానని భయపడతాడా? భయమున్న మనిషైనా యిట్లా సెలవులు పెట్టి బజారుల్లో తిరిగేది?"

బాబూరావు ఏదో అనబోయేడు, కాని మాట్లాడలేకపోయాడు.

"మనలో మనం సర్దుకుపోవడం మంచిది. తెగేదాక లాగడం అనవసరం. ఈసారికిట్లా పోనివ్వండి. ఇకనుంచి అతని ప్రవర్తన బాధ్యత నాది." అన్నాడు రాములుగారు మృదువుగా నే.

"మధ్య మీ బాధ్యత ఏమిటండీ? అతను పనిచేస్తున్నాడు, మేం డబ్బిస్తున్నాము. తిన్నంగా చేస్తాడా చెయ్యమనండి. చెయ్యాక పోతే మానివెయ్యమనండి. అంతే గాని ఒంట్లో బాగుండలేదని పనికి రాకుండా వూళ్ళో తిరిగితే-"

"మీరట్లా తొందరపడతారనే అతను నిన్న సంజాయిషీ యివ్వడానికి భయపడ్డాడు."

"అంటే మేము మనుష్యులు కాదన్న మాట! మాకు తెల్సినదల్లా తొందరపడటమే నన్నమాట!"

అంతవరకు దీర్ఘాలోచనలో వున్న సోమేశ్వరం. గోపాల్రావు వైపు తిరిగి అన్నాడు, "నువ్వు లోపలికెళ్ళు గోపాలం! నేను చూస్తానులే యీ వ్యవహారం."

గోపాల్రావు మరో నిమిషం అక్కడ వుండి, సిగరెట్ ఒకటి వెల్గించుకుని, గొణుక్కుంటూ లోపలికి వెళ్ళిపోయాడు.

"చూడండి రాములుగారూ! మీరు చెప్పినట్లు యిలాంటి విషయాలు పరస్పర సహకారంతోటే జరుపుకుపోవాలి. జబ్బువస్తే తప్పక సెలవు పెట్టవలసిందే, ఎవ్వరూ వద్దనరు. కాని చెప్పా చెయ్యకుండా మానేస్తే, మా పనంతా యిక్కడే ఆగిపోతుంది, చూడండి. అవతల 'కష్టమర్స్' చేతా మేం మాటపడాలి, యివతల ఆర్థికంగానూ నష్టపడాలి. అప్పటికప్పుడు యింకో మనిషిని వెతుక్కోవాలన్నా మాకు యిబ్బందే. పనివాళ్ళని యిబ్బంది పెట్టాలని మాకు ఎప్పుడూ వుండదు. మాకేదో నాలుగు డబ్బులు మిగలాలని, వాళ్ళూ బ్రతకాలని మా కోరిక కూడాను. అతను నిజంగా జబ్బుండే సెలవుపెట్టేడో, వేరే పనుండే మానేసేడో మీకూ నిజం తెలియదు, మాకూ తెలియదు. అందుకని మనం ఓ పనిచేస్తే బాగుంటుంది... అతన్ని ఓ 'మెడికల్ సర్టిఫికేట్టు' పంపించివెయ్యమనండి. దానితో పాటు ఎన్నాళ్ళు సెలవు కావాలో అన్నాళ్ళకి ఓ సెలవు చీటి జత చెయ్యమనండి. ఇందులోనూ దొంగ 'సర్టిఫికేట్లుంటాయి' కాని దానికి మన మేమీ చెయ్యలేం. ఇదే నాకు తోచిన మార్గం" అన్నాడు సోమేశ్వరం.

రాములుగారు తలవూపి "బాగుంది. మీరు చెప్పినది బాగుంది. కాని దీనివల్ల పనివాళ్లకి మరికొంత అదనపు ఖర్చనుకుంటాను."

"అవొచ్చు. దానికి మన మేమీ చెయ్యలేం. వీళ్ళకి నిజాయితీ మీద ప్రేమ పుట్టించడం కాదుగా మాపని. అది మీలాంటివాళ్లు మీరు చెయ్యాలిసిన పని. ఇటువంటి దొంగ 'కేసులు', దొంగ సెలవులు ఎక్కువ కాకుండా చూసుకోడమే మా పని" అనివాడు సోమేశ్వరం.

"అవును. గాని వాళ్ళు మిమ్మల్నెట్లా నమ్ముతున్నారో, మీరూ అట్లాగే వాళ్ళను నమ్మడం, ఉభయుల సఖ్యతా గట్టిపడటానికి మార్గమేమో?"

"మంచిదే కాని వాళ్ళు మమ్మల్ని నమ్మినదెది? నిజం చెబితే సెలవు దొరకదని ముందే భయపడి అబద్ధాలు ఆడతారు. సంజాయిషీ అడిగితే సమాధానం యివ్వకుండా కూడా 'లీడర్స్' దగ్గరకు పారిపోతారు. అయినా నేనొకటి అడుగుతాను, చెప్పండి! ఈ చిన్న వ్యవహారంలో మీరు యింతదూరం రావాలా? నిన్న ఏదో సమాధానం యిచ్చేస్తే ఇవేళ్టి యీ 'మెడికల్ సర్టిఫికేట్సు' పుట్టేవి కాదు గదా?"

"మీరేదో చేస్తారని వాడు భయపడ్డాడులెండి. సరే, అట్లాగే సర్టిఫికేట్ తీసుకొని పంపించవోయి, బాబూరావు. మరివస్తా - సెలవండి!" అంటూ లేచి నమస్కరించి వెళ్ళిపోయేడు రాములుగారు, ఆ వెనకనే బాబూరావూను.

సిగరెట్ రెండు మూడు దమ్ములులాగి కొంచెంసేపు మౌనంగావుండి, "చూస్తూన్నావ్ గదా మా అదృష్టం!" అని నవ్వాడు సోమేశ్వరం.





సావిత్రి ఇలా చెప్పుచున్నది, "నేను సౌమ్యమైనదిన్ని పరిమళమైనదిన్ని గనుక లక్స్ టాయిలెట్ సబ్బును ఎన్నుకొంటాను"

సొగసైన సావిత్రి, సుప్రసిద్ధ సినిమా తార తన సౌందర్యము కోసం రోజూ శుద్ధమైన, తెల్లని లక్స్ టాయిలెట్ సబ్బునే వాడును। మీరున్నూ లక్స్ టాయిలెట్ సబ్బును ఎందుకు వాడ గూడదు। అది సౌమ్యమైనట్టి, పరిమళమైన సబ్బు। శరీరమంతటి సౌందర్యము కొరకు, పొదుపైన పెద్ద సైజు సబ్బును వాడుడు।

లక్స్ టాయిలెట్ సబ్బు

సినిమా తారలకు సౌందర్యము నిచ్చు సబ్బు

LTS. 553-X52 TL

★ అవసరాలు ★

"నీకంటె ఓవిధంగా నేనే అదృష్టవంతుణ్ణోయి. అన్నాను. 'ఏం! ఓవిధంగా అంటావేం? అన్నివిధాలా అను. అయినా ఆ ఒక్క విధం ఏయ్యది?" అన్నాడు సోమేశ్వరం.

"మన స్వంతానికి ప్రెస్ లేకపోవడం, దానివల్ల నష్టం వస్తుందేమోననే భయంబు ఆవంతైనా లేకపోవడం అదొక్కటే అదృష్టం."

"ఓరి...ఓరి..." అని భుజంమీద చరిచి మరీ నవ్వాడు విరగబడి. నవ్వును ఆపుకొని-"అదిసరేగాని ఊళ్ళోనే వుండి కూడా కన్పించవేమిరా? ఇవ్వేళ ఇట్లా వెతుక్కుంటూ వచ్చేవేం?"

"ఇంకేముంది మనకి ఆపద్బాంధవుడవు నువ్వుతప్ప మరెవ్వరు? మళ్ళీ అర్జంటుగా ఓ వందకావలసి వచ్చింది. క్రిందటిసారి యిచ్చినట్టే యిది తొందరగానె ఇచ్చివేస్తా."

"సరే అదంతా ఎందుకులే. రేపు ఉదయం వరకు ఆగగలవా?"

"ఓ! రేపు మధ్యాహ్నంలోగా అందితే చాలు" అన్నాను.

"సరే ఉదయం 9 గంటలకల్లా ప్రెస్‌కిరా యిస్తా."

"థాంక్స్! మరి వస్తా...ఇంకా ఊళ్ళో పనుంది."

"అదేం...ఆఫీసుకు పోవడం లేదా? సస్పెన్షన్‌లో వున్నావేంరా?"

"ఛ! ఛ! సెలవ్ రా!"

"ఎన్నాళ్లు? దేనికి? నవల ఏమైనా రాస్తున్నావా?"

"నీకన్నీ పరిహాసాలే! అన్నాళ్లనుంచీ ప్రయత్నిస్తూంటే ఆఖరికి పదిహేనురోజుల సెలవ మొన్నటికొచ్చింది. అదయినా తెగించి నేను దొంగ టెలిగ్రాం 'వైజాగ్' నుంచి ఇప్పిస్తే. ఇంతకీ మామరదలు పెళ్ళి మనం లేకుండానే అయిపోయింది! మా కుర్రాడి పుట్టినెంట్రుకలు మనంలేకుండానే తీయించివేశారు! రేపురాత్రికి అర్జంట్‌గా హైద్రాబాద్ వెళ్ళాలిసిన పని వుంది—అందుకే నిన్ను డబ్బు అడిగింది."

"అంతేరా గవర్నమెంట్ సర్వీసంటే అంతేరా! మరిపోయిరా, రేపు తప్పకుండా యిస్తాను."

మరునాడు ఉదయమే 9 గంటలు కొట్టడమేమిటి, నేను ప్రెస్సుకి వెళ్ళడమేమిటి రెండూ ఒకేసారి జరిగేయి.

అంతకు క్రితం సోమేశ్వరం కూర్చుని వున్న సీటులో గోపాల్రావు కూర్చుని వున్నాడు.

"సోమేశ్వరం లేడండీ?" అడిగాను ఆదుర్దాతో.

"లేరండీ! ఆయనకు వంట్లో బాగుండ లేదుట. ఇవ్వేళ ప్రెస్‌కి రానని యిప్పుడే కబురు పంపించేరు. మీ రొస్తే యింటికి రమ్మన్నారు."

"అట్లాగా! థాంక్స్" అని సోమేశ్వరం ఇంటికి హుటాహుటిగ వెళ్ళాను.

సోమేశ్వరం ఇంట్లో లేడుగాని, లోపల నుంచి అతని భార్య వచ్చి చెప్పింది. "ఇప్పుడే బజారుకు వెళ్ళారు. కూర్చోండి, వచ్చేస్తారు."

హాల్లో కుర్చీలో కూర్చుని బల్లమీది పత్రికలు తిరగ వేస్తూండగానే, సోమేశ్వరం చంకను, చేతుల్లోను, పార్సెల్సుతో ప్రత్యక్షమయ్యాడు నవ్వుతో.

"ఓ-వచ్చేవా! వెళ్ళిపోతావేమోనని భయపడ్డాను. కూర్చో-ఇప్పుడే వస్తాను. పిలలు గోలచేస్తూంటే ఏవో 'టాయ్స్' కొనుక్కొద్దామని బజారు కెళ్ళేను" అంటూ లోపలికి వెళ్లి పార్సెల్సు పడేసి తిరిగి వచ్చి వాలుకుర్చీలో జేర్లబడ్డారు.

"ఏమిటి కథ-ఎంతసేపయ్యింది వచ్చి?" అంటూ.

"ఆ-ఎంత-ఓ పావుగంట. నీ కోసం ప్రెస్‌కి వెళ్లాను. నీ వంట్లో బాగుండలేదనీ, ప్రెస్‌కి రావని తెలిసి ఇట్లా వచ్చేను" అన్నాను.

"ఆ! రోజూ అక్కడ ఎవడు కూర్చుంటాడు? ఒకటే టేడియస్ ఎఫైర్! పైగా యివ్వేళ మా ఫ్రెండ్స్ కొందరు బెంగుళూర్ నించి వస్తున్నారు. అది సరేగాని కాఫీ త్రాగావా? లలితా మా ఇద్దరికీ కాస్త కాఫీ పంపుదూ...ఇదిగో నువ్వు అడిగిన డబ్బు...వందేనా? తీసుకో."

ఇంటికి రాగానే మా ఆవిడను పిల్చి 50 రూపాయలు చేతిలోపెట్టి "నువ్వు చేబదుళ్లు చేసిన బాకీలన్నీ తీర్చివెయ్యి తెల్సిందా? మరెప్పుడూ అట్లాంటి పనులు చెయ్యకు. 50 రూపాయలు చేబదుళ్లా? రెండు నెలలకి నాకు సిగరట్లకి కూడా అంత డబ్బవదే-" అంటూ కాస్త అథారిటీ చెలాయించాను.

కిక్కురు మనకుండా డబ్బు తీసుకుని వంటింటిలోకి వెళ్లిపోయిందామె.

తిన్నగా నేను గుంటూరు వెళ్లి మిగతా డబ్బుతో ఇంగ్లీషు నావెల్స్, కథలు కొనుక్కొని సాయంత్రానికి తిరిగి వచ్చేను ఇంటికి.

ఎదురుగా మా ఆవిడ కోయంబత్తూర్ చీరతో ధగధగలాడుతూ ప్రత్యక్షమయింది.

చంకలోని పుస్తకాల పార్సెల్ క్రింద పడినా, అట్లాగే తెల్లబోయి చూస్తూ "ఎక్కడిదిది?" అన్నాను.

"ఎక్కడిది అంటారుగాని, ఎంత బాగుంది అనరుకదా?" అన్నది.

"చాల్లేగాని, మీ నాన్నగారు ఎవరి చేతైనా యిచ్చి పంపించారా?"

"మా నాన్నగారి కెందుకు ఆరోపిస్తారు ఈ గొప్పని, మీకే వుంచుకోండి-మీ డబ్బులో కొన్నదే."

"నా డబ్బా-ఏ డబ్బు-పొద్దున్న ఇచ్చిన డబ్బే! ఎంత అబద్ధమాడావు? చచ్చిచెడి అప్పుతెచ్చేనుగదా నీ బాకీలు తీరుద్దామని..."


"అంత కష్టపడి తెచ్చిన డబ్బుతో కొన్న పుస్తకాలేనా అట్లా క్రింద పారేశారు! ఉండండి-తియ్యనియ్యండి."

అవతల పూరిపాకలోనుంచి కిలకిలా నవ్వులు విన్పించేయి. ఆలోచన ఒకటి మెరిసింది చటుక్కున.

"ఆ పాకలో ప్రెస్ పనిచేసే అతని పేరేమిటో తెలుసా-వాళ్ళు మనింటికి నీళ్లకు వస్తూంటారుకదూ?"

"అవును. బాబూరావు అని వాళ్లి ముసలమ్మ చెబుతూంటుంది."

"కోపమంతా పటాపంచలవగా నవ్వేశాను నేను. మా ఆవిడ కూడా చీరకోసం అంత అబద్ధం ఆడేక నాతో శ్రుతికల్పక ఏం చేస్తుంది పాపం! ★



వారి పేరే మీకు హామీ

మీరు ఎల్లప్పుడు పేరుగాంచిన కంపెనీవారు తయారుచేసిన వనస్పతినే కొనండి!

ఈ ప్రసిద్ధిగాంచిన కంపెనీలలో ఒక కంపెనీవారి వనస్పతినే కొనండి

అహ్మద్ ఉమర్‌భాయ్	ఉమ్దా
అమ్రిత్ వనస్పతి కంపెనీ లిమిటెడ్	గోల్డెన్ ఆరో
అమ్రిత్‌సర్ షుగర్ మిల్స్ లిమిటెడ్	రోజ్
బీరార్ ఆయిల్ ఇండస్ట్రీస్	వనస్పద
బీరార్ స్వదేశీ వనస్పతి	స్వదేశీ
భావనగర్ వెజిటబుల్ ప్రొడక్ట్స్ లిమిటెడ్	ప్రభాత్
బ్రహ్మప్ప తవనప్పనవర్ (మైసూరు) ప్రైవేట్ లిమిటెడ్ ..	కల్ప
బ్రహ్మప్ప తవనప్పనవర్ ప్రైవేట్ లిమిటెడ్	బి.టి.
డి.సి.ఎమ్. వనస్పతి మ్యాన్యుఫేక్చరింగ్ వర్క్స్ ..	వన్‌ఘట్
ఈస్ట్ ఏషియాటిక్ కంపెనీ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ ..	ఓ.కె.
ఈస్ట్ కోస్ట్ ఫుడ్ ప్రొడక్ట్స్ లిమిటెడ్	అశోకా
గణేశ్ ఫ్లోర్ మిల్స్ కంపెనీ లిమిటెడ్	ఫస్ట్ క్వాలిటీ
హిందూస్తాన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ..	రసోయి
హిందూస్తాన్ లీవర్ లిమిటెడ్	లోటస్
ఇండియన్ వెజిటబుల్ ప్రొడక్ట్స్ లిమిటెడ్	ఛయన్
జగదీశ్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్	అరుణ్
కథియవార్ ఇండస్ట్రీస్ లిమిటెడ్	—
కుసుమ్ ప్రొడక్ట్స్ లిమిటెడ్	కుసుమ్
మార్గరీన్ & రిఫైన్డ్ ఆయిల్స్ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్	ప్రకాశ్
మెట్టూర్ కెమికల్ & ఇండస్ట్రియల్ కార్పొరేషన్ లిమిటెడ్	కామధేను
మోది వనస్పతి మ్యాన్యుఫేక్చరింగ్ కంపెనీ	కోటోజెమ్
మైసూర్ వెజిటబుల్ ఆయిల్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ ..	చాముండి
పాలన్‌పూర్ వెజిటబుల్ ప్రొడక్ట్స్ లిమిటెడ్	నటరాజ్
రవి వెజిటబుల్ ఆయిల్ ఇండస్ట్రీస్	బ్రిందావన్
రోహ్‌తాస్ ఇండస్ట్రీస్ లిమిటెడ్	హనుమాన్
ఎస్ జి. వెజిటబుల్ ప్రొడక్ట్స్	గోపాల్
స్నో వైట్ ఫుడ్ ప్రొడక్ట్స్ కంపెనీ లిమిటెడ్ . ..	బయాన్
స్వాయిక వనస్పతి ప్రొడక్ట్స్ లిమిటెడ్	స్వాయిక
స్వస్తిక్ ఆయిల్ మిల్స్ కంపెనీ లిమిటెడ్	గ్రేప్స్
టాటా ఆయిల్ మిల్స్ కంపెనీ లిమిటెడ్	పకావ్
తుంగభద్రా ఇండస్ట్రీస్ లిమిటెడ్	తుషార్
వెజిటబుల్ ప్రొడక్ట్స్ లిమిటెడ్	ప్రతాప్
వెజిటబుల్ విటమిన్ ఫుడ్స్ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్ ..	విటాగి
వెస్టరన్ ఇండియా వెజిటబుల్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ ..	పన్‌ఫ్లవర్

మీ వంటకు వాడుటకు ఆరోగ్యదాయకమైన మరియు శక్తినిచ్చే వనస్పతిని కొనుట మీకు అన్ని విధములా లాభకరము. కాని మీరు వనస్పతిని కొనునపుడు తయారుచేసేవారి పేరును చూచుట మరవకండి!

వనస్పతి మ్యాన్యుఫేక్చరర్స్ అసోసియేషన్‌లోని సభ్యునిచే తయారుచేయబడిన వనస్పతిని కొంటే అది ప్రభుత్వపు పర్యవేక్షణ క్రిందనున్న కార్ఖానాలో, ప్రభుత్వపు కఠినమైన నిర్ణయముల ప్రకారము తయారుచేయబడినదని మీరు నమ్మవచ్చును. అది తాజాగా మరియు పరిశుద్ధముగా ఉండుటకు చేతితో తాకబడకుండా తయారుచేయబడి, డబ్బాలలో సీలు చేయబడును!



వనస్పతి

గృహిణులకు వరప్రసాదము!

వనస్పతి మ్యాన్యుఫేక్చరర్స్
అసోసియేషన్ ఆఫ్ ఇండియా వారిచే
ప్రచురింపబడినది

VMA. 4390

హాత్ అంటే?

ఇంటి గోడమీద కాకి వాలింది.

"హాత్" అని అదిలించి, కాకిని తరిమింది ఇంటావిడ.

"అమ్మా, హాత్ అంటే ఏమిటే?" అని అడిగింది ఆవిడ నాలుగేళ్ళ కుమార్తె.

చిన్నపిల్ల చిట్టి ప్రశ్నకి గోముగా మురుస్తూ ముచ్చటగా చిరునవ్వు నవ్విందావిడ!

తను ఇంటికి చేరీచేరడంలోనే అవిడెందుకలా నవ్విందా? అని క్వశ్చన్ మార్కు ముఖం పెట్టి గాభరాగా ఇంట్లో అడుగు పెట్టేడాయన.

ఎత్తివేసిన కాలు ఎంగిలాకులో పడింది!

"ఏం నాయనా అలా ఉన్నావు? ఒంట్లో బాగో లేదా?" అంది అమ్మ.

"ఆఁ ఆఁ ఒంట్లో బాగాలేదు," అని సర్దుకున్నాడాయన.

తరువాత చాలా విచారించేడాయన- 'తను ఎందుకలా అబద్ధమాడేడా?' అని. ఆరోజు తనకి ఒంట్లో బాగులేకపోవడమంటూ లేదు. పైగా కాస్త హుషారుగానే ఉంది. ఎప్పుడూ రుసబుస లాడుతుండే ఆఫీసరు ఎంతో ఆదరంగా పిల్చి మాట్లాడేడారోజు. కాకపోతే, కాస్త పని ఎక్కువ చెప్పి ఉండవచ్చు.

రోజూ పదిసార్లు పిలచినా పలకని ఆఫీసు బంట్రోతు "బాబూ, కాఫీ తీసుకురానా?" అని ముందుగానే అడిగేడారోజు.

మరి తనఒంట్లో బాగులేదని అమ్మతో అబద్ధం చెప్పిందెందుకో!

ఇంటావిడ చిరునవ్వు నవ్వితే అందులో తాను గాభరాపడాల్సిందేముంది? అసలు ఆవిడ కాపురానికొచ్చిన దగ్గరనుంచి తాను కోరుతున్నదదేగా?... "ఆఫీసునుంచి తాను వచ్చేసరికి ఆమె చక్కగా శృంగారించుకొని చిరునవ్వు నవ్వుతూ ఎదురురావాలని." అయినా, ఆమె మరొక్కసారి నవ్వితే బాగుండును. ఈసారినవ్వితే ఆనవ్వులో అంతరార్థం తను గ్రహించగలడు.

*　　*　　*

"ఏమండీ?"

"......"

"మాట్లాడరేమండీ?"

"......"

"ఒంట్లో బాగాలేదా?"

"......"

ఈసారి సూటిగా ఆమె ముఖంలోకి చూశాడాయన.

చిరునవ్వుకి బదులు ఆమె ముఖంలో ఎంతో దుఃఖం గూడుకట్టుకు కనిపిస్తోంది. 'ఇంక ఏడ్చేస్తాం' అన్నట్లు పెదిమలు వణుకుతున్నాయి. కళ్ళనిండా నీళ్లు తిరుగుతున్నయి.

"...అ కాస్త వంట్లో చికాకుగానే ఉంది". అన్నాడాయన, మళ్లీ కేవలం అనుకోకుండానే.

పంతుల సావిత్రి

"ఎందుకేనా మంచిద"ని పొరుగింటి అబ్బాయి ద్వారా డాక్టరుకి కబురంపించిందాయన తల్లి.

తీరా, డాక్టరు వచ్చేసరికి తను ఏమీ లేదంటే లోగుట్టు బయిటికొస్తుందేమోనని దుప్పటి మరికాస్త ఘట్టిగా బిగించి, పెద్దగా మూలుగారంభించేడాయన.

"మరేం ఫర్వాలేదు, ఇప్పటికో ఇంజక్షనిచ్చి, నాలుగు మోతాదులు మందు పంపిస్తాను. ప్రతి నాలుగ్గంటలకి ఒక మోతా దివ్వండి. మళ్ళీ ఉదయం వచ్చి చూస్తా" అని చెప్పి తన పని నిర్వర్తించుకొని వెళ్లాడు డాక్టరుగారు.

ఇదంతా ఏమిటో బోధపడక ఒకరి ముఖం ఒకరు చూసుకున్నారంతా!

"నాన్నా.....'హాత్' అంటే ఏమిటి నాన్నా" మళ్ళా అడిగింది కూతురు.

చిన్నపిల్ల చిట్టి ప్రశ్నకి జవాబు చెప్పలేక గోముగా ఒక చిరునవ్వు నవ్వేడాయన.

"ఓహో...ఆహాఁ... తెలిసింది.... తెలిసింది..." అనుకుంటూ అవ్వగారిదగ్గరికి పరిగెట్టిందా అమ్మాయి.

"ఏమిటే తెలిసింది?" అంది అవ్వగారు.

"అవ్వా! హాత్ అంటే ఏమిటవ్వా?" మళ్ళీ అడిగింది అమ్మాయి.

"హాత్ అంటే..." అవ్వగారికి కూడా తెలీదు జబాబు, "నువ్వు చెప్పవే", అంది అవ్వగారు.

"హాత్ అంటే...అంటే...మరోచ్చి... ఇది" అంటూ చిన్న చిరునవ్వు నవ్వింది అమ్మాయి.

"నిజంగానే అవ్వా, 'హాత్' అంటే ఇదే" అంటూ మళ్ళీ నవ్విందమ్మాయి.

"నాకు అమ్మ చెప్పింది. కావలిస్తే నాన్న నడుగు. నాన్నకూడా అదే చెప్పాడు..."

అమ్మాయి మాటలువిని అంతా ఒక్కసారే నవ్వారు. అంతా ఎందుకు నవ్వారో గాని ఆయనమాత్రం 'ఇప్పటికంతా స్పష్టంగా అర్థమైంది' అన్నట్లు ఎంతో సంతోషంగా నవ్వాడు. ★

మాడంత మబ్బు

దూరాన—పొలాలమీద చిన్న మబ్బు పట్టినట్టు కనిపించింది.

భాగ్యం నిండుబిందె భుజంమీద నించి గుమ్మంలో దించింది. మనస్సులో అమృత వర్షం కురుస్తోంది.

చటుక్కున కొంత భయంవేసింది. అతనేమనుకున్నాడో! నా యమ్మ కడుపు బంగారం కాను! అదేమిటి, అల్లానవ్వాను? నవ్వు ఆపుకుని నిదానంగా వుండాలనైనా తోచనేలేదు! కాస్సేపటికి తోచింది. కాని నాముఖంలో కనిపించే వుంటుంది. ఆ అబ్బాయి నివ్వెరపోయాడు.

పదినిమిషాల క్రితం నీలాటి రేవులో జరిగినదంతా జ్ఞాపకం వచ్చింది. మళ్ళా అట్టే వీధి గుమ్మంలో నిలబడిపోయింది.

బిందె కాలిమీద మోపేటప్పటికే శేషయ్య ఎదురుగా చీలుబాటమీద ఆగాడు. శేషయ్య, భాగ్యం చిన్నపుడు కలసిఆడుకున్నవాళ్ళే. ఎన్నిసార్లో పొలం గట్టుమీదికి పిల్లి పెసరకాయలకి వెళ్లినప్పుడు వాళ్ళు మురా వీళ్ళమురా కీచులాడుకునేవాళ్లు. తన పెళ్ళిఅయిన తరువాత భాగ్యం శేషయ్యతో మాట్లాడడమే మానేసింది. మరి, అదేమిటి అల్లా[illegible]గాడు! ఎదురుగానే! భాగ్యంతల [illegible]కుని బిందెఎత్తుకో బోయింది.

"పెద్దరాజు వస్తున్నాడు" అన్నాడు. భాగ్యం ముఖం చేటంతయింది! ఏమన డానికితోచలేదు. కళ్ళప్పగించి ఊరుకుంది.

వెంటనే, ఉన్నట్టుండి పక్కునవ్వింది. వెంటనే తెలివి తెచ్చుకుని ముఖం నిబ్బరం చేసుకుంది. శేషయ్య ఒక్కక్షణం ఖంగారు పడ్డాడు. కాని వెకిలిచేష్ట అని వచ్చిన చిరునవ్వు ఆపేసి కాలు కదిపాడు. నాలు గడుగులు వేసి, వెనక్కి తిరిగి "రామగిరి పాడు బస్సుస్టాండులో చూశాను. వాళ్ళఫాక్టరీ యజమానిని బస్సుఎక్కిస్తూ "ఈసాయంత్రం తప్పక ఇంటికి వెళ్ళిపోవాలి"అంటున్నాడు. నేను కేకవేశాను. బజారు గొడవల్లో అతనికి నా కేకవినబడలేదు. నన్ను చూడనైనా చూడలేదు. నిన్ను చూస్తే చెప్పబుద్ధేసింది." అని వెళ్లిపోయాడు.

తెప్పరిల్లి, భాగ్యం బిందె ఎగరేసి ఎత్తుకుంది. ఈవేళ బిందె తేలిగ్గావుంది కూడాను.

ఇంటికెళ్లి పొయ్యి అంటించి వంట చెయ్యాలి. బావకి ఇష్టమయిన కూరలు చెయ్యాలి. ఇపుడిక ఇల్లూఅదీ శుభ్రంగా సర్ది అన్నీ సరిగ్గా పెట్టాలి. అసలేబస్తిలోవుండి వస్తూండే; తను ఎంతో నాజూగా వుంచాలి ఇల్లు. లేకపోతే, బావమనస్సు ఎంత చివుక్కుమంటుందో!

ఏమిటేమిటో ఆలోచనలతో నడిచింది ఇంటికి. తన సంతోషానికి మేరలేదు. ఆ మాయదారి సంతోషమే శేషయ్యదగ్గర కూడా మర్యాద వుండనివ్వలేదు.

భాగ్యం ఇంట్లోకివెళ్లి, పొయ్యి రాజేసి బియ్యం చాట్లో పోసింది.

పక్క మునసబుగారి పెరట్లోనించి ఎడ్ల మెళ్లల్లో మువ్వల గలగల, పాలేళ్ల అదలింపులు వినబడుతున్నాయి. దుక్కిటెడ్లు దాణా తింటున్నట్టున్నాయి.

ఎస్. కళ్యాణసుందరీ
జగన్నాథ్

భాగ్యం ఇల్లు సర్దడం మొదలెట్టింది. గొంతెత్తి ఏదో కూనిరాగంకూడా ఆరంభించింది.

"మాడంత మబ్బుపట్టె మంగళగిరిమీద
కురిసేను తిరుపతిలో కుంభవర్షాలు"

ఈపాటే అత్తయ్య పాడేది, తన చిన్నపుడు. పాటంతా సరిగా జ్ఞాపకంలేదు:

"కుంభవర్షాలుకురిసె స్తంబాలె తడిసె
వెంకన్నకూచున్న వీధరుగు తడిసె
మంగమ్మకూచున్న మండపమె తడిసె"

మునసబుగారింట్లోనించి అప్పుడే పుట్టింటికొచ్చిన సుబ్బులు "ఏమక్కో రాగాలెక్కువయినాయి. బావస్తున్నాడా, ఏం?" అంటూ పెరటిగోడమీద ముఖం పెట్టింది. భాగ్యం చిరునవ్వుతో తలవంచుకుంది.

"నిజమే ? చెప్పావుగావుగా!" అంది సుబ్బులు. భాగ్యం తలెత్తింది.

"ఏమమ్మా ఇంత చిక్కిపోయావు?" అని ఆశ్చర్యపడ్డది సుబ్బులు. "అయినా చక్కని వాళ్లు చిక్కినా, సన్నని బట్ట మాసినా అందమేనంటారు పెద్దలు," అంది నవ్వుతూ.

బావ ఎంత చిక్కిపోయి ఉంటాడో అనుకుంది భాగ్యం. బస్తీలో ఏ అమ్మ వండిపెడుతుంది! తనకిది ఇష్టమని చెప్పడు గదా. అసలే స్వయంపాకంమనిషి. అన్నట్టు సన్నచీరలు కట్టాలని ఎన్నాళ్లనించో ముచ్చట సుబ్బులు చీరలు చూశాక. మరీ ఆనల్లనేతచీర, జరీ చందమామలువేసి నేసింది తన కెంతో సరదా. బావ కొంటానన్నాడు.

వంట చేసుకుంటోంటే గడచిన తన జీవితమంతా – తన కాపురం, అత్తగారు పోవడం లగాయితూ అన్నీ ఒక్కసారి వివరంగా జ్ఞాపకం వచ్చాయి భాగ్యానికి.

ఆయేడు చేను ఈనినవెంటనే సుంకుమీద వాన ముసుళ్ళు పట్టాయి. ఎల్లాగో కాలక్షేపం చేశారు. ఆ మరుసటి ఏడూ అంతే.

తరువాత ముంపు వచ్చింది – వరుసగా రెండేళ్ళు. అసలు ఆయేడు ముంపువస్తుందని భాగ్యానికీకూడా ముందరే తెలుసు. తొలకరికి ముందు ప్రక్కవూళ్ళోవున్న చుట్టాలని చూసి వస్తూంటే, కొల్లేరు ఎండివుంది. అక్కడక్కడా గుంటల్లో నీళ్ళున్నాయి. జమ్ము నిలువెత్తుకు పైగా పెరిగి వుంది. రాజు చూడమన్నాడు. జమ్ములో కొంగలు నిలువెత్తున గూళ్ళు కట్టుకున్నాయి. పెద్దిరాజు నిలబడిపోయాడు. "ఈయేడుముంపువస్తుందే. మనగతి ఏమిటో! గూళ్ళు చూడు, ఎంత ఎత్తుగా కట్టాయో పిట్టలు, ఈయేడు!" అన్నాడు. భాగ్యం క్రుంగిపోయింది.

"మన పల్లపుచేలికి ఈ గతి తప్పదుగా" అన్నాడు మరో ఆయన ప్రక్కన నిలబడి– భాగ్యంతో. ఇప్పుడు జ్ఞాపకం వస్తూంది; ఆ అన్నది శేషయ్యే. వాళ్ళింటికి వెళ్లి వస్తూంటే సాగనంపడానికికూడా వచ్చాడు. అదేం ? బావ అల్లా మిరిమిరి చూశాడు ? తాను శేషయ్యతో మాట్లాడితే బావ కిష్టం లేకపోయేది! అసలు భాగ్యం మాట్లాడేదే కాదు. ప్రయాణంలో ఏదో సందర్భంలో అవసరం వచ్చింది. తను జవాబు చెప్పింది. ఏదో కొంటెగానే చెప్పినట్టు జ్ఞాపకం, బావ అండ చూసుకుని. శేషయ్య నవ్వాడు. కాని బావ కోపం దిగమింగాడు. ఇంటి



కొచ్చేవరకూ ఎవ్వరూ ఏమీ ఎక్కువ మాట్లాడలేదు. ఊరు పెద్ద చెరువుగట్టుమీది నించే, శేషయ్య భద్రంగా వెళ్ళిరమ్మని చెప్పి తిరుగుముఖం పెట్టాడు.

అసలు బావ ఎవ్వరితో మాట్లాడినా ఒప్పుకోడు. తను అదో మొస్తరు. మిగతా విషయాల్లో దేవుడిలాంటివాడు.

భాగ్యం తృప్తితో, చిరునవ్వుతో తల వంచుకుని కూరలు తిరుగుతూంది.

అల్లాగే ఇదివరలో ఓనాడు బావ సంతకి వెళ్ళి, మర్నాడుగాని రానన్నాడు. అంతా జ్ఞాపకం వచ్చింది. ఒకవేళ ఎల్లాపోయి ఎల్లా వస్తుందో, ఎందుకైనా మంచిదని ఓ లోటా పాలు కాచి, కిటికీలో పెట్టింది. మునసబు గారి భార్య రెండు బంతిపువ్వులిస్తే తల్లో పెట్టుకుంది. అనుకున్నట్టు సంతలో పడ్డ బేరం కుదరలేదు. పెద్దిరాజు ఆనాడే, ఇంటికి తిరిగి వచ్చాడు. కాచినపాలు, తల్లో పూలూ చూచి చాలా చికాకుపడ్డాడు. భాగ్యానికి అర్థంకాలేదు. ముఖం చిన్నపుచ్చుకుంది. భాగ్యం పాలనైనం, పువ్వులనైనం బ్రతిమాలి చెప్పేటప్పటికి ఆరాత్రి తొలికోడి కూసింది. తను అనుమానాలకి పెద్దిరాజు సిగ్గుపడ్డాడు. చాలా నొచ్చుకున్నాడు. భాగ్యం అర్థం చేసుకుంది. "పోనీలే, నామీద నివ్వు కోపగించుకోపోతే ఇంకెవ్వరు కోపగించుకుంటారు బావా వెర్రిగాని," అంది. కాని తనకీ కోపమే. ఒక్కొక్కసారి ఇకనల్లా కోపగించుకోకూడదు; అసలు బావ ఎంత అనుమానంగా ప్రవర్తించినా తనే ఓపికగా వుండాలి. బావ రాంగానే ఈముక్క చెప్పేద్దామని నిశ్చయించింది భాగ్యం.

మేనకోడల్ని పెంచి కొడుక్కి చేసుకుంది అత్తయ్య. పుట్టింటివారు లేనికొరత లేకుండా చూస్తాడు పెద్దిరాజు; భార్యని అరచేతిలో నిమ్మపండులా చూసుకుంటాడు అనుకుంది.

ఒకసారి మునసబుగారి భార్య రెండు తామరకాయలిచ్చింది. "నాకివి చాలా ఇష్టం, చిన్నమ్మా" అంది భాగ్యం. వినన్టే వున్నాడు బావ. రెండో నాటికి సందెడుకాయలు వచ్చి పడాయి ఇంట్లో! భాగ్యం గుండె నీరైపోయింది. కళ్లల్లో నీళ్లు తిరిగాయి. బావకి నీటి గండం ఉందని అంటుండేది, అత్తయ్య.

అన్నీ జ్ఞాపకం వస్తున్నాయి.

కనకం – వాళ్ళ ఆవు మునసబుగారింట్లో ఒక్కరంకె వేసింది.

చివరికి ఆవునికూడా మునసబుగారికి తోల వలసివచ్చింది. ఒక కష్టమా! వరసగా చేను పండక, అప్పులపాలైనారు భాగ్యమూ, రాజున్నూ. ఆఖరికి గత్యంతరం లేక రామగిరి పాడుబస్తీలో కూలి పనికైనా ఒడబడాడు. వున్న వూళ్ళో అయితే, పువ్వులమ్మిన ఊళ్లో కట్టెలమ్మినట్టుంటుంది అని. పైగా బస్తీకి పోయి నాలుగురాళ్ళు సంపాదిస్తే అప్పులు తీరితే అదే చాలు. ఈసారి నడుము కట్టి పొలంలో బంగారం పండిస్తానన్నాడు రాజు.

నాళ్లు గడచినాయి. వర్షాలు ఎక్కువగా కురిశాయి. చెరువులో తామరలు, కలువలు కలకలలాడుతున్నాయి. చేలల్లో నీళ్ళు నిలగట్టారు.

స్వతంత్రం, నమ్మకంమీద మునసబు గారినే నూర్పి కుప్పవెయ్యమని చెప్పి బస్తీకి బయలుదేరాడు రాజు. త్వరలోనే తిరిగి వస్తానన్నాడు.

ఆనాటి దృశ్యం కళ్ళకి కట్టినట్టు వుంది భాగ్యానికి. రోజంతా అదోమాదిరిగా వున్నాడు రాజు. ఏదో బాధపడుతున్నట్టు కనిపించాడు. ఆ ముఖం జ్ఞాపకం వచ్చినప్పుడల్లా భాగ్యానికి కడుపు తరుక్కుపోతుంది.

ఆనాడు భోంచేస్తూ "నివ్వు ఒంటరిగా ఉండగలవా?" అని ఛటాలున అడిగాడు.

"నీతో నేనూ వస్తా"నన్నది. రాజు కళ్లెర్రచేశాడు. "బస్తీ నమ్మకూడదు. అక్కడికొద్దు" అన్నాడు. భాగ్యం మాట్టాడలేదు. సుబ్బులూ వాళ్ళంతా, బస్తీపోవటం లేదూ? బావకిష్టం లేదు. అంతే. "ఇక్కడే మన్నా వెర్రిచేష్టలు చేశావా, నేను దేశాంతరం పోతా"అన్నాడు. భాగ్యం గుండె గభగభా కొట్టుకుంది. "ఆదేమిటల్లాగ!" అంది గాభరాగా.

రాజు చిరునవ్వు తెచ్చుకున్నాడు: "భయపడకు. నాకసలు కోపంఎక్కువ"అన్నాడు.

భాగ్యం మనస్సు మరింత బరువెక్కింది. రోజంతా ఇద్దరూ మాట్లాడకుండానే గడిపారు.

ఆ సాయంత్రం "రేపీ వేళకి బస్తీలో ఉంటావు బావా! పల్లెటూరు జ్ఞాపకం ఉంచుకుంటావా? మేము జ్ఞాపకం ఉంటామా!"

మాడంత మబ్బు

అని చిరునవ్వు తెచ్చుకుని అంది భాగ్యం.

పంచెలు మడతలు పెట్టుకుంటున్న రాజు, తలెత్తకుండా "నల్లజలతారు చీర తెస్తానులే," అన్నాడు కొట్టొచ్చినట్టు.

మరోక్షణం గడిచింది. "అసలు ఇంతకష్టం నాకెందుకు – నీ కోసంగదూ? మనం ఎపుడూ ఇట్లాగా ఉంటామని ఎల్లా చెప్పడం? పెద్దలు గడించినదైనా తరువాత వాళ్లకి ఇచ్చిపోవద్దూ?" అన్నాడు వినీ విన బడని స్వరంలో. భాగ్యం గుండె కరిగి పోయింది. బావమో స్తరే అది.

మరునాడు, తూర్పు తెల్లవారకముందే బస్సు రోడ్డుకి బయలుదేరాడు పెద్దిరాజు. పొలం గట్టువరకూ సాగనంపి వస్తానని, మున సబుగారు కూడా పొన్నుకర్ర చేత పట్టుకుని బయలుదేరాడు.

"ఇక నివ్వుండు. భద్రం," అని మాత్రం అన్నాడు పెద్దిరాజు. "నేను సాగనంపి వస్తానులే. నివ్వు ఇంటికి పదమ్మాయి" అన్నారు మునసబుగారు.

అక్కడే, వీధి చివరనే ఆగిపోయింది భాగ్యం. నోటమాట రాలేదు. తన గుండె లెవ్వరో బలవంతంగా ఈడ్చుకుపోతున్నట్టు అయింది తనకి.

మసక మసకగా ఇద్దరు మగాళ్ళూ రోడ్డు మలుపుదాటాక భాగ్యానికి గొంతువచ్చింది. శుభంగావెళ్ళి లాభంగా తిరిగి రమ్మంది.

ఆ దీవెన్ని ఆకాశంమీద అఖరు చుక్క మాత్రం విన్నది.

నాటినించీ భాగ్యం జీవితం బరువుగానే నడుస్తున్నది. ఒంటరిగా గుప్పెడు బియ్యం ఉడకేసుకుని తినడం అంటే "ఎందుకులే" అనిపించేది. క్షుద్బాధకోసం ఆ నాలుగు గింజలూ పొయ్యిమీద పెట్టినపుడల్లా, రాజు తిన్నాడో లేదో, ఎల్లా ఉన్నాడో! అక్కడ ఎవ్వరి నడుగుతాడు! అడిగేమనిషి కాదాయె. అన్న బాధ ఎక్కువయ్యేది. కళ్ళల్లో నీళ్ళు చిమ్ముకొచ్చేవి.

సురిపిడి అయిపోయింది. అసలే సారం లేని భూమి. తప్పాతాలూపోను, ఏదో గ్రాసానికి మట్టుకు గింజలు చేరాయి. మున సబుగారు తన ఇంట్లోనే గరిసె కట్టించారు.

కాని, హృదయంలో బరువు తగ్గలేదు. సూర్యభగవానుడు అటు ఉదయించి, ఇటు క్రుంకుతున్నాడు. నిన్న నేడూ అనే విచక్షత లేకుండా రోజులు గడచిపోతున్నాయి భాగ్యానికి.

పెరట్లో బూరుగచెట్టు పూతపూసి కాయ కాచింది. వేసవి గడుస్తోంది.

సంపాదన లేకపోతే పోనీలే. పొలంపోతే పోనీ. ఒక్క గూట్లో పడిఉంటే చాలు. మునసబుగారిచేత కాగ్గు వ్రాయిద్దామా అనుకుంది కూడాను ఎన్నోసార్లు — భాగ్యం. రాజు చటుక్కున వినేమనిషిగాదు. అప్పు తీర్చకపోతే నామోషీ పడతాడు. అప్పుడే నాలుగైదుసారు తపాలో డబ్బు పంపాడు కూడాను, మునసబుగారిపేర. చేతి ఖర్చుకి ఆ డబ్బు తనకే ఇయ్యమన్నాడు.

మృగశిర ప్రవేశించింది. మునసబుగారు తన మళ్ళతోపాటు రాజు దుక్కి కూడా ఆరంభించాడు.

అనుకోకుండా ఈ వేళ బావ వస్తున్నాడు.

ఈ పరమానందంలో వంట అయిపోయింది. బయట చిన్నచిన్న చినుకులు ఆరంభమయినాయి. వెలిగించిన హరికేను లైటు చుట్టూ నుసుములు బొంయ్ బొంయ్ మంటూ తిరుగుతున్నాయి. మునసబుగారి గొడ్ల సావిట్లో, పశువులకి పెట్టిన కుమ్ముపొగ ఇల్లంతా అలుముకుంది.

రెండు కంచాలూ కడిగింది.

పక్క ప్రక్కన పీటవేసి కంచాలు పెట్టింది. తన ధైర్యానికి తనకే ఆశ్చర్యం వేసింది.

అసలు కాపరం మొదలెట్టాక ఇద్దరూ కలసి భోంచెయ్యందే! ఆ సరికొత్త పెళ్లి ముచ్చట్లు ఏమో అంతే!

రెండు లోటాల్లో నీళ్ళు పెట్టింది. స్వయంగానే వడ్డించుకొని తినొచ్చు. సుబ్బులూ వాళ్ళాయనా బస్తీలో ఇంతేనట. సుబ్బులు ఎన్నోసార్లు చెప్పింది.

అప్పుడే సుబ్బులు పంపించిన బస్తీ ఆకులు, వక్కలు మంచంమీదనే పెట్టి వుంచింది. కబుర్లు చెప్పుకుంటూ సున్నం రాసుకోవచ్చు ఆకులకి.

కొంపతీసి, బావ అనుమానం పడడు గదా! తన అనుమానాలకి తనకే నవ్వొచ్చింది భాగ్యానికి! అయినా బావని నవ్వించేద్దాం అనుకుంది.

రెండు రవికెలూ, మార్చి, మార్చి తొడుక్కుంది శ్రద్ధగా.

అన్నం తినగానే బెల్లంగడ్డ నోట్లో వేసుకునే అలవాటుంది బావకి. ఇంట్లో బెల్లం లేదు. వీధిచివర భూషణంగారింట్లో అమ్ముతారు. తానెప్పుడూ వెళ్ళలేదు. పైగా బయట సన్నటి జల్లుపడుతూంది. మరి బెల్లం లేదే — ఎల్లా?

బావకి ఇంటిముందర దారి తెలియటానికి లైటు పడేటట్టు కిటికీ తెరిచిపెట్టి తలుపు గొళ్ళెం పెట్టి, తడుస్తూ బయలు దేరింది.

"ఏం కోడలూ వానలో వచ్చావు? రా," అంటూ చాప చూపించింది జానికమ్మగారు, భూషణంగారి భార్య. భాగ్యం ముస్తాబుమూసి తబిసీళ్ళు అడిగి తెలుసుకుంది. బెల్లం చేతికిచ్చి బొట్టెట్టి, వాళ్ల చిన్నవాణ్ని తోడిచ్చి, తిరిగి పంపింది.

వర్షం కొంచం పెద్దదైంది. తలుపు తియ్యగానే, హరికేనులైటు గప్‌గప్‌మంది, బైట గాలి విసురికి.

తాను బస్సురోడ్డు కేసి చూస్తూ గుమ్మం లోపలిగా కూచుంది — తలుపుని ఆనుకుని. ఇటు తిరిగి, ఇంట్లోకి చూసింది — తెరిచిన కిటికీలోనించి జల్లుపడదల్లే ఉంది. కిటికీ లోపల క్రింద, క్రీనీడ తడిసి నల్లగా ఉంది. అయినా కిటికీ మూయ తలుచుకోలేదు. మూస్తే, బావకి దారి చీకటి.

వర్షం మరింత పెద్దదయింది. గాలి విసురు ఎక్కువయింది. మెరుపు మెరిసినప్పుడల్లా ఎదురుగా బస్సురోడ్డు క్షణం సేపు కనిపిస్తూంది. అల్లాగే బయటికి చూస్తూ కూచుండిపోయింది భాగ్యం. నిద్రమాత్రం రావటం లేదు.

రాత్రి రెండుజాములైంది. బయట గాలి హోరు ఎక్కువయింది. భాగ్యానికి భయం వేసింది. ఇక ఈరాత్రి బావరాడు. ఇక రేపే. పోనీలే ఈ మాయదారి వర్షంలో ఏం ముంచుకుపోయిందని తను తెపవడం అనుకుంది.

కిటికీలోనించి జల్లు నట్టింటి వరకూ పడుతూంది. భాగ్యం లేచి కిటికీమూయబోయింది.

కిటికీ క్రీనీడలో కాలుక్రింది మెత్తగా ఏదో వస్తువు తగిలింది. భాగ్యం చటుక్కున వెనక్కి గెంతింది.

ఇందాక బయటనించీ రాగానే కనిపించింది ఇదే — తడిగాదు. మసక వెలుతురులో అల్లా కనిపించింది.

దీపం తెచ్చి దగ్గరగా చూసింది. ఓ చిన్న బొక్కసా అది. చేత్తో మెల్లగా ఎత్తింది. బావ నీలం చొక్కాయిలో చుట్టిన ఏవో గుడ్డలు మెత్తగా తగిలాయి.

అయితే బావ వచ్చేశాడు. ఏడీ? మునసబుగారింటికి వెళ్ళాడా ఏం! తను ఇంట్లో లేనందువల్ల! అప్పుడే వచ్చి ఉండాలి. అయితే ఇంతసేపు వారింట్లో ఏం చేస్తున్నట్టూ? గుమ్మంలోకి వెళ్ళి వంగి ప్రక్కఇలు చూసింది. తలుపులన్నీ మూసి ఉన్నాయి. దీపాలే లేవు. వాళ్లంతా ప్రశాంతంగా నిద్రపోతున్నారు.

భాగ్యానికి ఏమీ తోచలేదు. ఆలోచనలు పరుగెత్తుతున్నాయి. లోపలికి ఉరికింది. ఆ మూటని నిదానించి చూచింది. మెల్లగా విప్పింది. లోపల, బావతీసికెళ్ళిన గుడ్డలు, క్రొత్తది ఓ నల్లటి చీరా ఉన్నాయి. దీపం వెలుగులో, చీరమీద జరీ అక్కడక్కడ తళతళలాడింది. జరీ చందమామల చీర. తన కోసం. ఎంతజ్ఞాపకం పెట్టుకు తెచ్చాడు, బావ!

అయితే కిటికీక్రింద తడిలో పెట్టడమేం, మంచంమీద పెట్టకుండా.?

భాగ్యానికి వెర్రి ఎత్తినట్టనిపించింది. తల పడిపోతున్నట్టయింది.

అక్కడే చతికిలబడిపోయింది.

మరుక్షణం, ఇటువైపుగా కంచాలమధ్య చెల్లా చెదురుగా ఏవేవోపడి ఉన్నాయి. తన కాళ్ళకి దగ్గరగా బావ మనీపర్సుపడి ఉంది. చేతికి చాలా బరువుగా వుంది. ఓ బస్సు టికెట్టు, ఒక రసీదు. వేలెడు కత్ర పెన్సిలూ పడి వున్నాయి.

గుప్పున అర్థం అయింది — భాగ్యానికి కిటికీలోనించీ విసిరిపుచ్చుకొని బావ లోపలికేశాడు — వీటన్నిటినీ. కోపంగా వేసినట్టుంది. ఎందుకంతకోపం? వేసి, ఎక్కడికెళ్ళాడు?

తల పగిలిపోతూంది!

బయట చూరునీళ్ళు కిటికీ ప్రక్కగా ఏకధారగాపడుతున్నాయి. గాలి ఈల వేస్తూంది. వర్షం ఎక్కువయింది. కుంభవృష్టి.

భాగ్యం వీపుమీద జల్లుపడుతూంది. మెదలలేదు. బిత్తర చూపులు చూసింది. తన చుట్టూ వెలుగులు నీడలు ఒకేలాగు కనిపించాయి. భాగ్యానికి.

కళ్ళనిండా నీళ్లునిండాయి.

మరుక్షణమే తన వెనక ఆకాశంమీద పెద్ద మెరుపు మెరిసింది.

కళ్ళముందు, తళతళాతోమిన రెండు కంచాలు, రెండు లోటాలు తళుక్కున మెరిశాయి.

బయట వర్షపు రొద. ★

నాటిక

రాబందులు

పాత్రలు

శాంత;	మూర్తి.
సుభద్ర;	శేఖరం.
కమల;	రామనాథం.

[ఒక మధ్య తరగతి కుటుంబీకుల ఇల్లు. స్టేజి మీద ఒక టేబులూ, రెండు కుర్చీలూ. అందులో ఒకటి పడకకుర్చీ. టేబుల్ మీద పాత న్యూస్ పేపర్లు చిందరవందరగా పడి ఉంటయ్. స్టేజికి కుడివైపున మేడమీదకు పోయేటందుకు మెట్లు. మనుష్యులు ఎక్కటానికీ దిగటానికీ వీలుగా ఉండాలి. స్టేజికి ఎడమవైపున తలుపు. అందులోనుంచే బయటవాళ్ళు లోపలికీ లోపలివాళ్ళు బయటికీ వెళ్ళాలి. ఇవిగాక, నాటకంలో ఉపయోగించటానికి ఒక చిన్న అద్దాలబీరువా, అలారం టైమ్‌పీసూ ఉండాలి.]

[కాలం ఉదయం 8 గంటలు]

[తెర తీసేటప్పటికి, శాంత పడకకుర్చీలో కూర్చుని ఉంటుంది. విపరీతంగా బాధపడుతున్నట్లు కనుపిస్తుంది. ముఖాన విషాదచ్ఛాయలు అలుముకొని ఉంటయ్. జుట్టు కూడా బాగా రేగిఉంటుంది.]

* * *

శాంత: కమలా! కమలా! అబ్బ! ఎక్కడున్నావే? పొద్దస్తమానం నిన్ను సర్దలేక నా ఒళ్లు హతిమారుతోంది. (మాటలు అంటూనే లేచి టేబుల్ మీద పేపర్లు సర్దుతూ ఉంటుంది)

[తెల్లటి సిల్కు పరికిణీ, పసుపుపచ్చటి జాకెట్టూ కట్టుకుని కమల ప్రవేశిస్తుంది. జడలో ఎఱ్ఱటి రిబ్బను కొట్టవచ్చినట్లు కనుపిస్తుంది.]

శాంత: (కమలని చూస్తూ) అయిందీ! అనుకున్నంత పనీ చేశావ్! అసలే తాతయ్య పోయి ఏడుస్తున్నాం కదా, నీకీ సిల్కు చొక్కాలూ, రిబ్బన్లూ ఎందుకే? ఎవరైనా చూస్తే ఏమనుకుంటారు? లే, లే, పిన్నీ బాబాయీ వచ్చే వేళయింది. గదిలోకెళ్ళి ఈ బట్టలు మార్చుకురా.

కమల: (అమాయికంగా) అమ్మా, ఇవ్వాళ్ళైనా బాబాయీ, పిన్నీ ఎప్పుడూ రాలేదుగదా! ఇప్పుడనుకోకుండా వస్తున్నారేం?

శాంత: ఎందుకేమిటే పిచ్చిదానా! తాతయ్య పోయాడుకదూ, వాళ్లు లేకుండా తాతయ్యని తీసుకువెళ్లట మెలా? ఆయన్ని చివరిసారి చూడటానికీ, ఆ వ్యవహార మేదో మాట్లాడిపోవటానికీ వస్తున్నారు. పొద్దున, తాతయ్య పోగానే వాళ్లని రమ్మని, నాన్న టెలిగ్రామ్ ఇచ్చివచ్చారు. ఇప్పుడో ఇంకో క్షణంలోనో వస్తారు. (బయట ఏదో చప్పుడవుతుంది) అదిగో ఏదో చప్పుడౌతోంది. వాళ్లు వచ్చినట్లున్నారు. (ముందుకు వెళ్లి చూస్తుంది. మూర్తి ప్రవేశిస్తాడు)

శాంత: మీరా! చెల్లాయీ వాళ్లూ వచ్చారేమో ననుకున్నాను.

మూర్తి: ఏమిటే! ఇంతకీ వాళ్లు రానేలేదన్న మాట?

శాంత: ఒస్తే ఇక్కడుంటారుటండీ (కమలతో) ఇదుగో! నువ్వింకా ఇక్కడే ఉన్నావా? వెళ్లి బట్టలు మార్చుకురా. (కమల వెళ్లిపోతుంది)

మూర్తి: ఇంతకీ వాళ్ళు వస్తారంటావ్? ఏమో, నామటుకు నాకు అనుమానంగానే ఉంది. వెనక నువ్వూ, సుభద్రా దెబ్బలాడుకున్నప్పుడు ఇంక చస్తే నీ గుమ్మం తొక్కనంది—జ్ఞాపకం లేదూ?

శాంత: అంటే మాత్రం రాకేంజేస్తుంది చెప్పండి? ఆ వచ్చేది నాకోసం మీకోసం రాదు. ఆస్తికోసం వస్తుంది. ఈ ఐదారేళ్లలోనూ బాబాయి కూడబెట్టినదేకొంచెమైనా ఉంటుందం దానికి మాత్రం తెలియదా ఏమిటి? (ఏడుపు నాపుచేసుకుంటూ) అదంతా తల్చుకుంటే ఎంతో బాధగా ఉంటుంది. ఆరేళ్ళయిందా! ఒక్క ఉత్తరం ముక్కైనా రాసిందా? ఎంత కర్కోటకురాలో చూడండి! ఎక్కణ్ణించి వచ్చిందో గాని దినికీ పోలిక!

మూర్తి: ఇంకెక్కడినుంచి వచ్చి ఉంటుంది! వంశంలో ఉన్నదేగా!

శాంత: (ఆశ్చర్యంతో) ఆ!

మూర్తి: అబ్బే మరేం లేదు. మీ బాబాయి పోలికే వచ్చిఉంటుందన్నాను. అది సరేగాని నా చెప్పులేవీ?

శాంత: ఏవీ? ఆ పాతవేనా? అవి పారెయ్యమంటే పారెయ్యరు గదా! (ఏదో జ్ఞాపకం వచ్చినట్లు) అన్నట్లు ఈ మధ్య బాబాయి ఓ కొత్త చెప్పులజత కొన్నాడుగా అది వాడుకోండి. ఇంకా ఆయన అవి తొడగవస్తాడు. గనకనా? (కన్నీళ్ళు తుడుచుకుంటుంది)

మూర్తి: అవి నాకు చాలవనుకుంటాను.

శాంత: అయితే ఏం లెండి. వృథాగా వస్తువులు పారవేసుకుంటామా? కొంతవాడాక అవే సాగుతయ్.

[కమల మామూలు బట్టలు కట్టుకుని ప్రవేశిస్తూ ఈ మాటలు వింటుంది]

కమల: చెప్పులంటున్నా వేమిటమ్మా?

శాంత: అబ్బ! అన్నివిషయాలూ నీకే కావాలి. మమ్మల్నిలా వేపుకు తినకపోతే నీపనేదో నువ్వు చూసుకోరాదు? (కమల నిష్క్రమిస్తుంది) (మూర్తివైపు తిరిగి) అది సరేగాని బాబాయి కొత్తబీరువా ఉంది చూశారూ?

మూర్తి: ఏది అ అద్దాలబీరువా?

శాంత: ఆ అదే, అల్లాంటిది మనకుంటే ఎంత బాగుంటుంది. చెప్పండి!

మూర్తి: అదా! దానికేం, కావాలంటే అంతకంటే మంచిదే కొనుక్కోవచ్చు.

శాంత: అబ్బ! కొనుక్కోవటం కాదండీ! ఆ బీరువా మనం తీసుకుంటే ఎలా ఉంటుందీ అని?

మూర్తి: ఓ! అదా! పంపకాలప్పుడు సుభద్రతో చెప్పి అలాగే తీసుకోవచ్చు.

శాంత: అమ్మో! చెబితే విన్నేఘటమేనా అది? దానిసంగతి ఎవరికి తెలియదు? బీరువా చూపించంటే, చస్తే వదిలిపెట్టదు. ఏదో మనమే ఆలోచించాలి.

మూర్తి: అంటే?

శాంత: అంటే మరేంలేదు. బాబాయి బీరువాకొన్నాక అది ఇక్కడికి రానేలేదు.

సామవేదం జానకిరామశాస్త్రి

ఎవ్వరికీ తెలియకుండా ఆ బీరువా బాబాయి గదిలోనుంచి ఇక్కడ పెట్టేద్దాం.

మూర్తి: (అమాయకంగా) పెట్టేస్తే?

శాంత: అబ్బ! ఏంమనుష్యులండీ మీరు? అన్నీ విడమర్చి చెప్పాలి. (దగ్గరగా వచ్చి) ఆ బీరువా మనది. అది మనమే కొన్నట్లు వాళ్లతో చెబుదాం. ఈ పని వాళ్ళు రాక ముందు చేసేస్తే మంచిది.

మూర్తి: ఏమిటో! అంతా అయోమయంగావుంది. ఎందుకులెద్దూ ఇప్పుడాబాధ.

శాంత: బాధేమిటండి, ఎవరిమటుకు వాళ్ళకి బాగుపడాలని ఉండదూ? ఆ మాట కొస్తే దానికిమటుకు ఉండదా ఏమిటి? అంతగా కావలసివస్తే ఈ పాత టేబుల్ పైన పడేద్దాం. ఊఁ...ఆలస్యం ఎందుకు కానీయండి మళ్ళీ వాళ్ళు వచ్చేస్తే కష్టం!

మూర్తి: మరి, వాళ్ళు సర్దుతూండగా వస్తేనో!

శాంత: ఏంవస్తే? తలదీసి మొలేస్తారా? మీకంతభయమైతే ఆ ముందు తలుపు వేసి వస్తాలెండి. (బయటకు వెడుతుంది)

[మూర్తి కోటుతీసి కుర్చీమీద పడేస్తాడు ఇంతలో కమల ప్రవేశిస్తుంది.]

. కమ: ఏంనాన్నా, కోటువిప్పేస్తున్నావేం?

మూర్తి: ఆ మరేంలేదు. తాతయ్య చిన్న బీరువా లేదూ-దాన్ని అమ్మ నేనూ కలిసి కింద పెట్టెయ్యాలనుకుంటున్నాం.

కమల: ఇప్పుడెందుకునాన్నా మార్చటం?

మూర్తి: మళ్లీ పిన్నీ బాబాయీ వచ్చేస్తారు కాదుటే, అందుకు.

కమల: వచ్చేస్తే ఏం?

మూర్తి: అహఁ...ఏంలేదు...ఆబీరువా అమ్మని తీసుకోమని తాతయ్య చెప్పాడు.

కమల: ఎప్పుడు చెప్పాడు నాన్నా? (ఈ మాటలనేటప్పటికి శాంత తలుపు గడియవేసి ప్రవేశిస్తుంది.)

శాంత: ఎప్పుడా? రాత్రి!

కమల: అమ్మ, రాత్రంతా తాతయ్యకి ఒళ్ళు తెలియలేదన్నావుగా?

శాంత: అబ్బ! మళ్ళీ మొదలెట్టావ్? ఈ యక్షప్రశ్నలతో నన్ను చంపక నువ్వా తలుపుదగ్గర నుంచో. ఎవరన్నావస్తే తలుపు తియ్యక నన్ను కేకవెయ్యి.

కమల: (తలుపుదగ్గరకు వెడుతుంది.)

శాంత: (మూర్తి వైపు చూస్తూ) ఇక పదండి.

[మూర్తి, శాంత మేడ మెట్లెక్కి పైకి వెడతారు. ఇంతలోనే "శాంతా, శాంతా" అనే స్త్రీ స్వరం. "మూర్తిగారూ" అనే పురుషస్వరం వినిపిస్తయ్]

కమల: (బిగ్గరగా) అమ్మ ఎవరో వచ్చారే, తలుపు తియ్యనా?

[ఈ మాటలనేటప్పటికి శాంత, మూర్తి ఒక చిన్న అద్దాల బీరువా పట్టుకుని మెట్లు దిగుతూ ఉంటారు. మూర్తి కాళ్ళని కొత్త చెప్పుల జత కనుపిస్తూ ఉంటుంది.]

శాంత: ఇదుగో కమలా, నే వస్తున్నా గానీ; వచ్చేవరకూ అలాగే ఉండు.

[శాంత, మూర్తి బీరువా కింద పెట్టే ప్రయత్నంలో ఉంటారు. బయటనుంచి "శాంతా శాంతా" "మూర్తిగారూ" అనే కేకలు హెచ్చుస్థాయిలో వినిపిస్తూ ఉంటయ్. బీరువా దింపటం పూర్తయాక శాంత అమాంతం మేడ మెట్లెక్కి ఒక అలారం టైంపీస్ తీసుకువచ్చి బీరువామీద పెడుతుంది.]

శాంత: (టైంపీస్ టేబుల్ మీద పెట్టటం పూర్తయాక) కమలా! తలుపుతియ్యమ్మ. (మూర్తితో) మీరలా కుర్చీలో కూచోండి; వాళ్ళకోసమే ఎదురుచూస్తున్నట్లుండాలి.

[కమల తలుపు తీస్తుంది. సుభద్రముందూ, శేఖరం వెనకా ప్రవేశిస్తారు. ప్రవేశిస్తూనే సుభద్ర, "శాంతా" అంటూ శాంతని కౌగిలించుకొని ఏడుపు ప్రారంభిస్తుంది. శాంత కూడా వెక్కి వెక్కి ఏడుస్తుంది. మూర్తి లేచి శేఖరం కూచోటానికి వీలుగా కుర్చీ దగ్గరకు లాగుతాడు.]

శేఖరం: ఊరుకోండి. ఏంచేస్తాం. ఏడ్చి ఏడ్చి గుండె బేజారవటమేనా ప్రయోజనం ఏమన్నా ఉందా? (కుర్చీలో కూచుంటాడు.)

సుభద్ర: అయింది. అనుకున్నంతపనీ అయింది. ఇంకొంచెం ముందుగా ఉత్తరం వ్రాస్తే ఏంపోయింది శాంతా? (ఏడుస్తుంది)

శాంత: ఏమోనమ్మ, ఆయనిలా అర్ధాంతరంగా పోతారని నేనేం కలగన్నానా? మొన్న సాయంత్రందాకా బాగానే ఉన్నాడు. ఇన్నాళ్ళెన్ను వాళ్ళొచ్చి ఒకటే వేపుకు తినటం మొదలెట్టారు. అక్కడికీ "ఎందుకు బాబాయి ఇంతడబ్బు తగలెయ్యటం?" అంటే విన్నాడు కాదు. "ఎందుకేమిటే పిచ్చిదానా. నేనున్నాను కాబట్టి ఏదో విధంగా గడచిపోతోంది, ఆ తరువాత నువ్వు పిల్లా జెల్లాతో ఏమైపోవాలి?" అని నేనెంత చెప్పినా వినకుండా బయల్దేరాడు ప్రీమియం కట్టటానికి...

సుభద్ర: (శాంతమాట పూర్తికాకముందే) ఇంతకీ కట్టాడా?

శాంత: అలా కట్టి ఇలా వచ్చాడో లేదో, చలిగా ఉందన్నాడు. ఏదో మామూలుగా వచ్చే చలి జ్వరమేగదా అదే పోతుందనుకున్నాం. అదీ గాక ఆయనకిగాని నాకుగాని అనుభవం ఎక్కడిదీ? జ్ఞానం రాకముందే అమ్మ నాన్నా వెళ్లిపోయారుకదా!

★ రాబందులు ★

సుభద్ర: ఐతే, ఇంతకీ డాక్టర్ కెవ్వరికీ చూపించనే లేదన్నమాట. అనుకున్నంతపనీ చేశావ్, శాంతమ్మ తల్లీ. నేనైనా ఆయన్ని నాలుగు నెలలపాటు ఉండమని తీసుకువెళ్ళాను కాదు. (ఏడుస్తుంది)

మూర్తి: ఊరుకోండి. ఇప్పుడేమనుకుంటే ఏంలాభం? అంతా అయిపోయాక.

సుభద్ర: అసలింతకీ ఎప్పుడు పోయినట్టు? పోయే ముందేమీ చెప్పలా?

శాంత: చెప్పేదాకా ఏదీ? కాస పళ్ళరసం ఇద్దామని నేనే గ్లాసులో తీసుకుని పైకివెళ్ళి చూద్దునుగదా, అప్పటికే స్పృహ తప్పిపోయింది. ఆ కంగారులో నాకేమీ తోచక ఆ గ్లాసు ఆ అద్దాల బీరువామీద పెట్టే... (వెంటనే తప్పుగ్రహించి) ఆ... అదే ఆ టేబుల్ మీద పెట్టి,

సుభద్ర: ఏదీ, ఈ చిన్న బీరువాయేనా?

శాంత: అహాఁ. ఇది కాదు. టేబులనటానికి తొందరలో బీరువా అని వచ్చింది కాబోలు. ఇది మీ బావ కొన్నప్పటినుంచి ఇక్కడే ఉంటే అక్కడికెలా వస్తుంది?

సుభద్ర: ఏమిటీ? ఈ చిన్న బీరువా బాబాయిది కాదూ?

శాంత: అబ్బే, కమలకి బొమ్మలు పెట్టుకునేటందుకు బాగుందని ఈ బీరువా, మీ బావ వాచిపెట్టుకుని ఆఫీసుకు వెళ్ళిపోతే బొత్తిగా టైమ్ తెలియటం లేదని ఈ టైంపీసూ నేనే కొనిపించాను.

కమల: అమ్మా, ఈ బీరువా తాతయ్య దన్నావు కాదుటే!

సుభద్ర: నిజం చెప్పు శాంతా! ఇంత మాత్రానికే అబద్ధం ఎందుకు? బాబాయి దైతే మాత్రం నాకే కావాలని నేనేం పట్టుపట్టటం లేదుగా!

శాంత: ఏమోనమ్మా నిజమే చెప్పాను. ఇంతమాత్రానికే అబద్ధమాడవలసిన అవసరం నాకేంలేదు. ఆ పసిదానిమాటలు పట్టుకుని ఇష్టంవచ్చినట్టుమాట్లాడకపోతే అంతఅపేక్ష గలవాళ్ళు బాబాయి బ్రతికిఉండగా ఒక్కసారి వచ్చిచూడలేదేమో?

సుభద్ర: ఏమోశాంతా, నువ్వు వెయ్యి చెప్పు లక్ష చెప్పు ఆయన మాయింట్లో నే వుంటే ఇలా మందూమాకూ లేకుండా దిక్కుమాలినచావు చావనిచ్చేవాళ్ళమా? ఐనా ఒకళ్ళననవలసినపనేముంది. నేనైనా నాలుగు నెలలపాటు తీసికెళ్ళి ఉంచుకున్నానుకాదు (ఏడుస్తుంది.)

శేఖరం: సుభద్రా, ఏమిటీవరస? ఇందుకేనా, ఇంతదూరం పనికట్టుకు వచ్చింది?

మూర్తి: (లేస్తూ) ఇదుగో శాంతా, ఇక మాటలు కట్టిపెట్టి వాళ్ళకేంకావాలో చూడు. ప్రయాణపు బడలికలో వాళ్ళుంటే ఇదేనా మాట్లాడే విధానం? నేనలావెళ్ళి ఆ ఏర్పాటేదో చూసివస్తాను. (కమలతో) కమలా, నువ్వు పైకివెళ్ళి ఆఫాస్కు ఇలా పట్టుకురా కాస్త పిన్నికీ బాబాయికీ కాఫీఐనా ఇద్దువుగాని. కమల (పైకి వెడుతుంది.)

శాంత: (లేస్తూ) అవును, నేనాసంగతే మరిచిపోయాను. పోయినవాళ్ళు పోయినా ఏది తప్పుతుందిగనక!

(ఇంతలో కమల కంగారుగా మెట్లు దిగి వస్తుంది.)

కమల: అమ్మా! అమ్మా! తాతయ్య లేస్తున్నాడే!

(అంతా ఆశ్చర్యంతో చూస్తారు. సుభద్ర, మూర్తికూడా లేచినుంచుంటారు.)

శాంత: నీమొహం, తాతయ్య లేవటమేమిటే?

కమల: ఏమోనమ్మా, తాతయ్యలేచి అటూ ఇటూ కదులుతున్నాడు.

(అంతా ఆశ్చర్యంగా చూస్తూవుంటారు. మేడ మెట్లమీదనుంచి మెల్లిగా రామనాథం దిగి వస్తూవుంటాడు.)

మూర్తి: శేఖరం: ఎవరది? మామగారు!

శాంత: సుభద్ర: బాబాయ్!

రామ: నేనేనర్రా. ఏం అంత విచిత్రంగా చూస్తారు? అరే సుభద్ర! శేఖరం! మీరెప్పుడొచ్చారు? ఏమిటిదంతా, చాలా ఆశ్చర్యంగా ఉందే!

శాంత: (భయపడుతూ నే దగ్గరకు వస్తుంది. అంతలో నే సంబాళించుకుని) ఎలా ఉందిబాబాయ్? ఎంత కంగారైపోయింది! ఎంత పిలిచినా పలక్క స్పృహతప్పిపోయేటప్పటికి నేనే వీళ్ళకి టెలిగ్రాం ఇప్పించాను. అబ్బ!, ఎంత అదృష్టవంతులం! (సంతోషం తెచ్చుకోటానికి ప్రయత్నిస్తూ) అరే! నిలబడే ఉన్నావే!

మూర్తి: (కుర్చీ చూపిస్తూ) రండి. ఇలా కూర్చోండి.

శేఖరం: (దగ్గరకువచ్చి కూర్చోబెడతాడు)

సుభద్ర: (దుఃఖం నటిస్తూ) ఏమిటో బాబాయ్ నిన్ను తిరిగి ఇలా చూడగలుగుతామనుకోలేదు.

రామ: అవునమ్మా, అంతా అలా అయిపోయింది. పెద్దతనం కాదూ! నిన్న సాయంత్రంవరకూ కాస్త బాధగా ఉన్నా ఒళ్లు తెలుస్తూనే ఉంది. నిన్నరాత్రి గావును... బాగా టెంపరేచర్ ఎక్కువైపోయింది. అంతే...ఆ తర్వాత ఏం జరిగిందో తెలియనే తెలియదు. మళ్ళీ ఇప్పుడు నిద్ర మెళకువ వచ్చినట్టుగా తెలివి వచ్చింది.

సుభద్ర: ఎంత పని జరిగింది బాబాయ్! అంత జబ్బులోనూ దగ్గర ఉండి చూసేవాళ్ళే లేకపోయారన్నమాట!

రామ: ఏమిటోనమ్మా, మనం అనుకుంటాంగాని ఎవరి పని చేసుకోవటానికి వాళ్ళకే తీరికుండదు (బీరువా వంక చూస్తూ) అరే నా బీరువా, టైంపీసూ! ఇవి ఇక్కడికెలా వచ్చాయ్.

[ఈ మాటలనేటప్పటికి మూర్తి చెప్పులు విసుస్తాడు]

సుభద్ర: ఏమిటే? ఈబీరువా, గడియారం నీవా? శాంత, తనవేనంది?

శాంత: అవును. అన్నాను. బాబాయి వస్తువులు వేరు, నావి వేరు, అని నేనేం అనుకోవటంలేదు. ఆ మాటకొస్తే నాకా భేదభావం ఉండనే ఉండదు.

రామ: అవును. ఆమాట అక్షరాలా నిజం. అసలు దానికి "స్వ" "పర" భేదం ఎన్నడూ లేందే! (సుభద్రవైపు తిరిగి) అయితే టెలిగ్రాం చూసుకుని మీరిద్దరూ వచ్చారన్నమాట. ఏదో ఈవిధంగానైనా మిమ్మల్ని చూడటం పడినందుకు చాలా సంతోషంగా

వుంది. అమ్మాయి శాంతా, ఏదో ఇన్నాళ్ళ నుంచీ ఇక్కడే ఉంటూ వచ్చాననుకో. ఎల్ల కాలం ఇక్కడే కూర్చుంటే, లోకం ఏమం టుంది? నాకుమాత్రం మీ ఇద్దరికంటె ఆప్తు లెవరున్నారు? ఏదో కొన్నాళ్ళపాటు సుభద్ర దగ్గరకూడా ఉండివస్తే అక్కడికి నాకూవాళ్ళకీకూడా సంతృప్తిగా వుంటుంది. ఏమంటావ్?

శాంత: నేననేటందుకేముంది బాబాయ్ నీ యిష్టప్రకారమే కానీ. అది మాత్రం కూతురు కాదా? దానికి మాత్రం ఆపేక్ష లేదా! ఏదో కొన్నాళ్ళు నిన్ను తీసుకువెళ్ళి ఉంచుకోవాలని దానికి మాత్రం వుండదూ? అందాకా ఎందుకు? బాబాయికి జబ్బుచేసిం దనేటప్పటికి "నేనైనా నాలుగు నెలలపాటు తీసుకువెళ్ళాను కాదు" అనుకుంది.

రామ: ఏం సుభద్రా ఏమంటావ్? ఏదో నిర్ణయం చెయ్యండి మరి.

సుభద్ర: నిర్ణయానికేముంది ఇందులో— ఏదో ఇన్నాళ్ళనుంచీ శాంతే కాస్త ఈ వృద్ధాప్యంలో సహాయపడుతూ వచ్చింది కదా. అదికాక ఇన్నాళ్ళనుంచీ ఇక్కడుం డటం మూలాన, కమలకూడా బాగా అల వాటైంది. ఒక్కసారి నాతో వచ్చేస్తే వాళ్ళ కెంత బాధగా వుంటుందో, ఏమో నువ్వె క్కడున్నా క్షేమంగా ఉండాలిగాని నా దగ్గరే ఉండాలనే పట్టింపు నాకు లేదు.

శేఖరం: పోన్లెండి మామగారూ, ఇప్పుడు మాతో వచ్చేస్తే మీకు ఆ నీళ్లుకూడా కొత్త చెయ్యవచ్చు. ఈ పరిస్థితిలో ఉన్నచోటు మారటంకూడా ఏమంత మంచిది కాదు.

శాంత: దానికేంలే బాబాయ్. పైకి నే నెక్కడ బాధపడతానోనని సుభద్ర అలా అంటున్నా అది ఇక్కడికి వచ్చిం దగ్గర నుంచీ రెండుమూడు సార్లనుకుంది. "నే నయినా తీసుకువెళ్ళాను కాను" అని. ఇక్కడే ఉంటే దాని కోరికమాత్రం ఎలా తీరుతుంది? అదీగాక ఈపిల్లనీ సంసారాన్నీ ఈదుకోవటంలో నేను పడిఉంటే నీకు మాత్రం సుఖం ఎక్కడుంటుంది.

మూర్తి: అంతే మామగారు. శాంత చెప్పింది అక్షరాలా నిజం. కొన్నాళ్ళ పాటు మీరు వాళ్ళింట్లో ఉండివస్తే నా కెలాంటి అభ్యంతరం లేదు.

రామ: ఏమోనర్రా నేనూ పెద్దవాణ్నయి పోయాను. ఉన్నవ్యాధులు చాలక ఈ మధ్య దగ్గూ ఆయాసంకూడా పట్టుకున్నయ్. అక్కడికీ డాక్టర్ చెప్పనే చెప్పాడు," ఎందుకు రామనాధంగారు మీకు మందులూ మాకులూ. ఈ వయస్సులో ఎక్కడో ఒక చోట "కృష్ణారామా" అంటూ కూర్చోక" అని. అంతే కాదు. మీ దగ్గర దాచట మెందుకు. ఈ వేసవి గడవటం కష్టమన్నా డు. నాకుమాత్రం మీకంటె ఎవరున్నారు? ఏదో ఈ చివరి రోజుల్లో ఎవరి దగ్గరుంటే వాళ్ళకే నాకొద్దిపాటి ఆస్తీ ఇచ్చేస్తాను.

సుభద్ర: ఎంతమాటన్నావ్ బాబాయ్! నాకుమాత్రం నీకంటె ఎవరున్నారు చెప్పు? ఏదో పొరుగూళ్ళో ఉంటున్నా మన్న మాటే గాని నాకు, మీ అల్లుడు గారికి ఎప్పుడూ నీ ఆలోచనే, ఏంచేస్తున్నావో ఎలా ఉన్నావో అని. ఈసారి నువ్వు తప్ప కుండా మా ఇంటికి రావాల్సిందే. అందుకు శాంతకూడా ఇష్టపడుతూనే ఉంది కదా!

శేఖరం: కానీండి మామగారు, ఎందుకు ఆలస్యం. మీ ఆరోగ్యాన్ని గురించి ఇంత చెప్పాక మిమ్మల్నిక్కడ విడచి వెడితే మాకు అసలే తోచదు.

శాంత: ఆ...తోచకేం లెండి. ఏదోమాట వరస కన్నారు గాని ఈ ఐదేళ్ళనుంచీ లేని ఆపేక్ష ఇప్పుడెక్కడి నుంచి వచ్చింది? ఏమైనా సరే నువ్విక్కడే ఉండాలి. అదిగో నువ్వు వెడతావనే టప్పటికి కమల ఎలా బిక్కమొహం పెట్టిందో (కమలతో) పిచ్చిపిల్ల! మరేంభయం లేదమ్మా, తాతయ్య నిన్ను విడచివెళ్ళడుగా. వెడితే ఆయనకు మాత్రం ఏంతోస్తుంది? వెళ్ళమ్మా వెళ్ళి అలా తాతయ్యదగ్గర కూర్చో.

ఈ సంభాషణ వింటూవచ్చిన రామ నాథం ఒక్కసారిగా లేచి నుంచుంటాడు. అతని ముఖంలో కోపం వ్యక్తమవుతూ ఉంటుంది. మనిషి వణికిపోతూ ఉంటాడు.

రామ: శాంతా! సుభద్రా! ఆపండి ఈ నాటకం. అర్థమయింది అంతా అర్థమయింది. మీరు మనుష్యులు కాదు. రాబందులు. మీకు కావలిసింది నేను కాదు. నాఆస్తి. చిన్న తనంలోనే తల్లీ తండ్రిపోయి, దిక్కు దివాణం లేకుండా ఉన్న మిమ్మల్ని చేరదీసి పెంచాను. పోషించాను. పెళ్ళిళ్ళుచేశాను. మీరే సర్వస్వం అనుకుని మీమీదఉన్న మమకారంచేత చిన్నతనంలోనే భార్య పోయినా తిరిగి వివాహం మాట తలపెట్టక మిమ్మల్నే కనిపెట్టుకుని ఉన్నాను. అందుకు తగినపాఠం నేర్పారు. శవంచుట్టూ మూగి ఉండే రాబందులలాగ ఆస్తికాజెయ్యటానికి అవకాశం కోసం ఎదురుచూస్తు కూర్చు న్నారు. (శాంతవైపు తిరిగి) పాపం! పోయాననుకుని సామాన్లు క్రిందకు చేర్పింది శాంత (సుభద్రనిచూస్తూ) వాటిలో వాటా కోసం నువ్వుతాపత్రయ పడ్డావు. తీరా బతికున్నానని తెలిసినతర్వాత నాకు పట్టెడు మెతుకులు ఎక్కడ పెట్టవలసి వస్తుందోనని మీరు వంతులుపోయి కీచులాడు కున్నారు. మీనాటకానికి తగిన నాటకమే నేనూ ఆడాను. ఎక్కడ నేను ఉంటే వాళ్ళకే ఆస్తి ఇస్తాననగానే నామీద ఎక్కడలేని మమకారం పుట్టుకొచ్చింది మీకు. ఛీ! మీకు మానవత్వం లేదు. మీరు మనుష్యులు కాదు. చేసినదానికి ఫలం అనుభ వించండి. నా ఆస్తి యావత్తూ ఇప్పుడే అనాధ శరణాలయానికి వ్రాసి ఇస్తున్నాను. వెడతాను. ఇంకచస్తే మీముఖం చూడను. (వెడతాడు)

[అంతా తెల్లబోతారు. శాంత, సుభద్ర ఒకళ్ళముఖం ఒకళ్ళు చూసుకుంటూ ఉండగా తెర]

—ఒక ఆంగ్ల ఏకాంకిక ఆధారంగా.

★

దేవీ నవ(

ఓంకార (

★ శ్రీ పురాణపండ (

జగన్మాత ర్మాత స్తవ చరణసేవా న రచితా
నవాదత్తం దేవి ద్రవిణమపి
భూయ స్తవ మయా
తదాపి త్వం స్నేహం మయి నిరుపమం
యత్ప్రకురుషే
కుపుత్రో జాయేత క్వచిదపి కుమాతా న
భవతి ॥

—ఆచార్య శ్రీ శంకర భగవత్పాదులు]

సృష్టి కార్య క్రమాన్ని నిర్వహించే భారాన్ని వహించిన వారిలో ప్రజాపతి కశ్యపుడు ప్రముఖుడు. ఈ కార్యంలో అతనికి సహాయభూతులుగా దితి అదితి అనే పేర్లుగల కన్యకామణుల్నిచ్చి పరిణయం చేశాడు, హిరణ్యగర్భ బ్రహ్మ.

నిత్య నైమిత్తికాలను నిర్వర్తించుకుంటూ ఇరువురు భార్యలతోనూ జీవయాత్ర సాగిస్తున్నాడు తపోధనుడు కశ్యపప్రజాపతి. ఈ కాలంలో కశ్యపుని వలన అదితి గర్భవతియై కన్న సంతానాన్నే దేవతలని పిలుస్తారు. అదితి సంతానం కావటంచేత వీరినే ఆదితేయులని కూడా వ్యవహరిస్తారు.

శుభ సమయాలలో కశ్యపుని ఇచ్ఛానుసారం ప్రవర్తించిన అదితి గర్భం ఫలించిన వారుకాగా పిరంపరూ సన్మార్గగాములూ, సదుణ సంపన్నులూ, సర్వలోక పూజ్యులూ అయి స్వర్గరాజ్యాధిపత్యం వహించారు దేవతలు. నిరంతరంజగత్కళ్యాణ లక్ష్యంతో వారు అమరావతి రాజధానిగా సంతతి భోగాలను అనుభవిస్తూండడం చూసిన దితి గుండె చెవరింది. ఆమెలోని స్త్రీ సహజమయిన వాంఛ ప్రకోపించింది.

(రాజ్యాంగాలు మారినా, ప్రజాస్వామ్యాలు ప్రవేశించినా స్త్రీలోని మాతృత్వవాంఛ నశించదు. సమాన ప్రతిపత్తి లభించినా భారతీయ స్త్రీ 'అమ్మా' అని పిలిపించుకోవాలనే శుభక్షణం కోసం తపన పడుతూనే ఉంటుంది.' మాతృత్వ సిద్ధిలో ఆమెపొందే గర్వ అహంకారాలు అవాఙ్మనస గోచరాలు)

అసురా దైత్యా, దైతేయాః…

సాయంసాంధ్యకాంతులు వినిర్మల ప్రవాహోదకాలను స్వర్ణారుణ రసలహరులుగా మారుస్తున్న సమయంలో సంధ్యావందనం పూర్తిచేసి నదీ తటాన ధ్యాన సమాధిలో ఉన్నాడు ప్రజాపతి కశ్యపుడు. కశ్యపుని ధ్యానసమాధికి భంగం కలుగుతుందనే భయంతో మృగ పక్షిసంతానాలు స్వస్థానాలలో నిశ్శబ్దానికి పట్టంకట్టి కూర్చున్నవి. శీతల ప్రవాహోదకాలనుండి వచ్చే సుశీతల వాయువుల్లా కశ్యపుని బ్రహ్మతేజో వదనంనుంచి ప్రశాంత కాంతులు ప్రసరిస్తున్నాయి. శబ్ద బ్రహ్మోపాసనలో ఆమహర్షి మనస్సీమ మహదానందానుభూతి తరంగితమవుతున్నది. రూపందాల్చిన గాయత్రీ దేవి లాస్యంలా చిరుగాలి అలలకు కదలియాడుతున్నది, యజ్ఞోపవీతం; భృకుటి సీమనుండి బ్రహ్మతేజం వెల్లి విరుస్తున్నది.

ఆ సంధ్యాసమయంలో—

పరిశుభ్రస్నాతయై, సర్వాంగాలంకృతయై, మెలమెల్లగా వీచేగాలికి చలించే ముంగురులను విలాసంగా ఒత్తుకుంటూ జారే వల్లెవాటు సరిజేసుకుంటూ, రాజహంసిలా నడుస్తూ వచ్చి కశ్యపుని పార్శ్వాన నిలచినది-దితి. బ్రహ్మానంద సహోదరానుభూతి నందుతున్న కశ్యపుని కన్య చింతలేదు. బాహ్య ప్రపంచ దృష్టియే ప్రజాపతి పరిసరాలలో లేదు. విచిత్రమయిన గంభీర హాసం ఆయన పెదవుల సందులనుండి వెలువడుతున్నది.

నిశ్చల సమాధిలో ఉన్న ప్రజాపతిని నిరీక్షిస్తూ ఉండలేక పోయింది,—దితి.

కంకణాలు కదిలించింది:—

కదలింపులో కలిగిన కంకణ నిస్వనాలు కశ్యపుని కన్నులలో కదలిక కలిగించ లేకపోయాయి;

అందెలు ఆడించింది:—

ఆడిన అందెల రవళి ప్రజాపతి కర్ణేంద్రియాల కందలేదు;

కిల కిల నవ్వింది:—

నవ్వు కిలకిలలు ప్రజాపతి శరీరంపై గిలిగింతలై పులక లెత్తించలేదు; చేసిన ప్రయత్నాలన్ని ప్రయోజన రహితాలు కాగా ఆమె కన్నులలో అరుణరేఖ లంకురించాయి. ఆర్ద్రము లయాయి.

మరికొన్ని నిమేషము లాగింది.

చలించ లేదు కశ్యపప్రజాపతి.

హృదయంలో చెలరేగే కలవరాన్ని అదిమి పట్టలేక, కశ్యపునిపై చేయివేసి కదిపింది.

కన్నులెత్తి చూశాడు కశ్యపుడు.

కశ్యపుని కనుల కెదురుగా కాముక నేత్రాలతో చిరచెంప ప్రేలికి మెలి

ద్రిప్పుతూ నిలిచిన దితి కనిపించింది. అసంతృప్త నేత్రాలతో ఉన్న దితిని ఆలోకిం



కలకత్తాలో

ఈ విధంగా అతి మనోహరమైన దేవీ విగ్రహాలు
కలకత్తా పౌరులు ఆ

ాత్రగాథ

బీజాక్షరి!

ామమూర్తి ★

చన కశ్యపుడు మనసులో గుసుసుళ్ళు పడ్డాడు.



దేవీ పూజ

తెయారుచేసి వీధి వీధినా, ఇంటింటా రాధిస్తారు.

—ఫోటో: వి. వి. ఎన్. రావు]

ఆహ్వానించింది దితి.

కనులతోనే అనంగీకారాన్ని తెలిపాడు కశ్యపుడు.

కలవర పడ్డది దితి.

వ్యాకుల చిత్తుడయాడు కశ్యపుడు.

కామబాధకు మాతృత్వవాంఛ తోడు కాగా కశ్యపుని ప్రేరేపించింది.

వారింపజాలాడు.

అనివార్య మన్నది.

అనునయ వాక్యాలకు అంకురార్పణ చేయబోగా ఆశ్వాసన పొందలేక అనురోధించింది—దితి.

వ్యర్థప్రయత్నుడయిన కశ్యపుడు అర్థాంగి అభిమతానికి అంగీకరించక తప్పలేదు.

అయినా కడసారి యత్నంగా 'సంధ్యా సమయం నిషేధం' అన్నాడు.

'విధి నిషేధ వివేచన ఈవిషయంలో తగదు' అన్నది దితి.

కాదనలేకపోయాడు కశ్యపుడు, వాదనతో ఆమెను వారించలేక అంగీకరించాడు ప్రజాపతి కశ్యపుడు.

ధర్మ భంగం.

అపరిమితానందంతో గృహోన్ముఖియైన దితి గర్భంనుండి వెలువడినవారే రాక్షసులు. వీరినే దైత్యులని వ్యవహరిస్తారు. సంధ్యా దుష్ట సమయంలో దితికి కలిగిన కోరిక ఫలంగా పుట్టిన దైత్యులలో దుష్టచింతలూ, హింసాప్రవృత్తీ, జుగుప్సాకర వర్తనమూ సహజాలయాయి.

ఈ కారణంచేతనే వారిని రాక్షసులని పిలుస్తారు.

పెరిగి పెద్దవారయేకొద్దీ వారిలో హింస పెచ్చుపెరుగ సాగింది. నిరంతరం ప్రాణి కోటిని బాధించి, సంహరించి, ఆరగించడమే వారి జీవిత పరమావధిఅయింది. నానాటికి వారు లోకకంటకులుగా మారిపోతుండటం చూసిన కశ్యపుడు దితి వైపుమాసి విచిత్రంగా నవ్వాడు. దితి తన కుమారుల ఘాతుకాలను ఘాతుక కార్యాలుగా చూడలేకపోతున్నది. పసిపిల్లల క్రీడలుగానే రాక్షసుల హింసాకాండలు ఆమెకు గోచరిస్తున్నవి. వారి క్రూర కార్యాలకు అనురోధం లేకపోయేసరికి అవి దుష్టవాయువులో కీటకాలవలె పెరిగిపోసాగాయి.

మహర్షిగణాన్ని బాధించటం, యజ్ఞశాలలు ధ్వసంచేయటం, తపోదీక్షితుల్ని హింసించటం లేనిరోజు వారికి ఉపవాస దినంగా ఉండేది. ఆ రోజులలో వారికి పగటిపూట నిద్రపట్టేది కాదు; రాత్రివేళ ఆహారం వడిచేదికాదు.


* * *

క్రమక్రమంగా దైత్యుల కన్ను దేవతలపై పడింది. సర్వసౌఖ్య ప్రదమయిన అమరావతిలో సర్వభోగభాగ్యాలతో తులదూగే ఆదితేయులను చూసిన వారికన్ను ఎర్రవా



కలకత్తాలోని విక్టోరియా మెమోరియల్ భవనం

—ఫోటో: "కాజ"]



సుందరనగరం కలకత్తాలోని ఎస్ప్లనేడ్ దృశ్యం

—ఫొటో: "రాజ"]

★ దేవీనవరాత్రగాథ ★

రింది. అవక్రపరాక్రమక్రౌర్యులయిన దైత్యులందరూ సమావేశమై సర్వలోక భయంకరుడైన మహిషాసురుని సర్వసేనాధిపతిగా నిర్ణయించి అమరావతిపై దాడి చేశారు.

అపరసంధ్యా రమ్యరోచిస్సులలో ప్రశాంతంగా ఉండే సరోవరంలా ఉన్న అమరావతి నగరంలోకి మదమత్తేభంలా ప్రవేశించాడు మహిషాసురుడు. గంధసింధుర పదఘట్టనాలతో అమరావతి ప్రకంపించిపోయింది. ఆదిలో ఈ ఉపద్రవానికి కొంత అలజడి పడ్డా దేవతలు పౌరుషంతో ఎదురుకొలిచ్చారు. కానీ అతి భయంకరమైన రాక్షసశక్తిని ప్రతిఘటించలేక దేవేంద్రుడు సర్వదేవతా సంఘంతో కాందిశీకుడయిపోయాడు. అమరావతి మహిషాసురుని హస్తాలలో పడిపోయింది. అలౌకిక సౌందర్య సుషమాసమన్వితమైన ముద్దుగుమ్మ వదనశ్రీని పరిహసించే సౌభాగ్యంతో నిండిన అమరావతి బీభత్సరసప్రియుడయిన మహిషాసురుని కర్కశహస్తాలలో నలిగిపోతున్నది. దేవతలపై విజయాన్ని సాధించిన ఉత్సాహంతో దైత్యులు పూరించిన శృంగనాదాలు దశదిశలనూ దద్దరిల్లజేసినవి.

ఆచార్య బృహస్పతి బుద్ధికౌశలంతో ప్రవేశపెట్టిన రాజ్యాంగాన్ని ఛిన్నాభిన్నం చేసి మహిషాసురుడు నూతన సంవిధానాలను ప్రవేశపెట్టిన నాటినుండీ దైత్యుల క్రూర హింసాకాండ హద్దులు లేకుండాపోయింది.

శ్రీ మద్దివ్యమంగళ విగ్రహే!

కాందిశీకులయిన దేవతలు దీనవదనాలతో బ్రహ్మను సమీపించి తమ దైన్యస్థితిని నివేదించారు. వివరించవలసిన పనిలేకుండానే వారి ముఖాలలో కనిపించిన శోచనీయస్థితిని చూసి బ్రహ్మ మహావిష్ణువును ప్రార్థించాడు. విష్ణువు పరమశివుణ్ణి ఆహ్వానించాడు. త్రిమూర్తులూ సుదీర్ఘంగా ఆలోచించారు. కశ్యప ప్రజాపతి వీర్యోద్భవుడయిన మహిషాసుర మహావీరుణ్ణి సంహరించడానికి ఆదిశక్తి వినా సమర్థులు లేరని ముగ్గురూ తీర్మానించారు. శబ్దరూపంలో విశ్వవ్యాపిని అయిన ఆదిశక్తిని సంప్రార్థించారు. త్రిమూర్తులతో సహా సర్వదేవతలు అంజలిఘటించి మంగళవాక్యాలతో ప్రార్థించేసరికి జగన్మాత ప్రసన్నురాలై, అఖిలలోకాశ్చర్యకర సౌందర్య లీలావిలాస విభ్రమంతో ఆవిర్భవించింది. తమపై స్మిత శ్రీరోచులు ప్రసరించే ఆదిశక్తికి సాష్టాంగ ప్రణామం చేసి అవనతవదనులై నిలిచారు దేవతలు.

అభయహస్త ముద్రలో నిలిచిన ఆదిశక్తికి సర్వ విషయాలూ వివరించాడు, మహావిష్ణువు. ఆకర్ణించిన ఆదిశక్తి చిరునవ్వు నవ్వింది. ఆమె కన్గొనలనుండి అరుణరేఖలు ఎటో మరలినవి. అంతలో సర్వదేవతా శక్తులను కేంద్రీకరించుకొని ఆదిశక్తి అంతర్ధానమయింది. ఆ సమయంలో అమరావతిలోని సుధర్మాస్థానం పై ఉన్న మహిషాసురుని గుండె చురుక్కుమన్నది.

జయ విజయీభవ

నందనమందారాలపైనుండివచ్చే మలయానిల వీచులతో పులకించే ఉదయ భానురోచులలో కలకలలాడే అమరావతీ నగర బహిర్ద్వారం నుండి ప్రళయమేఘగర్జా సదృశంగా వినబడిన ఆదిశక్తి గర్జనకు ఉలిక్కిపడి లేచాడు మహిషాసురుడు. ఒక్కసారి పరిసరాలు చూశాడు. భువనభువనంలో తనశక్తికి యెదురులేదని గుండెలపై చేతులుంచుకుని నిశ్చింతగా నిద్రించే మహిషాసుర మత్తేభానికి ఈ గర్జన సింహస్వప్నమయింది.

అంతలో మరొకసారి అదే ధ్వని మహిషాసురుని కర్ణాలలో శూలంలా పొడిచింది. ఆకలిగొన్న పులిలా ఒళ్ళువిదలించి ఒక్కసారి గాండ్రించాడు. రాక్షసులందరూ మహిషాసురుని ప్రోల వ్రాలారు. తోక త్రొక్కిన త్రాచు బుసకొడుతున్నట్టు ఉచ్ఛ్వాస నిశ్వాసలు సాగిస్తూ సేనాపతుల వైపు నిశితదృక్కులు పోనిచ్చాడు. అప్రయత్నంగా అతని కోరమీసాన్ని పట్టి త్రిప్పింది దక్షిణహస్తం.

అంతరంగిక సచివుడయిన చతురుడు మహిషాసురుని సమీపించాడు. చింతనిప్పులు కురుస్తున్నవి మహిషాసురుని కన్నులు

మహాప్రభంజనంలో మర్రిచెట్టులా ఊగిపోతున్నది వాని మహాకాయం. మహిషాసురుని క్రోధారుణనయనాలలోని ప్రశ్నను అర్థం చేసికొన్న చక్షురుడు ఆదిశక్తితో జరిగిన రాయబారక్రమాలు వివరించి "ప్రభూ, సర్వవిధాలా భ్రష్టులయిన దేవతలు ఆదిశక్తిని అర్థించి, ఆమెకు తమ శక్తులన్నీ సమర్పించి మనమీదకు పంపారు. మహాశక్తి సంపన్నయైన పరాశక్తి స్వయంగా యుద్ధానికి విజయంచేసింది" అన్నాడు.

అట్టహాసం చేశాడు మహిషాసురమహాసేనాని; రాక్షసులందరూ ప్రావృణ్మేఘాలు గర్జించినట్టు వికటాట్టహాసం చేశారు. అనుచరుల సంతోషధ్వానాలతో మహిషాసురుని హృదయసాగరం ఉప్పొంగింది.

"ఏ శక్తులు సమీకృతమై వచ్చినా మనం భయపడవలసిన పనిలేదు. ఆ మహాశక్తితో సంగ్రామానికి సముచితమయిన సమర సన్నాహం సాగించండి. స్వర్గరాజ్యాధిపత్యాన్ని మాత్రం రాక్షసులు వదులుకోరు" అని సర్వసేనాపతులనూ, సైన్యాన్ని అవలోకించాడు.

దైత్యులందరూ కత్తులు ఝుళిపిస్తూ కదిలారు.

మహిషాసురుడు చక్షురునికి కర్తవ్యం నిర్దేశించి అభ్యంతరమందిరానికి నడిచాడు.

సచివప్రముఖుడు చక్షురుడు సేనాపతులకు కార్యక్రమాన్ని వివరించి, దైత్యయువకులకు సమరసందేశం యిచ్చాడు. చక్షురుడు సర్వసేనాధిపతిగా దైత్యసేనానివహం అమరావతీ నగరబహిర్ద్వారంలో ఆదిశక్తి సింహగర్జనకు ప్రతిగా శృంగనాదం చేశారు.

కన్ను ఎర్రజేసి శూలం పైకెత్తింది ఆదిశక్తి.

యుద్ధరంగంలో అప్పుడే అడుగుపెట్టిన యువవీరులు ఆ మహాశక్తి కన్నులనుండి వెలువడే విస్ఫులింగ గోళాలకే బెదిరి చెదిరి పోయారు. దేవాసుర సంగ్రామంలో కాకలు దీరిన సేనాపతులు అవక్ర పరాక్రమంతో ముందుకు దూకారు. శరవేగాన్ని అతిక్రమించే వేగంతో వచ్చే చక్షురుని శీర్షం ఆదిశక్తి త్రిశూలానికి ప్రథమకబళమయింది, అనుసరిస్తూ వచ్చే చామరుణ్ణి కూడా ఆదేపట్టులో ఆరగించింది శూలం.

చక్షుర, చామర సేనానుల మరణవార్త వినకుండానే ఏడు వేల రథికులతో సమర భూమికి వచ్చాడు ఉదగ్రుడు. ఉదగ్రుని సైన్యాన్ని ఉభయపార్శ్వాలా పరిరక్షించడానికి రథికకోటితో అనుసరించాడు మహాహనువు.

ఆదిశక్తికి ఉదగ్ర, మహాహనువులను చూచేసరికి వారి సంగ్రామ కౌశలాన్ని అవలోకించాలనే కుతూహలం కలిగి, కొంతసేపు వారికి ప్రదర్శనకు సావకాశం యిచ్చింది. ఈ అవకాశంతో విజయం తమదేనని భావించారు దైత్యరథికులు. ఆ ఉత్సాహం వారిలో మొలకెత్తుతూండగానే ఉదగ్ర, మహాహనువుల శిరస్సులు గాలిలో తేలిపోసాగాయి. దైత్యులు హాహారవాలతో వెనుదిరిగి పోయారు. హతశేషుల ఆర్తరవాలకంటె ముందుగానే ఆదిశక్తి వికటాట్టహాసం మహిషాసురుని సేనాపతుల చెవులలో శతఘ్నిధ్వానంలా చేరింది.

మరుక్షణంలో.

ఆసిలోమ, బిడాల, బాష్కల, దుర్ముఖ పరివారిక నామధేయులయిన సేనాపతులు చతురంగ బలాలతో దెబ్బతిన్న పులుల్లా ఆదిశక్తికి యెదురు వచ్చారు. ఒకే ఒక నిట్టూర్పు విడిచింది.ఆదిశక్తి, ఆనిట్టూర్పుకే గజాశ్వబలం చెల్లాచెదరయి పోయింది. చిరునవ్వు నవ్వింది ఆదిశక్తి. ఉక్కిరి బిక్కిరయ్యారు రక్షోవీరులు. ప్రసన్న గంభీర సుందర ముఖశ్రీ విరాజిత మూర్తియయిన యీ స్త్రీ యుద్ధం చేస్తున్నదా అని ముక్కున వేలు వేసుకొన్నారు, ఆరితేరిన సేనాపతులు. ప్రళయకాంతులు కనులలో ప్రసరిస్తూ సింహాన్ని లంఘింపజేసింది ఆదిశక్తి; ఎదురునిల్చారు సేనానులు. తనతో యుద్ధం చేసే సంకల్పంతో వచ్చిన ఈ మూలబలాన్ని కొంతసేపు రెచ్చగొట్టాలని కుతూహలపడ్డ ఆదిశక్తి కొద్ది కొద్దిగా వెనుక వెనుకకు నడిచి నడిచి ఒక్కసారిగా తన సింహవాహనపు సటాజాలాన్ని పటి లాగి ముందుకు నడిపింది. ఆ లంఘనంలో ఆమె బొమముడి బిగించి సేనాసర్వస్వాన్ని నిశ్శేషం చేసింది.

అంబరతలంనుండి దేవతలు పుష్పవృష్టి కురిపించారు. త్రిమూర్తులు వందిమాగధులై ఆదిశక్తిని బహు విధాల ప్రస్తుతించారు. ఆదిశక్తి ఒక్కసారి యుద్ధభూమిని చూసింది. రాక్షస సేనలో అధిక సంఖ్యాకులు నిహతులై పోయారు; నిట్టూర్చింది.

భరతవాక్యం

నిట్టూర్పులలో నిప్పులు గక్కుతూ మహాసేనాని మహిషాసుర వీరుడు స్వయంగా యుద్ధభూమికి బయలుదేరాడు. ఆమహాసేనాని అడుగుల కదలికలో లోకాలు అదురుతున్నాయి. ఊర్ధ్వలోకాలు స్థానభ్రష్టాలవుతున్నాయి. నగర ప్రాకార తోరణ ద్వారాలు పరిక్రమిస్తూనే నిహత సైన్యాన్ని సమీక్షించుకొని కొద్దిగా కలవరపడ్డాడు. అంతలోనే హృదయాన్ని కుదుటపరచుకొని కోరమీసం మెలిత్రిప్పుతూ, ఇంత కాలానికి తనతో సమంగా నిలిచి పోరాడే యుద్ధతంత్ర నైపుణ్యంగల ప్రతిపక్షి లభించినందుకు సంతోషిస్తూ చక చక సాగాడు. సాగుతున్న మహిషాసురుని మనస్సులో ఒకమూల తెలియరాని వైక్లబ్యం ప్రవేశించింది. క్షణకాల నిలిచిపోయాడు. తన దౌర్బల్యానికి తానే నవ్వుకున్నాడు. మహావీరులయిన దేవతలను ఎదిరించిన నాకు లేని భయం ఈ నాడా! అంగులోనూ ఒకానొక ఆడదానితో యుద్ధంగదా! అని గుండె చరుచుకుని ఆలోచనకు స్వస్తి చెప్పి ఆహవ భూమిలో అడుగుపెట్టి కుపిత వ్యాఘ్రంలా గాండ్రించాడు. ఆదిశక్తి తన వాహనంమీద చేతితో తట్టింది. సమాధానంగా సింహం గర్జించింది.

మహావీరుడూ, అవక్రపరాక్రముడూ అయిన మహిషాసురుడు కరవాలం పైకెత్తి కాలుదువ్వాడు. ఆ శూరుని సాహసాన్ని యుద్ధతంత్రజ్ఞయైన ఆదిశక్తి అభినందించింది. ఎడమచేత శూలం పైకెత్తాడు. ఆదిశక్తి అపహసించింది. మహావీరుడయిన మహిషాసురుని క్రోధాగ్నికి ఆ అపహాసం ఆజ్యధార అయింది. నేత్రగోళాలనుండి వెలువడే అగ్నిజ్వాలలు గ్రక్కే ఉష్ణవాయువుల్లా నాసారంధ్రాలనుండి గాలి విదలుతూ మరింత ముందుకు సాగాడు మహిషాసురుడు. చిలిపి నవ్వుతో సింహాన్ని వెనక్కు నడిపించింది ఆదిశక్తి. మహిషాసురుడు చిరునవ్వు నవ్వుతూ: "ఇంత సౌందర్యంగల దానివి, నువ్వు యుద్ధంచేయటం ఎంత తెలవితక్కువ పని. నా మాట విని నా పట్టపు రాణివిగా ఉండు. నువ్వు కోరితే నేను దేవతలతో శత్రుత్వం వదులుకుని, ఏం చెయ్యమంటే అది చేస్తాను." అంటూ కాముక ప్రసంగం ప్రారంభించేసరికి ఆదిశక్తి ఉగ్రభైరవి రూపంతో వికటాట్టహాసం చేసి శూలం పైకెత్తింది. మహిషాసురుడు చలించకుండా మండోదరి ఉపాఖ్యానం చెప్పి ఆదిశక్తిపై ప్రేమ కురిపించబోయాడు. ఆదిశక్తి శూలాన్ని వదలింది; మహిషుడు దారిలోనే వారించాడు. మహిషాసురుని అంగరక్షకులుగా ఉన్న దుర్ధరుడు అంధకుడు ఆదిశక్తికి యెదురువచ్చి మృత్యువుకి అతిథులుగా పోయారు. మహిషాసురుడు నానాభయంకర మృగరూపాలతో యుద్ధం చేయసాగాడు. ఏ రూపంలో వచ్చినా ఆదిశక్తి క్రూరంగా హింసిస్తూనే ఉన్నది. కొంతసేపు సింహాకృతిలో నిలిచి పోరి ఏనుగుగా మారాడు. మరుక్షణంలో శరభరూపం ధరించాడు. ఓవరకు శాంబరీ విద్యతో శాంకరిని జయించలేక ఆదిశక్తి కరవాలానికి ఆహుతి అయిపోయాడు, మహిషాసురుడు. మహిషాసురమర్దనీ! జయ జయ! ధ్వానాలు భూనభోంతరాళాలలో ప్రతిధ్వనించాయి. ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః. ★

ఆతనెవరు

అప్పుడే సాయంత్రం అయిదున్నర అవుతూంది. వాసుదేవరావు పరీక్షహాల్లో వాచరు వలె ప్రతినిముషం జేబుగడియారం చూస్తూ, అస్థిమితంగా పచారు చేస్తున్నాడు. ఓ సోఫాలో వాసుదేవరావు భార్య శాంతమ్మ బెంగపడినట్లు వాసుదేవరావుని తదేక ధ్యానంగా చూస్తూ కూచుంది. కులాసాగా టేబిల్ పై కాలుపెట్టుకుని స్పోర్ట్సు రివ్యూ చదువుతూ కూచున్నాడు వాసుదేవరావు కుమారుడు నాగేష్. కారు పోర్టికోలో సిద్ధంగా నిల్చుంది. గేటువద్ద హాజరుగా బంట్రోతు. వాసుదేవరావు పచారుచేస్తూ మధ్య మధ్య తనలో తనే ఏదో గొణుగుతున్నట్లు వినవస్తూంది. చివరికి నాగేష్‌ని చూసి వాసుదేవరావు "అసలు యీ యింట్లో ఎవరికీ ఈ పెండ్లిగురించి చింతే లేనట్టుంది" అన్నాడు.

వెంటనే శాంతమ్మ "మీరో గడియ కూచుందురూ, అదే వస్తుంది" అంటూండగా మాటలో మాట అందుకుని వాసుదేవరావు "ఊరుకునే వున్నాను. ఊరుకోక ఊరేగుతున్నానా" అన్నాడు.

"మంచి నీళ్ళిమ్మంటారా — యిలా కూచోండి" అంది శాంతమ్మ. నాగేష్ ముఖం కనబడకుండా పత్రిక అడ్డుపెట్టుకుని చదువు సాగిస్తున్నాడు.

తిరిగి వాసుదేవరావు ప్రారంభించేడు "మూడు రోజులనుంచి చెబుతున్నా దానికి- యీ క్లబ్బులు, మహిళాసభలు యీ నాటికీ విడిచిపెట్టమని — ఆ ట్రే లక్ష్యం వుంటేగా — యింతకీ దాన్ననవలసిన పన్లేదు. అలా తయారుచేసిన తల్లిననాలి" అని భార్యవంక కొర కొర చూస్తున్నాడు.

శాంతమ్మ దిగ్గునలేచి నాగేష్‌వద్దకెళ్లి "నాయనా; ఓసారి వెళ్లిరాగూడదట్రా — ఆయనంత చీకాకుపడుతున్నారు," అంది.

వెంటనే వాసుదేవరావు అందుకున్నాడు "అది నేననేదీని. ఏదో యిదంతా నాకోసం; నా చికాకు తగ్గించడానికి నేగాని— అయోమయమవుతూంది. ట్రెయిను తప్పిపోతే మేమో — ఏం రసాభాసవుతుందో అన్న జ్ఞానం ఒక్కళ్లకైనా వుందా అంట? ఈ పెళ్లి తనకిష్టం లేకుంటే మొదటే చెప్పవలసింది. అన్నీ అయ్యేదాకా నోరుమూసుకూచున్నాడు."

నాగేష్ లేచి "ఇంతకీ నాన్నా, నావల్లనే, యీ ఆలస్యం అవుతూందంటారా? ఇప్పుడుమాత్రం నేను యీ పెళ్లి యిష్టంలేదని అంటున్నానా" అన్నాడు.

"ఇష్టం వున్నవాడివి మీ చెల్లెల్ని సిద్ధంగా ఉంచలేక పోయేవేం" అన్నాడు వాసుదేవరావు.

"నేను వెళ్ళిమాత్రం యేంజెయ్యాలి? అదా ఆడవాళ్లక్లబ్! డ్రైవరు చెప్పనే చెప్పేడు రూప స్టేజెక్కి ప్రసంగిస్తూందనీ- మాటాడ్డానికి పీలుచిక్కలేదనీ" అన్నాడు నాగేష్.

"సమయం బాగుందని గజ్జెగట్టుకు నాట్యమాడుతూంది గాబోలు" అని తిరిగి పచారు జోరుచేసేడు వాసుదేవరావు.

శాంతమ్మ ఓసారి కొడుకుని వెళ్లిరమ్మని సౌజ్ఞచేసింది. నాగేష్ బయల్దేర బోతూవుంటే రూప నాలుగైదుపూలమాలలు చేత్తో పట్టుకుని గబగబా ప్రవేశించింది.

అప్పలి.

"ఇంకోగంట నాట్యంచేస్తే తీరిపోనుగా- హాయిగా అందరం పడుకుని వుండేవాళ్లం అంతత్వరగా ముగించేవేం" అన్నాడు వాసుదేవరావు రూప నుద్దేశించి.

"నాన్నా! క్షమించండి. అసలు అయిదు గంటలకు లేచివద్దామనే వెళ్తే, నన్ను సెక్రెటరీగా ఎన్నుకున్నారు. దాన్తో బయట పడ్డానికి వీలుచిక్కిందిగాదు" అంది రూప.

"అవును మరి, అన్నయ్యపెళ్లి. రేపు గాకుంటే ఎలాం డవుతుందె. క్లబ్ వొదులుకుంటే ఎలాగ? సరు లేకపోతే సరి-నడవండి, యింకేమైనా ఆలస్యం ఉందా" అన్నాడు వాసుదేవరావు.

శాంతమ్మ హడావుడిగా లోనికి వెళ్ళొచ్చింది. అందరూ మొత్తానికి గబగబ బయటకొచ్చేరు. వాసుదేవరావు చేతికర్ర పుచ్చుకుని ఇల్లు జాగ్రత్తని వంటవాడికీ నౌకర్లకూ చెప్పి కారుఎక్కేరు. అంతా కారులో కూచున్నాక నాగేష్ డ్రైవర్ని సామానంతా వచ్చినట్టేనా అని అడిగి నిర్ధారణ చేసుకున్నాక కారు కదిలింది ఇంకా ట్రెయినుకు పదిహేను నిముషాలు టైముంది.

రిజర్వుడు సీట్లు కనుక పర్వాలేదు. అందుతామని నమ్మకం కుదిరింది. అయిదు నిముషాలు టైముండగా కారు రెయిల్వేస్టేషను చేరింది. వాసుదేవరావు ఆత్రుతతో దిగి "నేను మన కంపార్ట్‌మెంటు వెదికి సిద్ధంగావుంటాను— సామాన్లు పట్టించుకు మీరంతా వేగంరండి" అని చెబ్తూ లోనికి నడిచేడు. ప్లాట్‌ఫారమంతా ఏక కోలాహలంగావుంది. ప్రతీ వాళ్లూ నిప్పుమీద నడుస్తున్నట్టుగానే కనబడుతున్నారు. నడిచే వాళ్ళను తోసుకుంటూ ట్రాలీ కూలీలు, ఆమధ్య తోపుడు బండ్లతో వర్తకులు, నడిచే వారిని ఆపి ఏవో విషయం మాటాడేవారూ ఒకటేమిటి- చెప్ప నలవి కాదు.

వాసుదేవరావు ఆమధ్యనించి తోసుకు గబగబా నడుస్తుండగా ట్రెయిను బొంయ్ మని కూసింది. దాన్తో వాసుదేవరావు అదిరిపడి ఓసారి వెనక్కి చూసి, తిరగడంలో, చేతికర్ర కట్టుపంచకు చిక్కుకుని పడిపోబోయాడు. ఎదురుగా యిటువంటి వాణ్ని రక్షించడానికే నిలుచున్నట్లు గభాలున ఓ నడివయస్కూ, విలువైన దుస్తులు వేసుకుని యీవెనింగ్ హేటూ, చేతులో పెపుతో వున్న వ్యక్తి అమాంతం ఎగిరిపడిపోయే వాసుదేవరావుని రెండుచేతులాపట్టుకుని లేవనెత్తి వెంటనే తనదారిని గబగబ నడచిపోయేడు.

వాసుదేవరావు బట్టలు దులుపుకుని, 'థేంక్స్' అంటూ యిటూ అటూ చూసేసరికి ఆ వ్యక్తి కానరాలేదు. వెంటనే వాసుదేవరావు గబగబనడిచి తమకు రిజర్వుఅయిన పెట్టెవద్దకు చేరుకుని "అమ్మయ్య" అని సామానుకోసం పిల్లలకోసం మానూ టిక్కట్లకోసం జేబులో పర్సుతియ్యబోగా పర్సు మాయమయింది. తనుయింటివద్దనుంచి పర్సు తెచ్చిన జ్ఞాపకముంది. బహుశా ఆ పడిపోవడంలో జారివుండాలి; అదెవడో లాగేసుండాలని "దొంగ - దొంగ-పర్సుపోయిం" దని కేకలువేస్తూ అటూ యిటూ హడావిడిగా తిరిగేడు. ఇంతట్లో "ఎవరు-ఎక్కడ" అన్న ప్రశ్నలకు మితిలేదు. ఈ హడావిడిలో ప్లాట్‌ఫారంమీద జనమంతా వాసుదేవరావు చుట్టూమూగేరు. ఇంతట్లో పోలీసు కానిస్టేబిల్స్ చేరి జనాన్ని తోసుకు, వాసుదేవరావు నేవేవో ప్రశ్నించి అటూ యిటూ పరుగులెత్తేరు. ఈ జనాన్నంతా తప్పించు

కుని నాగేష్ తండ్రిని చేరేసరికి ట్రెయిను బయల్దేరి వెళ్ళిపోయింది.

నాగేష్ తండ్రిని పోలీస్ స్టేషనుకు తీసుకెళ్ళగా వాసుదేవరావు వివరాలు చెబుతూ కంప్లెయింటు వ్రాసియిచ్చేడు. తిరువాత తిరిగి అంతా కలుసుకుని నిరాశచేసుకుని నెమ్మదిగా యిల్లుచేరుకున్నారు. నాగేష్‌ని పెండ్లివారికి ప్రయాణం ఆగిపోయినట్లు తంతియివ్వమని చెప్పేడు వాసుదేవరావు. అందరూ శక్తిలేనట్టు ఎక్కడికక్కడ చతికిలబడ్డారు. చాలాసేపు నిశ్శబ్దంగా కూచున్నారు.

చివరకి ఉన్నట్టుండి శాంతమ్మ "అయితే ఎంతడబ్బుందా పర్సులో" అంది.

"పోయినంత - ఎంతయితే నేం - మీలో ప్రయాణాలు పెట్టుకుంటే ఎంతయినా పోతుంది. సొమ్ముకంటె ముఖ్యం-నాగౌరవం, మర్యాదా మట్టిగలసిపోతాయి. పెండ్లిపెద్ద రెయిలు తప్పిపోయేడంటే నవ్వుతుంది లోకం" అన్నాడు వాసుదేవరావు.

"అది సరేలెండి. అసలు పోయిన సొమ్మెంతకి?"

"టిక్కెట్లతో కలసి 2 వేల రూపాయలు. అంతా రసాభాసయింది. ఈపిల్లకి మరీ మరీ చెప్పేను: ఈ ముహూర్తం నాగేష్ జాతకాన్ని బట్టి చాలాబాగుంది. తప్పడానికి వీల్లేదని చెప్పి ఆ క్లబ్ కట్టిపెట్టమన్నా. ఏదో ముసలాళ్ళ చాదస్తంగాని 5 గంటలకు తిరిగిరానా" అని బయల్దేరింది. దాన్తోటే వచ్చింది ముప్పంతా.

రూప కంటతడిపెట్టుకుని "నాన్నా! ఈవిధంగా పరిస్థితులు తారుమారవుతాయని నే ననుకున్నానా? మీరువద్దంటే అసలా క్లబ్బుకె వెళ్ళను నేను", అంది.

వాసుదేవరావు "నీకు తెలుసుండీ నువ్వు చేసేవన్నానా? ఇలాంటి వన్నీ జరుగుతాయని ఎవరుమాత్రం ఊహించగలరు. మనం ముందుగా బయల్దేరుంటే ఆందోళనవుండదు. ఇప్పు డేమనుకుంటే యేంలాభం. లేచిన వేళ బాగులేదు. ఇది నీతప్పూ కాదు. నా తప్పూ కాదు. నువ్వు కంటనీరు పెట్టుకోకు" అన్నాడు.

అంతలో శాంతమ్మ "అసలు పిల్లి ఎదురైంది, మనం బయల్దేరుతూండగా. అప్పుడే అంటే మీకేం కోపంవస్తుందో అని భయపడ్డాను," అంది.

"మంచిపని చేసేవులే" అన్నాడు వాసుదేవరావు.

"అయినా నాకెందుకు బాబూ-రూపా! ఆ వంటవాడ్ని కేకేసి వంట మొదలెట్టమను. 10 గంటలకేనా రెండు మెతుకు లుడికించి పడేస్తాడు" అంది శాంతమ్మ.

రూప వంటయేర్పాట్లు చేయించింది.

అంతా భోజనాలు పూర్తిచేసుకుని ఎవరి గదుల్లో వారు నిద్రపోయేరు. మరునాడు ఉదయం తెల్లవారగానే 6 గంటలకు కాఫీ త్రాగి అప్పుడేవచ్చిన పేపరు చేత్తోపట్టుకుని హాలులో సోఫామీద కూచుని, వాసుదేవరావు కళ్ళజోడు తగిలించుకుని పేపరు విప్పి చదువుతూ, దిగ్గునలేచి నిలబడి మరోసారి పేపరుచూసి, గబగబా పోర్టికోలోకి నడిచి, డ్రైవరుని కేక వేసి, కారు బయటికి తెప్పించి కారులో కూచుంటూ ఉండగా శాంతమ్మ, కళ్ళు నులుపుకుంటూ నాగేషూ హాల్లోకి వచ్చేరు.

శాంతమ్మ "అబ్బాయీ! ప్రొద్దుటే ఎక్కడికిరా బయల్దేరేరు" అన్నది.

నాగేష్ అదే తనకూ అర్థంకాలేదని పోర్టికోలోకి వెళ్ళేసరికి కారు వెళ్ళిపోయింది. గేటుతలుపు మూసివచ్చి బంట్రోతునడగగా తనకీ తెలియదని వాడు వెళ్ళిపోయేడు. నాగేష్ అలాగే 5 నిముషాలు ఆలోచిస్తూ నిలబడి నెమ్మదిగా లోనికిపోయి కాలకృత్యాలు నెరవేర్చుకున్నాడు.

వాసుదేవరావు తిన్నగా రైల్వే పోలీస్ స్టేషనుకు వెళ్ళేడు. అప్పుడే సబిన్స్పెక్టరు డ్యూటీకివస్తున్నాడు.

వాసుదేవరావు "నమస్కారం ఇన్స్పెక్టరుగారూ దొంగని మొత్తానికి పట్టేరుట" అన్నాడు.

"దొరక్క యెక్కడికి పోతాడు సార్. మనిషిని చూస్తేమటుకు మీరు దొంగనలేరు. అటువంటి టిప్ టాప్ డ్రెస్‌లో వున్నాడు. చాలా పెద్దరకం దొంగ"

"నిజంగా మీమేలు మరచిపోలేను. ఒకటా రెండా సర్. 2 వేల రూపాయిల వగదు. ఈ పెళ్లివల్ల అంతమొత్తం జేబులో వుంచుకోవలసొచ్చింది."

"మీ పర్సులో ఓ కానీకూడా పోకుండా దొరికింది. అసలు పర్సు పారేసి తను తప్పించుకుందామని చాలా ప్రయత్నం చేడు. పారేసిన పర్సు తీసుకుని వాడ్ని వెంబడించి చివరకి పట్టుగున్నాం. మొత్తానికి 8 చెరువులు నీళ్ళు తాగించేడు. అసలు మొదట్లో వొక మలుపు తిరిగితే పట్టుగోడం చాలా కష్టం అయివుండేది. మొత్తానికి నేనూ 804 కానిస్టేబులూ పట్టువిడవలేదు."

"మీకు నిజంగా డ్యూటీలో వున్న గురి చెప్పనలవికాదు సార్."

"రండి-మీశత్రువుని చూద్దురుగాని" అని సబ్ యిన్స్పెక్టరు వాసుదేవరావుని లోనికి తీసుకెళ్ళేడు. జెయిల్లో వున్న దొంగముఖం వాల్చుకుని వున్నాడు.

వాసుదేవరావు అతడ్ని చూసీ చూడ్డంతో వెంటనే సబిన్స్పెక్టరు చెయ్యి పట్టుకుని "అయ్యో! పెద్ద పొరపాటు జరిగిపోయింది" అన్నాడు.

సబిన్స్పెకరు "ఏమిటి సార్" అన్నాడు దొంగ వెంటనే ముఖం ఎత్తి వాసుదేవరావునిచూసి గుర్తుపట్టి తనూ ఆశ్చర్యంగా చూసేడు.

వాసుదేవరావు సబ్ యిన్స్పెక్టరుగారితో దొంగకు కూడా వినపడేలాగే "సర్! ఈయన చాలా మర్యాదస్తుడు; దొంగకాదు. అసలు పర్సుపోయినప్పుడు నాకోసం గొంగను వెంటబెట్టేడీయన. ఈయన నాకు తెలుసును గూడాను. బహుశా పర్సు ఈయనవద్ద వుండడంవల్ల మీరు వెంబడిస్తే చికాకుబడి పరుగెటాడేమో కాని మరేం గాదు. మీరు పడ్డశ్రమకి నేను యథాశక్తిగా

★ అతనెవరు ★

సంతోషపెట్టాను. నాయందు దయయుంచి ఈయన్ని వెంటనే విడుదల చేయించండి. పాపం ఆ యిల్లాలు ఏంకని పెట్టుక్కూచుందో" అన్నాడు.

"వాసుదేవరావుగారూ-నాకేం చెప్పడానికీ తోచడంలేదు. మీరా పెద్దమనుషులు; చెబుతున్నారు. యీయన దొంగకాడని, మర్యాదస్తుడని-ఈయన్ని వెంబడించి పట్టుకున్నది నేను కాకుంటే ఏమో మీ మాట నమ్మేవాణ్నేమో కాని యిప్పుడు నాకా నమ్మకం కించిత్తూ లేదు. ఇతను ఒకటోరకం దొంగని నేను సర్టిఫికేటు రాసిస్తాను. మీరింకో విషయం చూడాలి. నేనేం నిన్న మొన్న సర్వీసులో కొచ్చినవాణ్ని కాదు. రేపో నేడో ప్రమోషనుకోసం ఎదురుచూస్తున్నవాణ్ని. నా అనుభవాన్ని బట్టి చెప్పాలంటే మీరు చాలా పొరపాటుపడుతున్నారని చెప్పాలి. ఒకటయి వుండొచ్చు. ఇతడు మిమ్మల్ని మస్కా కొట్టే వుద్దేశంతో మొదట్నుంచీ మిమ్మల్ని తయారు చేసి ఉండాలి. అమాయకులవడం చేత మీరు మోసపోయేరు. నా సర్వీసులో ఇటువంటి కేసులు లక్షలు పట్టుకున్నాను. ఒకటీ పొరబడలేదంటే నమ్మండి. ఈ మధ్య జరిగిన ఖూనీ కేసులో నేజేసిన సర్వీసుకు నాకు ప్రెసిడెంటు మెడలు రాబోతూంది" అన్నాడు సబిన్స్పెక్టరు.

"అయ్యా! ఇన్స్పెక్టరుగారూ! మిమ్మల్ని ప్రతిమాలుకుంటున్నా—మీరు చెప్పినవన్నీ నాకూ నమ్మకంగానే వున్నాయి. కాని ఈ కేసుమట్టుకు నేను పొరబడంలేదు. నాయందు దయయుంచి నా మాట నెరవేర్చండి. బాబూ దొంగని పట్టుకోరూ అని ప్రతిమాలితే ఈయన పరుగెట్టేరు. అటువంటి ఉపకారికి నేనపకారం తలపెడితే నాకు పరమేనా దక్కుతుందంటారా? నా పర్సునిప్పించి మీ బహుమానం మీరు గ్రహించి విడుదల చేయించి పెట్టండి" అన్నాడు వాసుదేవరావు.

సబిన్స్పెక్టరుకు వాసుదేవరావు చెప్పింది ఎంతమాత్రం నమ్మకం కలుగజెయ్యలేదు. కొసవరకూ అమాయకుడు పొరబడుతున్నాడనే నమ్మకంతో నేవున్నా "అయ్యా, మీరు అంతగా ప్రతిమాల్తూ ఉంటే మీవంటి పెద్దవారిని కాదనడానికి మనసొప్పకుండా వుంది. నామట్టుకి కష్టపడి పట్టుకున్న పులిని బోనునుండి విడిచిపెడుతున్నానేమో అనిపిస్తూంది" అన్నాడు.

"క్షమించాలి. మీరలా అనొద్దు. మీకా అనుమానం ఎందుకూ, అసలు ఈయన్ని తిన్నగా మాయింటికి తీసుకెళ్లి వారివద్ద నా క్షమాపణ దాఖలు చేసుకుంటాను" అన్నాడు వాసుదేవరావు.

"సరేనని సబిన్స్పెక్టరు ఇనప్పెట్టెలోంచి పర్సుతీసి వాసుదేవరావుగారి పిటిషనులో వున్న వివరాలకు సరిపోతుందో లేదో మరోసారి చూసుకుని వాసుదేవరావుగారివద్ద పిటిషను విత్ డ్రా చేసుకుంటూన్నట్టు వ్రాయించుకుని పర్సు చేతిలో పెట్టేడు.

తరువాత జైలుగేటు తీయించి దొంగను బయటకు రప్పించి దొంగతో "అయ్యా! క్షమించాలి. నావల్లేదేనా పొరపాటుంటే క్షమించగోరుతున్నా. డ్యూటీలో ఏమేమో చెయ్యకతప్పదు. కాని నేనూ మానవుడనే అన్న విషయం మరచిపోకండి" అన్నాడు.

దొంగ "దానికేమిసార్-పొరపాటు మనిషి కాకపోతే మానుకొస్తుందా" అన్నాడు.

"నన్నూ క్షమించాలి" అన్నాడు వాసుదేవరావు.

దొంగ "బాగుంది. ఇప్పటికేనా నాకు విముక్తికలిగించినందుకు మిమ్మల్ని నేనే క్షమాపణ కోరుకోవాలి. మీరు రాకుంటే నేను దొంగనో కావో తెలుసుకునేలోగా నే నాకు దేహశుద్ధి కావలసిందేగా. వారినీ ఏమనడానికి వీలులేదు. అంత కట్టుదిట్టంగా ఉండకపోతే నిజంబయటపడదు" అన్నాడు.

"బాగుందండోయి" అని పకాలున నవ్వి "మా ఇంటికి మొదట వెళ్లి అక్కడ్నుంచి మీరు మీ ఇంటికి వెళ్లొచ్చు దయచెయ్యండి" అన్నాడు వాసుదేవరావు.

"అయ్యా, ఇంకా ఎందుకు మీకు శ్రమ. నే వెళ్లిపోతాలెండి" అన్నాడు దొంగ.

"అబ్బె! అలా నే ఒప్పుకోను సుమండీ. మా ఇల్లు ఓసారి పావనం చేయించరూ" అంటూ దొంగచెయి పట్టుకుని తిన్నగా కారులో కూచోబెట్టుకుని వాసుదేవరావు ఇంటికి నడపమన్నాడు కారుని.

దారిలో దొంగని పేరు అడిగేడు. దొంగకి ఈ వాసుదేవరావు తనకి గౌరవం ఎందుకిస్తున్నాడో ఏమీ అర్థంకావడంలేదు. ఏదో పొరబడుతున్నాడనే అనుకుంటూ పరధ్యాన్నంగా "నా పేరా అడిగేరు. బి. వి. షాక్ అంటారు. అంటే విశ్వనాధ లెండి" అన్నాడు. అంతట్లో కారు వాసుదేవరావుగారి ఇంటిముందు ఆగింది. వాసుదేవరావు దొంగ ఇద్దరూకలిసి లోనికి వెళ్లారు. బాత్ రూము చూపించి ముఖం కడుక్కొనిరమ్మని వాసుదేవరావు చెప్పేడు. ఇంటివద్ద అంతా వాసుదేవరావు రాకకి ఎదురుచూస్తూ కూచున్నారు. అందర్నీ భోజనాలహాల్లో ఆ నూతనవ్యక్తితో ఫలహారాలకు సిద్ధంకమ్మని చెప్పేడు వాసుదేవరావు. ఫలహారాలు పూర్తి చేసేక పిల్లలను శాంతమ్మనుద్దేశించి "ఈ వ్యక్తి ఎవరాఅని మీరంతా ఆశ్చర్యంగా చూస్తున్నారుగదూ. ఈయన మనపాలిట దేముడే అంటే నమ్మండి. మీరంతా వారికి నమస్కారం చెయ్యండి," అని చెప్పి వాసుదేవరావు దొంగనుద్దేశించి "అయ్యా వీళ్లిద్దరూ నాపిల్లలూ—ఈమె నాభార్యా, మేమంతా మీకు చాలారుణపడ్డాము. ఆరుణం తీర్చుకో

(-వ పేజీ చూడండి)

వనితా లోకం

తెల్లవారింది

వంకినేని

ఆయన:

దొరల్లాంటి దొంగలు

వీనరుడవు విత్తముగల,
దానరుడు కులీను డధిక దార్యుడతండే
ధీనిధి, ధన్యుడు, నేర్పరి,
నానాగుణగణము కాంచనంబుననిలుచున్.

ఎంత చక్కగా చెప్పేడయ్యా కవి. పిచ్చి వెధవలు. కొందరు డబ్బువిలువ తెలియక ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతారు. పిల్లకాకికి, ఏంతెలుసు ఉండేలుదెబ్బ అని. మాటలు చేతనయిన, ప్రతీ వెధవా ఏదో చెబుతూ ఉంటాడు. ఏది మచ్చుకి ఇలా సెలవిచ్చినవాడు ఒకడైనా ఉన్నాడాంట! (పైకి) ఇందిగో వంటయిందా? (స్వగతం) అడిగిన మాటకు జవాబన్నా రాదు. ఎందుకవుతుందీ వంట. ఏనాడయినా అయింది గనుకనా, ఇవ్వాళ అయిందనుకోవటానికి. నా ప్రాణానికి ఎప్పుడూ సగం, సగం ఉడికిన అన్నం కూరలేగా! అదైనా వంటదాని పుణ్యమా అని. ఆ ముండ ఉడకేస్తే గతి లేకపోతే లేదు. ఉన్నారు ఇంటినిండా వార్చిన కుండలు తిని పెటడానికి.

ఇంట్లో కష్టపడి సంపాదించే మగవాడు ఒకడున్నాడు, వాడికి వేళకి నీళ్ళే కావాలో పాలే కావాలో, తెలుసుకుందాము అన్న ఆలోచన ఒక్కళ్ళ గాకపోతే ఒక్కళ్ళకైనా ఉంటేనా! కట్టుకున్నదానికే లేనప్పుడు కన్నవాళ్ళకెక్కడ్కావాలా, ఆ వచ్చిన వాళ్ళకి కావాలా.

వాళ్ళ తిండేమిటో, వాళ్ళ కబుర్లేమిటో ఈ పాడు సినిమాలొచ్చి కబుర్లకెక్కడా కరువుండటంలేదు. ఎక్కడలేని డబ్బూ వీటికిందే తగలడిపోతోంది. సాయంత్రంఅవటం భయం. సాయంత్రం దాకా ఎందుకు మధ్యాహ్నం నుంచె మొదలెడుతుంది. సినిమాకి డబ్బులండీ అని. వెధవది, ఇవ్వకూడదని మనస్సులో ఎంతగటిగా అనుకొన్నా, ఆముఖం చూసేసరికి ఇవ్వకుండా ఉండలేక పోతున్నారు. ఎవరో అక్కడ వసారాలో మాట్లాడుతున్నారు, అబ్బాయిలాగున్నాడే...వీడొకడు నా ప్రాణానికి వీడొస్తున్నాడంటే నేభయం. ఏమి టేమిటో చెబుతాడు. ఏమాటకీ తలాతోకా ఉండదు విషయం. ఎక్కడ మొదలైనా డబ్బు అగడటంతో అంతమవుతుంది. మా చెడ్డ చావొచ్చింది వీడితో. సమయానికి దెవుళ్ళలాగ ఎవళ్ళో ఒకళ్లు కబుర్లకి దొరుకుతారుగాని, లేకపోతే వీడడిగే వందలకీ నేచెప్పే సాకులకీ అంతుంటుందా అంట...అహ మనలో మనమాట ఇలా ఖర్చుపెడితే ఎంతుంటే మటుకు, ఎన్నాళ్ళాగుతుంది. అదిగో ఇదే వస్తునట్టున్నాడు. ఇంకా ఎవరూ రాలేదు. వాళ్ళతో మాట్లాడుతూ కూర్చోవటానికి ఎలా ఇప్పుడు గండంగడచి, పిండం బయట పడేసరికి నాతల ప్రాణం తోకకు వస్తుంది.

రామరామ డబ్బు గలవాడుగా పుట్టటం కంటె, పాపం ఇంకోటిలేదు. నాకేమన్నా కావాలా, నే నెమన్నా పట్టుకెళ్తానాకీ చుట్టాలకీ,స్నేహితులకీ కొడుకులకీ కోడళ్ళ! కట్టుకొన్నదానికీ, ఆఖరుకి అడుక్కునే వాడికి కూడా విరోధమేగద! వెధవలు పటుకెళ్ళటం ఎగ్గొట్టటం. వాడబ్బ నాకివవ్వటానికే ఏడుస్తారు వెధవలు. పెడితే పెళ్ళి పెట్టకపోతే శ్రాద్ధం అన్నట్టుంది వీళ్ళతో, అందుకనే చెప్పేవాడు బాబాయి, బాబూ నేపోయిన తరువాత ఎలా బ్రతుకుతావో, అంతా దొంగలు దొరల్లాగ కనపడతారు. ఎవర్నీ నమ్మవద్దని అదుగో వాడిటే వస్తున్నాడు. ఇప్పుడేం చేయాలి. స్నానానికయినా వెడితే మంచిదేమో. వెడతా.

ఆవిడ:

పూజమాట దేవుడెరుగు

(స్వగతం.) అప్పుడే ఎలా అవుతుంది వంట ఎనిమిదన్నా కాలేదు. అదుగో కేక మీదకేక. ఊపిరాడనివ్వరు. ఒక్క నిముషం కూడా స్థిమితంగా రామకృష్ణా అనుకోనీరుగదా! రోజూ నే పూజకి కూర్చోడం, ఈయనగారు వంటయిందా, వంటయిందా అని తరమటం. ఇంక పూజేం సాగుతుంది నా బొంద!

ఈ జన్మకి ఈ కాస్త విశ్రాంతి అయినా దొరకటంలేదు నాకు. అయినా, వంటఎలాగ చెయ్యటం? కూరలకి డబ్బడిగితే తిప్పి తిప్పి ఏగాని ఇయ్యరయ్యె. ఇంట్లో ఏదైనానిండుకొంటే వినిపించుకోరయ్యె. ఎలా వేగటం ఈ మనిషితో. నాకేమన్నా వస్తువులూ వాహనాలూ కావాలన్నానా, ఇంటికి కావలసినవాటికే వినిపించుకోకపోతే ఎలా చచ్చేది? ఈయనచుట్టూ తిరిగి,తిరిగి, నాకాళ్లు పడిపోతున్నయ్యి. గుళ్లో దేముడల్లే మాటే చెప్పరయ్యె. అందుకే అనేది అమ్మ: "ఆడదై పుట్టేకన్నా, అడవిలో మ్రానై పుట్టడం మంచి"దని ఒక సరదాలేదు. ఒక మంచిలేదు. ఏదో తన గొడవేంటో, తనేంటో: "అయ్యో పెళ్ళాం అనేది ఇంట్లో ఉంది. లేచిన కాణ్ణించి కాళ్ళు అరిగేలా తిరుగుతూ చాకిరీ చేస్తోంది అని ఏమైనా జాలి ఉంటేనా! ఏదో అడగ్గా, అడగ్గా ఆ సినీమాకు మటుకు పారేస్తారు. అదైనా రెండోసారి, మూడోసారి, నేనే కోనుక్కోవాలి. సినీమా అంటే జ్ఞాపకమొచ్చింది. కొత్త సినిమా 8 రోజులయింది. ఇంతవరకూ వెళ్ళటమే పడలేదు. ఏదీ తీరి

★ తెల్లవారింది ★

తేగా! కాపరాని కొచ్చినకోడలున్న దన్న మాటేగాని, సౌఖ్యం లేదు చట్టుబండలూ లేదు. ఆవిడ గారేవిటో ఆవిడ గొడవేవిటో అంతేతప్ప అత్తగారు ఉందో ఊడిందో తిందో మానిందో కనుక్కోవడమా పాడా? నా కాలంలో నేనిలాగే ఉంటేదాన్నా, ఆత్తయ్య ఎలా చెబితే అలా చేసేదాన్ని. ఇవేం రోజులో, మాయదారి రోజులొచ్చి నయ్యి, అయినాగాని, ఈ సినమా లొచ్చేక ఇలా తగలడిపోతున్నారు. అందుకేఅన్నారు. ఆడది తిరిగి చెడింది. మగవాడు తిరక్క చెడ్డాడని. ఈ ఆలోచనలో పడి జపం మాటే మర్చిపోయేను. రామ రామ నా ప్రాణానికి ఈ మాయదారి మరుపొకటి. ప్రతీదీ మర్చిపోయేనని చెబితే అవతల వాళ్ళకూడా తమ్మ బుద్ధి కావటం లేదు. తాళాలు ఎక్కడ మర్చిపోయానో! వంటింట్లో అరమరకి తాళం వేసెనో లేదో! ఆ యింట అసలే దొంగముండ ఉంది దొరికితే చక్కబెట్టేస్తుంది. వెళ్ళి చూసొస్తే మెరుగు...పూజ మాట దేవుడెరుగు.

కొడుకు:

'తనసొమ్ము-మనసొమ్ము'

నాన్నగారింకా కోపంగా ఉన్నట్టున్నారే! స్నానానికి కాబోలు వెళ్తున్నారు. ఎప్పుడూలేనిది ఇవ్వాళ ఇంత ప్రొద్దున్నే స్నానమేమిటి చెప్మా!...నన్ను చూసి కాదు గద! ఎలా? ఇప్పుడు. అర్జంటుగా రెండొందలు కావాలిగదా...అమ్మ నడిగితే!...ఆ! ఇస్తుందా పెడుతుందా. అయినా ఒకటీ రెండూ కాదయ్యె. ఇచ్చినా ఇవ్వకపోయినా ఇచ్చినంత పని చేస్తుంది. నాలుగు తిట్టినా ఒకప్పుడు గాకపోతే ఒకప్పుడయినా నాన్నగారే నయం. పాపం! ఆ మహానుభావుడికి దండం పెట్టాలి. మాకోసం ఎంత కష్టపడుతున్నాడోగదా. అయితేనేం కానీవిదల్చడు. తను తినడు, ఒకడి కివ్వడు...నాన్నేగా అయితేనేం. ఉన్నమాట అనుకోవాలి.

అయినా, అడిగినప్పుడల్లా అడిగినంత ఇస్తే తనసొమ్మేం పోయింది? చంపుకు తింటారు. లక్ష ప్రశ్నలు అంతెందుకు? ఇంతెందుకని. ఎందుకో అందుకు, ఇవ్వకూడదూ.

ఈయనకి మాటలో దొరకకూడదని ఎంత ఆలోచించుకు ప్లాను వేసుకువచ్చినా ఎప్పటికప్పుడు దొరికిపోతున్నాను. ఇప్పుడెలా అడగాలి! రెండొంద లెందుకంటే ఏం చెప్పాలి. పోనీ ఫలానా పెట్రోలుబిల్లు కని చెబితేనో! మొన్నేగా ఇచ్చేనంటారు. పోనీ కంపెనీ తాలూకు బిల్లని చెబితేనో. "నేనే కట్టేస్తాను గుమాస్తాచేత" అంటారు. ఎలా ఈయనతో వేగటం. మాచెడ్డ చావొచ్చింది. ఎప్పటికయినా 'మాకే'గా, ఇప్పుడే ఇచ్చేస్తే ఈయన సొమ్మేం పోయిందో! ఇప్పుడే గనక తాతగారుంటే ఈ ఇబ్బందే లేకపోవునుగదా! తాళాలు తీసయినా, దొంగతనంగా తీసేసుకొందునుగదా! ఇప్పుడెలా. అవతల టేక్సీవాడు నిలబడిఉన్నాడు. స్నేహితుల్ని హంటింగ్ కి తీసుకెళ్తానని చెప్పేనే. పోనీ నిజం చెప్పేస్తేనో! అమ్మో ఇంకేమన్నా ఉందా? దమ్మిడీ ఇవ్వరు సరికదా. నన్నా టాక్సీవాడి ఎదట పెట్టి తిట్టి ఉన్న పరువు కాస్తా గంగలో కలిపేస్తారు. యిదెలా? పోనీ టేక్సీవాడికి తరవాత ఇవొచ్చు ఎలాగోలాగ. ఈయన స్నానం ఎంతకీ తెములటంలేదు. తరవాత ఇస్తానని, ఇప్పటి కెలాగోలాగ ఇక్కడనుంచి త్వరగా వెళ్ళడమేమంచిది.

కోడలు:

తాళం-తావళం

అప్పుడే ఎనిమిదయింది కాబోలు. మామగారు భోజనానికి వస్తున్నట్టున్నారు. నేనింకా తెల్లారలేదనుకుని పడుకునే ఉన్నాను. పడుకోక, నేను చేయవలసింది మటుకు ఏముంది గనుక! అత్తయ్య నన్ను పిలిచి ఇదిచెయ్యి, అదిచెయ్యి అని ఏమైనా చెబితేనా! తీరా నాఅంతట నే నేమన్నా చేస్తే నచ్చుతుంది గనుకనా? ఆ పూజేదో తొందరగా తేల్చుకొని రాకూడదూ? లేకపోతే నాతో చెప్పకూడదూ. పనిచెబితే నే పరువునష్టం కాబోలు. చెప్పందే ఎలా తెలిసేది. ఈమెగారు కూడా ఒకప్పుడు తెలిసికోందే, అత్తగారయింది కాబోలు. అయినా ఇంత వయసొచ్చేక. కృష్ణా రామా, అంటూ కూర్చోక, తనకెందుకంట ఈ తాపత్రయమంతా. తాళం తావళం కూడా తనే తిప్పాలంటారు. ఎలా వేగేది. ఏమిటో, వాళ్ళ గొడవేమిటో, వాళ్ళేమిటో, బయట ప్రపంచాన్ని చూసి కొంచమయినా మారరేం ఖర్మ! చుట్టూరా గిరిగీసుకుని అందులోనే కూచుంటారు. పాత పద్ధతుల్నే పట్టుకు ప్రాకులాడతారు.


చేసే ఏ పనీ సకాలంలో చేయలేదు గదా! పోనీ అయ్యేది మానుతోందా అంటే, రెండింతలై ఊరుకొంటోంది. అలా కాదు. ఇలా అని చెప్పినా వినిపించుకోరేం ఖర్మ. "గుడ్డొచ్చి పిల్లని వెక్కిరించినట్లు నీవు మాకు చెప్పేపాటిదానవయ్యావా" అన్నట్లు చూస్తారు. అంతేగాని ఆలోచించి చూడరు అదేం పాపమో.

నిజంగా సేవచేసేవాళ్ళు వీళ్ళ ముందు గవ్వకి చెల్లరు. నటనచెయ్యటం నేర్చుకోవాలి. అవును గంగిరెద్దులేగా ఘనంగా

ఊరేగేది! మనసులోమాట పైకిఅంటే అహం అంటారు. అయినా అహం లేనివారు ఈ మహిలో ఎవరు? ... అవకాశాలు లేక చూపించుకోరుగాని.

ఏమిటో ఈ ఆలోచనలు, కెరటాల్లావచ్చి పడుతుంటాయి. ఎవరెలాఉంటే నాకేమని ఊరుకోందామన్నా, పాడుమనసు ఊరుకో నంటుంది. ఉరకలు వేస్తుందిగదా!

ఏమైనాగాని, జీవితంఅంటేఇదేకాబోలు. చిన్నతనంలో తెలియక "వడ్డించిన విస్తరి అనుకునేదాన్ని. "విపరీతశక్తుల మధ్య మెలగటం నేర్చుకోవాలి. అప్పుడే బండి ఒడుదుడుకులు లేకుండా సాగటం. లేకపోతే ఏముంది. ఎత్తుపల్లాలు. వెనక్కి పడిపోవడం" అని అమ్మ చెప్పేమాటలు వేదవాక్కుల్లా తోస్తున్నాయి. ఇతరులనైజం నాకు బాధ కల్గించినట్టుగానే, నానైజం నాకు తెలియకుండా ఇతరులను బాధపెడుతోందేమో. అందర్నీ అర్థం చేసుకోవటంలో నేఉందేమో ఆనందం. దానికి ప్రయత్నిస్తా. ★



పచ్చీస్ —ఫొటో: పసల కృష్ణకుమార్]

వంటచేసే కాసేపూ పసుపు రాసుకుంటే..

కాల్పులకు కిరసనాయిలు మంచిమందు—

తెల్లారిలేస్తే పొయ్యిదగ్గరకెళ్లందే ఏస్త్రీకి జరగదు. ఎప్పుడో ఒకప్పుడు ఏ కాలో చెయ్యో కాల్చుకుంటూనే వుంటాము. అటువంటి కాల్పులకు కిరసనాయిలు మంచి మందు. కాలినవెంటనే (బొబ్బఎక్కకుండా) కిరసనాయిలు కనుక రాస్తే ఎంత కాల్పయినాసరే బొబ్బెక్కదు. పుండు పడదు. కాలినచోట మచ్చపడదు, కిరసనాయిలు రాసినప్పుడు కొంచెము ఎక్కువగానే మండుతుంది. ఆ మంటలకి, సుద్ద నీళ్లల్లో నానేసి ఆరారగారాస్తూ కొంచెము విసురుతూంటే ఆ మంటలు సర్దుకుంటాయి ఎంతకాల్పయినా రెండుమూడు గంటల బాధతో తగ్గిపోతుంది. బొబ్బఎక్కి పుండు పడితే ఎన్నాళ్ళు బాధపడాలో అందరకు తెలిసిందేకదా ?

తేలుకాటుకుకూడా కిరసనాయిలు మంచి మందు. కుట్టిన ప్రదేశంలో కిరసనాయిలువేసి గట్టిగా రుద్దితే ఆ భాగం మొద్దుబారిపోయి కొంతసేపటికి బాధ పూర్తిగా తగ్గుతుంది.

పసుపు

ప్రొద్దున్నే ముఖానికి పసుపురాసుకుని స్నానంచేసి కాని వంటమొదలుపెట్టేవాళ్ళు కాదు మనవాళ్ళు. అయితే ఆ అలవాటిప్పుడు మోటైందనుకోండి. అట్లా పసుపు రాసుకుని పొయ్యిదగ్గరకెళ్ళినందువల్ల ఆ సెగకు, వేడికి ముఖము కమిలిపోకుండా ముఖ సౌందర్యాన్ని పసుపు రక్షిస్తుంది. అందుకే పౌడరు రాసుకున్న మనముఖాలకన్న మన అమ్మ, అమ్మమ్మల ముఖాలు నేవళీకంగా సహజకాంతితో వుంటాయి. అందుకని నే చెప్పేదేమంటె వుత్తప్పుడెల్లా వున్న పొయ్యి దగ్గిర పనిచేసే కాసేపుమాత్రం పౌడరు మానేసి పసుపు కొద్దిగా రాసుకుని పొయ్యిదగ్గిరపని అయిపోగానే శుభ్రంగా సబ్బుతో ముఖం కడుక్కుని ఆపైన పౌడరు రాసుకుని బొట్టుపెట్టుకుంటె చాలాకాలం మన ముఖసౌందర్యాన్ని కాపాడుకోగల్గుతాము.

బి. ఎస్. లక్ష్మి

వంటలు:

ఓళిగలు

ఇప్పటివాకా ఎన్నో పిండివంటల గూర్చి చదివాను, కాని ఒక్కరూ ఈ ఓళిగలగూర్చి రాయలేదు. రాకనో లేక పూర్వకాలపుదని అలక్ష్యమో! బెంగాలి, మలబారు, ఆంధ్ర...మొదలైన ప్రాంతాల వంటకాలు చదివాక ఓళిగల గూర్చి ఎందుకు రాయకూడదు? అనుకున్నా. రాసేశా.

ఈ వంట రాయలసీమలో—ముఖ్యంగా మా బళ్ళారిలో చేసుకుంటాము. ఇతర ప్రాంతాల విషయము నాకు తెలీదు. కాని, ఓళిగలంటే తెలిసినవారు, చవి కోసుకుంటారు. పిండివంటల్లోకల్లా తక్కువ ఖర్చ్చైనా, యిది చేస్తే గొప్పను మా వైపు. ఎటొచ్చీ, గొడవంతా చేయటంలోనే వుంది. వీటినే మద్రాసులో 'పోళిగ' లంటారు. అయితే మదరాసువారు చేసేవి అరచేతి మందములో, పూరీసైజులో వుంటాయి. మా వైపు ఇలా చేస్తే చేయటము చాతకానివారని నవ్వుతారు. ఇక్కడ చేసే పద్ధతే ఇంతేమోనని కనుక్కున్నా-ఇద్దరు, ముగ్గుర్ని. వాళ్ళుకూడ చేయటము చాతకాక అని ఒప్పుకున్నారు. మావైపు పల్చగా, చపాతీల సైజులో (యింకా పెద్దవే నేమొ!) చేస్తారు.

దీనికి కావాల్సింది ½ పావు ఎర్రగోధుమలపిండి, ½ పావు సైసుగోధుమ రవ్వ, పావు బెల్లము, పావు కందిపప్పు. నెయ్యిగాని, పాలుగాని అక్కరలేదు. (నెయ్యి కొద్దిగా కావాలనుకోండి) అందుకనే యిది చాల చవక అన్నాను. చవకగదా అని రుచి తక్కువ అనుకునేరు. నన్నడిగితే దాని రుచి మరే స్వీటుకీ లేదంటాను.

రవ్వను, పిండిని బాగా కలిపి దానికి తగిన వుప్పు, వుసిరికాయంత నెయ్యి వేసి నీళ్లు పోసి కలపాలి. చపాతీల పిండికి మల్లే గట్టిగా కలపకూడదు. కొంచెం మెత్తగానే కలిపి ఆ ముద్దను ఒక తట్టలోపెట్టి, పిండిముద్దమీద ఒక పాత్రను బోర్లించాలి. అలా గంట, గంటన్నర నానాక, పిండిని బాగా కొట్టాలి. మేమువుతే గుణపుతో కొడతాము. అదంటే తెలియనివారు రోకలి వెనక భాగముతో కొట్టవచ్చు. కొటేటప్పుడు 2, 3 సార్లు చేతితో నీటిని పిండిపై చిలుకరిస్తూవుండాలి. ఈ కొట్టిన పిండిని ఒక గంటె (సాంబారు గరిట) నూనెలో ముంచి అలా నూనెలోనే పెట్టి పైన మూతమూసి ½ గంట అలానే వుంచితే పిండి బాగా వాలుతుంది. పిండి ఎంతవాలితే ఓళిగలు అంత బాగా వస్తాయ్.

కందిపప్పును వుడికించి తీసి నీళ్ళన్నీ వంచివేయాలి. చారుకు, సాంబారుకు మాదిరిగ పప్పును పూర్తి మెత్తగ వుడికించరాదు. అలా వుడికిన పక్షంలో పూర్ణము నీళ్ళలాగై ఓళిగలు రావు. ఈ నీళ్లు వంచిన కందిపప్పును, చితక్కొట్టిన బెల్లమును కలిపి ఐదే నిమిషాలు పొయ్యిపై పెట్టి దించేసి మెత్తగా రుబ్బాలి. ఈ రుబ్బిన పూర్ణాన్ని మనక్కావల్సిన సైజులలో వుండలుచేసి వుంచుకోవాలి. ఈ వుండల సంఖ్యకు రెట్టింపు సంఖ్యలో పిండిని తుంచి ఉండలు చేసుకోవాలి. బాగా వచ్చినవాళ్లు యీ పద్ధతినే చేస్తారు. మనకు రాకపోతే కొంత పిండిని ఎక్కువ తీసుకోవచ్చు. పూర్ణము మిగిలితే ఒట్టికేతి చేయవచ్చు. కాబట్టి పూర్ణము మిగిలిపోతుందనే బెంగ మీకక్కర్లేదు. ఒక్కొక పూర్ణపు ముద్దకు రెండు పిండి వుండలు కావాలి. ఈ పిండి వుండలు చేతితోనే

"గీత"

అరచేతి వెడల్పు చేసి పూర్ణపు వుండ ఒక రేకుపై పెట్టి, రెండో రేకు దానిపైన వేసి, యీ రెండు రేకులు పూర్ణపు ముద్దను కప్పేలా కలపాలి. ఇప్పుడు దీన్ని పల్చని లోహపు రేకుపైన నూనె కాస్త జాస్తిగా రాచి దానిని చపాతి కర్రతో మెత్తగా అదుముతూ రావాలి. కొంచెము గట్టిగ అదిమినా పూర్ణము బయటికొచ్చేస్తుంది. గనుక అతి జాగ్రత్తగా వత్తాలి. మావైపు ఓళిగలకనే ప్రత్యేకంగా లోహపురేకులు అమ్ముతారు. అది లేనివారు అరిటాకుపై చేయవచ్చు. ఓళిగలకనే పెనము కూడ ప్రత్యేకమైనది వుంటుంది. దానికి బదులు దోసెల (అట్ల) పెనమైనా వాడవచ్చు. కాని రొట్టె పెనము పనికి రాదు.

వత్తిన ఓళిగ మీద మళ్లీ ఒక టేబుల్ స్పూను నూనె (నెయ్యివేస్తే మరీ బాగుంటాయి.) వేసి అరిటాకుతో సహా పెనముపై వేయాలి. వేశాక అరిటాకును మెల్లగా విడిపించుకోవాలి. పెనానికి మాటిమాటికి నూనె రాయాల్సిన పని లేదు. మొదటి సారి మాత్రము రాస్తే చాలు. ఓళిగకు నిప్పుసెగ సన్నగా వుండాలి.

ఓళిగలను పాలలోగాని, నెయ్యిలోగాని అద్దుకుని తింటాము. ప్రయత్నిస్తారు గదూ!

దీన్ని చేయడానికి బొంబాయి రవ్వ పనికిరాదు. ఓళిగలు చేయడానికని ప్రత్యేకంగా అమ్ముతారు. అది దొరకని పక్షంలో మనము ఇంట్లోనే రవ్వ తయారుచేసుకొంటే ఓళిగలు బాగా రావటము ఖరారు. మంచి ఎర్ర గోధుమలను నీళ్ళు చిలకరించి తడిచేసి ఆతడితోటే విసర్రాయిలో (తిరగలి) విసురుకోవచ్చు. ఇది లేనివారు రవ్వ వేయమని మిషనుకైనా పంపవచ్చు. ఇప్పుడు తయారయిన దాంట్లో రవ్వ, పిండి, తౌడు కలిసి వుంటుంది. జల్లిస్తే పిండి పోతుంది. తర్వాత చెరిగి తౌడు తీసివేస్తే రవ్వ నిలిచిపోతుంది. పావు గోధుమలు విసరితే ½ పావు పిండి 1/2 పావు రవ్వ వస్తుంది. ★

చారు పొడి

కావలసిన సామగ్రి: చాయమినప్పప్పు, శెనగపప్పు, కందిపప్పు, ధనియాలు, జీలకఱ్ఱ, అరగిద్దచొప్పున, కొద్దిగా మెంతులు, ఒక అణా వెల్లుల్లి పాయలు, పదిపన్నెండు ఎండు మిరపకాయలు, కొద్దిగా యింగువ, చిటికెడు పసుపుపొడి.

తయారుచేయువిధం:-ఇవన్నీ బాగు చేసి పసుపు వెల్లుల్లి తప్ప మిగతావన్నీ వేటికవి,విడివిడిగా వేయించవలెను. ఎండుమిర్చి తుంచి గింజలు కాయలు విడిగా వేయించి అన్నీ గంటసేపు ఎర్రటిఎండలో ఎండబెట్టి రోట్లో వేసి మెత్తగా దంచి జల్లెడతో జల్లించి ఆఖరుకు వెల్లుల్లి మెత్తగానూరి, పొడివేసి బాగా కలిపి మరమూతవున్న సీసాలోపోసి అట్టే పెట్టుకొని కావలసివచ్చినప్పుడు చారు చేసుకొనవచ్చును. చారు ఘుమఘుమలాడుతూ బహురుచిగా ఉంటుంది. ఎండుమిర్చి వెల్లుల్లి తప్పించి మిగతావన్నీ తిరుగలిలో పోసికూడా విసురుకొనవచ్చును. చివరకు ఎండుమిర్చి రోట్లోవేసి మెత్తగా పొడికొట్టి తరువాత వెల్లుల్లికూడా వేసి కొట్టి మొత్తం కలుపుకొని వాడుకొనవచ్చును.

కొత్తపల్లి రాజ్యలక్ష్మి.

కూరలూ, పొదుపూ

చాలామందికి కూరలను పొదుపు చేయడం తెలియదు. రకానికి రెండు చొప్పున, అంటే వంకాయలు రెండూ, బీరకాయ ఒకటి, ఏడెనిమిది చిక్కుడుకాయలూ మిగులుతాయనుకోండి. అవి కూరకి చాలవు కదా అని అలా ఉంచేస్తారు. ఎండిపోయేవి ఎండిపోతాయ్. కుళ్లిపోయేవి కుళ్లిపోతాయి. తర్వాత వాటిని బయట పారేస్తారు. ఇది అందరి ఇళ్ళల్లోనూ జరిగే సంగతి. బస్తీలల్లోగానీ, సంతలున్న పల్లెల్లో

గానీ వారానికి ఒక్కమారే కూరలు తెస్తారు. మొదట నిల్వ ఉండనివి వండేస్తారు. తర్వాత దుంపకూరలు వండుతారు. దుంపకూరలుగానీ, ఆకుకూరలుగానీ ఏ కొద్ది మిగిలినా ఎంత బెటకూడదు. వాటిని యుక్తిగా ఉపయోగించాలి. ఉదాహరణకి; -ఏడెనిమిది దొండకాయలు ఉన్నాయనుకోండి. అప్పుడు మీరు పెసరపప్పు నానపోసి, పచ్చడి రుబ్బి, దొండకాయలు చక్రాలుగా తరిగి, ఈ ముక్కలూ, ఆ పచ్చడీ నూనెలో వేసి పొళ్ళీ చెయ్యండి ఎంత బాగుంటుందో, మనకి దొండకాయలు పలమాలు కాకుండా కూరఅవుతుంది! రెండు బంగాళా దుంపలూ, నాలుగు చేమదుంపలూ ఉన్నాయనుకోండి. రెండూ కలిపి ఉడికించి, పోపులో వేసి, రవ్వ పులుసు వేస్తే ఘస్టుగా ఉంటుంది. తోటకూర పులుసుకి చాలకుండా కొద్దిగా ఉంటే మరి కొంత సెనగపప్పుగానీ, కందిపప్పుగానీ వేసి, పొడికూర వండి వెల్లుల్లి కారంచల్లితే, తోటకూర పాడవకుండా అన్నాధరవు అవుతుంది. మా పిన్ని ఒకావిడ ఉండేది. వాళ్ళ దొడ్లో ఒక బచ్చలిమొక్క, రెండు గోంగూర మొక్కలూ, నాలుగు తోటకూర మొక్కలూ ఉండేవి. ఆవిడ ఆ మూడు రకాల ఆకులూ శ్రద్ధగా కోసి, పులుసు వండేది. ఆ పూటకి కూర మరి కొనేదికాదు! ఒక బేడ ఆదా నేకదా!!

ఒక చిన్న బొప్పాసికాయ ఉంటే, అది కోరి, పెసరపప్పు పొళ్ళీలోగానీ, సెనగపప్పు పొళ్ళీలోగానీ, ఉడికేటప్పుడు వేస్తే, కొబ్బరి వేసినట్లుగా ఉంటుంది! నాలుగు బంగాళీదుంపలుఉండి, ఇంకేరకం దుంపలూ లేకపోతే, బంగాళీదుంపలు చిన్న చిన్న ముక్కలు తరిగి పొళ్ళీలో వేస్తే చాలా బాగుంటుంది. కొంచెం ఓపిక, బుర్రా ఉంటే, కూరలు దండుగ కాకుండా ఎన్నిరకాలన్నా చెయ్యవచ్చు. కొద్దిగా బచ్చలి కూర, ఓ చిన్న బొప్పాసికాయా ఉంటే, బొప్పాసికాయ ముక్కలు వేసి, బచ్చలికూర పులుసు వండితే ఎంత బాగుంటుంది! కూరకి చాలకుండా ఒక అరిటికాయ ఉంటే, దాన్ని కుమ్ములో పెట్టి, ఉడికాక, చితిపితే పొడుం అవుతుంది. దాంట్లో వేయించిన సెనగపప్పుపొడుం, వుప్పు కారం, జీలకర్రా కలిపితే కందిపొడుంకన్నా బాగుంటుంది. నేను వ్రాసింది చదివి, ఊరుకుంటే కాదు. అవి చేసిచూడండి. ఇల్లా అన్నీ పొదుపుచేస్తే, చూసేవాళ్ళకి ముచ్చటగా ఉంటుంది. మీ డబ్బూ దుబారా అవదు. నేను చెప్పినవి క్రియారూపంలో పెట్టడానికి ప్రయత్నిస్తారుకదూ! ★

నండూరి రాజ్యలక్ష్మి,
(కానుమోలు).

గృహవైద్యం :

రోగులకు ఆహారము

రోగులకుగాని అప్పుడే బాగై కోలుకొంటున్న వారికిగాని ఎట్టి ఆహారము పెట్టాలి? సామాన్యమైన ఆహారము, బాగుగా ఉడికినదై ఉండాలి. ఎక్కువ మసాల, వాసనద్రవ్యములు వేయకూడదు. చూచుటకు ఇంపుగానుండవలెను. ఎక్కువ వేడిఆహారము పెట్టకూడదు. ఎక్కువ నూనె, నెయ్యి వాడరాదు. భోజనం వేళ ప్రకారం పెట్టాలి. సులభంగా జీర్ణముకాగల పదార్థాలే పెట్టాలి.

జ్వరములో ఉన్నప్పుడు

బార్లీ నీళ్ళు, వేవాటర్ (Whey water) అల్ బ్యూమన్ వాటర్ (albumen water) పండ్లరసము ఈలాంటి ద్రవాహారములు 8 గంటలకు ఒక్కసారి ఇవ్వాలి. అనవసరముగా లంకణాలు చేయించడం మంచిది కాదు. ఎక్కువ జ్వరముతో మగతగా పడివున్నట్లయితే తొందరచేసి బలవంతాన త్రాగించరాదు. వాంతి చేసుకుంటారు. మగత విడిచిన తరువాత ఇవ్వవచ్చు.

బార్లీ

ఒక గరిటెడు బార్లీ గింజలు తీసుకొని ½ సేరు నీళ్ళుపోసి పావుసేరు నీళ్ళు దిగే వరకూ కాచి చల్లార్చి నిమ్మరసముతో గాని పాలతో గాని లేక అట్లాగేగాని యివ్వవచ్చును.

వే వాటర్

ఒక గ్లాస్ పాలు, నిమ్మకాయ సగము తీసుకొని పాలు కాగినతరువాత దించి వానిలో నిమ్మకాయ రసము పిండాలి. కొంచెము సేపైన తరువాత పాలు విరిగిపోతాయి. ఆ పాలను వడపోసి ఆ నీటిలో ఉప్పుగాని పంచదారగాని కలిపి ఇవ్వవచ్చు.

అల్‌బ్యూమన్ వాటర్

ఒక కోడిగ్రుడ్డు తీసుకొని దానిలోని తెల్లసొనను ఒక పాత్రలో కార్చి egg beater సహాయముతో నురుగు వచ్చేవరకూ కొట్టాలి. తరువాత ఒక కప్పు వేడినీళ్ళలో సగము నిమ్మకాయ రసము కలిపి ఈ రసము గిలకొట్టిన గ్రుడ్డుసొనలో పోయాలి. దీనిలో ఉప్పుగాని, చక్కెరగాని కలిపి ఇవ్వవచ్చు.

జ్వరము తగ్గిన వెనుక

మొదటి వారములో ఇచ్చు ఆహారము :

ఎగ్ ఫ్లిప్ : ఒక గ్రుడ్డు, ఒక కోపా పాలు, ఒక గరిటె చక్కెర, కొద్దిగా జాజికాయ పొడి తీసుకొని ఒక పాత్రలో గ్రుడ్డు egg beater తో నురుగు వచ్చేవరకు గిలకొట్టి, కాచి చల్లార్చిన పాలు గ్రుడ్డులో పోసి, మరలనురుగువచ్చేవరకు గిలకొట్టాలి. తరువాత జాజికాయ పొడి, చక్కెర కలుపవలెను.

కస్టర్డ్:—ఒకపాత్రలో కోడిగ్రుడ్డు సొనను కార్చి egg beater తో గిలకొట్టి ఒక కప్పుపాలు, తగినంత పంచదార కలిపి దీన్ని ఒక సీల్ కోపాలో పోసి పరిపడిన మూతపెట్టాలి. మరియొక పెద్దపాత్ర తీసుకొని దానిలో 1/2 సేరునీళ్లుపోసి ఈనీళ్ల మధ్యలో స్టీలుకోపాపెట్టి పొయ్యిమీద పెట్టాలి. కొంతసేపైన తరువాత కోపాలోని గ్రుడ్డు సొన, పాలు పాల్యామాదిరి గట్టిపడి కస్టర్డ్ తయారవుతుంది. దీనిమీద మిరియాలపొడి చల్లుకొని తినవచ్చు.

కూరగాయల సూప్—క్యారెట్ దుంప, బంగాళాదుంప, రెండుస్పూన్సులు పచ్చి బటానీగింజలు, కొన్ని క్యాబేజిముక్కలు, బీట్రూట్ దుంప, టమాటాపండ్లు, మరికొన్ని మనకిష్టమైన కూరగాయలు తీసుకొని కడిగి ముక్కలుగా తరిగి ఉంచుకోవాలి. కళాయి పొయ్యిమీదపెట్టి కొంచెము నెయ్యివేసి కరిగిన తరువాత కూరగాయముక్కలు వేసి వేయించాలి. తరువాత ఒకకప్పు నీళ్ళలో కొంచెము ఉప్పు మిరియాలపొడివేసి ఈ నీటిలో ఈ ముక్కలువేసి పొయ్యిమీద పెట్టి కొంతసేపు ఉడికించవలెను. మెత్తగా ఉడికిన తరువాత దించి తేర్చి తేరిననీటిని త్రాగవలెను.

ఎముకలసూప్:—ఎముకలు శుభ్రముగా కడిగి మూడుపావుశేర్లు నీళ్లుపోసి కొంచెము ఉప్పువేసి, ఒక ఉల్లిపాయ, రెండు టమాటా పండ్లు కోసి వేయాలి. అల్లం ఒక చిన్నముక్క, లవంగమొగ్గలు నాలుగు చితుకగొట్టి వేయాలి. పొయ్యిమీదపెట్టి ఒక్కపావుసేరు నీళ్ళకు దిగకాచి దించి చల్లార్చి త్రాగాలి.

ఎ. చంద్ర

★

పైత్యమునకు

అల్లము 20 తులాలు, 10 తులాలు పటికి బెల్లం... అల్లము ముక్కలుగాతరిగి నేతిలో దోరగా వేయించినతరుపరి పటికిబెల్లము పొడిగా నూరి ఒక పదితులాల తేనెతో ఒక సీసాలో పోసివుంచుకోనవలెను. ప్రతిదినము ఒకపూట ఉదయమున పరగడుపున ఒక చెంచాడు త్రాగిన పైత్యము ఉడుకు తగ్గిపోవును.

కడుపు నెప్పికి

5 శొంఠికొమ్ములు, 5 పిప్పళ్లు, 3 తులాల వాము మొత్తము 1రోజు ఎండబెట్టిన తరువాత పొడుముచేసి, 5 తులాల తేనెలో బాగా కలిపి ఒక సీసాలో దాచివుంచుకొని ప్రతి దినము రాత్రులు పరుండబోవునప్పుడు 1, 2 చెంచాలు త్రాగిన ఉదరబాధలు తగును. జీర్ణశక్తి వృద్ధియగును.

నిద్రపట్టుటకు

వేడిచేసి నిద్రపట్టక, కాళ్ళుచేతులు లాగి నప్పుడు వడిసెత్తికి, అరికాళ్ళకు ఆముదము బాగా అంటినచో వేడి తగ్గి బాగా నిద్ర పట్టును. కండ్లుమంటలు, ఎర్రనిరంగు తగ్గును.

తల దురద - చుండ్రు

ఒక శేరు నువ్వుల నూనె, 5 పలముల మంచి ఆముదము రెండు కలిపి బాగా సల సలా కాగనివ్వవలెను. ఒక నిమ్మపండుకోసి (లోనలు, గింజలు లేకుండా) రసము అందులో పోయవలెను. 10 మందార పువ్వులు, 5 సంపెంగపువ్వులు, కొత్తమరు వము, కొత్తదవనం, 3 తులాలు కచ్చోరాలు అందు వుంచవలెను. తిరిగి ఒక పొంగు రానిచ్చి దింపి ఒకసీసాలోకి ఒడపోయవలెను. తరువాత ప్రతిదినము పిన్నలుపెద్దలు అందరు నెత్తికి రాచుకొనవచ్చును. దీనివలన తలదిమ్మ, తలనొప్పి, కనులుమంట తగ్గును. బాగా నిద్రపట్టును. వేడితగ్గి మెదడుకు చల్లదనము కలుగజేసి పేలు, చుండ్రు పోవును.


అతిమూత్రవ్యాధికి

చెరకుపండ్లు ఎక్కువ తినవలెను. తీపి తగ్గించి కారము, పాలు, పెరుగు, పండ్లు ఎక్కువగా వాడవలెను.

సేకరణ:

—ఇవటూరి శ్యామలాదేవి.

★



మీ కుటుంబమునకు ఒక పండుగ కానుక

ఆల్-వేవ్ **నేషనల్-ఎక్కో** రేడియో


రు. 200/00 మొదలుకొని వివిధ ధరలు

వచ్చే పండుగ శుభ సమయములో మీ కుటుంబమునకు ఒక నేషనల్-ఎక్కో రేడియోను కొనిపెట్టండి. ఈ దివ్యమైన 'కానుకకు యింటిలో పిన్న పెద్ద అందరూ ఎంతో సంతోషిస్తారు!


ఈ దిగువ 6 సొగసైన నేషనల్-ఎక్కో మోడలులు చూపబడినవి. ఎంచుకొందుకు యింకా ఎన్నో రకములవి దొరకుతున్నాయి నేషనల్-ఎక్కో వ్యాపారివద్ద వాటిని నేడే చూడండి.




మోడలు 241: 6 వాల్వులు, 3 బ్యాండులకు సమమైన 2 బ్యాండుల ఏసి/డిసి సెట్. 4 వాల్వులుగల డ్రై బ్యాటరీ సెట్ కూడ ఉంది. రు. 200/00 నెట్




మోడలు బి-703: 5 వాల్వులు. 3 బ్యాండులుగల డ్రై బ్యాటరీ సెట్. రు 325/00 నెట్




మోడలు బి-712: 6 వాల్వులు. 5 బ్యాండులు బ్యాండ్ స్ప్రెడ్ చేయబడిన డ్రై బ్యాటరీ సెట్ రు 475/00 నెట్



మోడలు ఎ-703: 6 వాల్వులు, 8 బ్యాండులుగల ఏసి సెట్. రు 325/00 నెట్



మోడలు 187: 6 వాల్వులు, 8 బ్యాండులు బ్యాండ్ స్ప్రెడ్. ఎ-187 ఏసి సెట్. యు-187 ఏసి/డిసి సెట్ రు 47./00 నెట్




మోడలు ఎ-317: 7 వాల్వులు. 8 బ్యాండులు బ్యాండ్ స్ప్రెడ్ చేయబడి, సరి ట్యూన్డ్ లైట్, ఎఫ్ ఫేజి కలదు. ఏసి సెట్ రు 695/00 నెట్

నేషనల్-ఎక్కో రేడియోలు శ్రేష్ఠమైనవి
— అవి మాన్‌సూనైజ్ చేయబడినవి

ఏ నేషనల్-ఎక్కో వ్యాపారియైనా వీటిని మీకు ఉచితముగా పెట్టి వినిపించుటకు సిద్ధమే. ఈ రేడియోలతో 12 నెలల గ్యారంటీ కలదు. స్థానిక పన్నులు అదనము.

జెనరల్ రేడియో & అప్లయన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్

ఒపేరా హౌస్, బొంబాయి 4 • 3 మదన్ స్ట్రీట్, కలకత్తా 13 • 1/18 మౌంట్ రోడ్, మద్రాసు • 36/79 సిల్వర్ జూబ్లీ పార్క్ రోడ్, బెంగుళూరు • బోర్డింహామ్ హౌస్, చాందినీ చౌక్, ఢిల్లీ



వనితావాణిలో సరళాదేవిగారు వ్రాసిన "పొగడ్త" అనే వ్యాసము నన్ను బాగా ఆకర్షించింది. ముఖ్యముగా ఈ వ్యాసము వలన ఎల్లప్పుడూ ఎదుటి వాళ్ళను పొగిడి ఆకాశానికి ఎత్తి తమపనులను నెరవేర్చుకొనే వాళ్ళకూ, అస్తమానమూ తమని పొగిడించుకొనీ, అలా వీలుకాకపోతే తమంతట తామేనా, అంతవాళ్లు లేరనిపొగడుకొనేవాళ్లకూ (ఇది చదివిన వాళ్లలో) గుణపాఠం. అంతా కాకపోయినా కొంతయినా మార్పువస్తుందని నా అభిప్రాయము. రచయిత్రికి నాహృదయపూర్వక అభివందనములు.

—తూతా అన్నపూర్ణ, (ఏలూరు.)

* * *

18-9-57 ఆంధ్రపత్రికలో యం. జి. కాంతమ్మగారు తన హరినామస్మరణ ఆ విధంగా పైకి అనడం ఏమీ బాగులేదు. ఏమిటి మరీ విడ్డూరంగా వీధి అరుగుమీద కూర్చుని అంత పైకి నారాయణ, శ్రీహరి అని అందరికీ వినబడేటట్టు అనటం. తిరిగీ హరినామస్మరణకి భంగం కలిగిందని అదో గొప్ప విషయంలా చెప్పడం ఏమీ బాగులేదు. ఇక 'ప్రక్క ఇంటి వారి పుస్తకపఠనం' వ్యాసం లక్ష్మిగారు బాగా వ్రాశారు. కొన్న వాళ్లు చదివిన తరువాత పైవాళ్లు పట్టుకుపెళ్ళి జాగ్రత్తగా తెచ్చిఇస్తే, ఎంతో బావుంటుంది. అంతే గాని తనదికాదుకదా అని, ఇష్టమొచ్చినట్లు చించడం బాగులేదు. స్త్రీలకు ప్రత్యేక గ్రంథాలయాలు కావాలని మంగళా కందూర్ గారు వ్రాసినది చదివేను. కాని నా అభిప్రాయం ఏమిటంటే అట్లా ఆప్రత్యేక గ్రంథాలయాలు మనకి అందుబాటులో లేనప్పుడు ఒకవీధి స్త్రీలంతా కలసి నెలకి మనిషి ఒక్కంటికీ ఒక రూపాయి చొప్పున వేసుకుని, ఆ డబ్బు మొత్తం ఇరవైయ్యో తారీకో వచ్చేటట్లు చూసుకు ఆ డబ్బుతో పత్రికలే కాక, మంచిమంచి నవలలు కూడా కొనుక్కుని అందరూ జాగర్తగా చదివి, ఆ చదివేసిన పుస్తకాలు ఎవరికిచ్చినవి వాళ్ళు తీసుకుని ఆపైనెల ఇంకొకళ్ళకి (మొదటి నెల పుచ్చుకోని వాళ్లకి) ఇస్తే బావుంటుంది ఈవిధంగా చేస్తే ప్రతివారూకూడా డబ్బు ఇచ్చినవారే కాబట్టి పుస్తకం జాగ్రత్తగా వుంచుతారు. అట్లా వుంచని పక్షంలో ఆ పుస్తకం విలువనిబట్టి వాళ్ళకి బేడో, పావలో ఫైన్ వేస్తే మర్నాడు జాగ్రత్తగా వుంచుతారు. పుస్తకాలు నీవు తీసుకున్నావు నేను తీసుకోలేదు అనే భేదంవుండదు. ఒక్కొక్క నెల ఒక్కొక్కరికి ఇవ్వవచ్చు. ఇక లైబ్రరీ వుండికూడా వుపయోగించుకోనివారు ఎంత మంది వున్నారో మా ఇంటిదగ్గరగానే ఒక లైబ్రరీవుంది. దానికి నెలకి చందా రెండణాలు. మనకికావలసిన పుస్తకాలు, అందులోవున్న స్త్రీలే వాళ్ళ వీలునిబట్టి వారానికి ఒక రోజో రెండురోజులో తెచ్చి ఇస్తారు. లేకపోతే మన ఇంట్లో చిన్న పిల్లలు వుంటే వాళ్లని పంపించి తెప్పించుకోవచ్చు. కానీ మావీధిలో మూడు నాలుగిళ్ళ వారు తప్ప ఎవ్వరూ దానికి చందా కట్టరు. అటువంటివాళ్లు మళ్ళీ చదవరేమో అంటే అదేంలేదు. ఎవరివద్దనైనా పుచ్చుకుని చదువుతారు. మంగళా కందూర్ గారు చేప్పే సలహా (బండిమీద పుస్తకాలు తేవడం) చదువుతే, లైబ్రరీలో పనిచేసిన ఒకఆమె చెప్పే అనుభవాలు నాకు జ్ఞాపకం వస్తున్నాయి. ఒక ఆమె ఆ లైబ్రరీలో మెంబరట. ఆమె "వూరికి వెళ్ళతాను, ఏమైనా పుస్తకాలు ఇవ్వండి తిరిగి వూరినించి జాగ్రత్తగా తెచ్చి మీకిచ్చేస్తాను" అని చెప్పి రెండు పుస్తకాలు పట్టుకెళ్ళి తిరిగి ఎన్నిరోజులకీ ఇవ్వకపోతే ఈమె వెళ్ళి అడిగేరట. దానికి ఆ ఇంటిలోని వారందరూ కలిసి ఒకే జవాబు చెప్పారట. ఆ జవాబు ఏమిటంటే ఆ పుస్తకాలు మీకు అప్పుడే ఇచ్చేశామని! మరి వేరేదారిలేక తన డబ్బుపెట్టి ఆరెండు పుస్తకాలూ కొని లైబ్రరీలో వుంచింది లైబ్రరీయన్. ఇక చందా నెలకి బేడ. ఆ బేడా ఇవ్వడానికి కూడా కొందరు నానాగోలచేస్తారట. ఈమె సెలవులో వుంటే ఇక చందాలు ఎవరూ కట్టరు. అరణాలు అర్థరూపాయి, పెరిగిందంటే, "అమ్మ బాబోయి అర్థరూపాయా" అని అంటారట. ఇచ్చిన పుస్తకాల మీద వాళ్ళ పేర్లేకాకుండా దానికి విమర్శలుకూడా రాస్తారు! నేను ఎన్నో పుస్తకాలకి చూశాను. ఎందుకలా రాస్తారని అడుగుతే ఏం మాయిష్టం రాస్తేరాస్తాం అంటారు. ఇదా జవాబు. అటువంటి దేవాంతకులకి ఇంటింటికీ బండిమీద పుస్తకాలు సప్లయిచెయ్యడం ఎంత కష్టం! ఇచ్చినపుస్తకాలు తిరిగి ఇవ్వకుండా ఇచ్చేమని దబాయిస్తే ఎన్నిటికని వీళ్ళా పెట్టుకుంటారు చెప్పండి. న్యాయం వుండక్కరలేదా. లేనివాళు లేదంటే, మాకు దగ్గరగావున్న లైబ్రరీనే చాలామంది వుపయోగించుకోలేకుండా వున్నారు. ముందు జాగ్రత్తగా పుస్తకం చదివి దానిని తిరిగి అప్పజెప్పడం నేర్చుకుని అటుపైని గ్రంథాలయాలు కావాలంటే బావుంటుంది. చదివేవాళ్లకి శ్రద్ధలేనప్పుడు లాభం ఏమిటి?...

—బి. వరలక్ష్మి, (విజయనగరం.)

ప్రశ్నకు జవాబు

సత్యవతిగారూ: 'వనితా వాణిలో' మీ సందేహాన్ని చూచాను. ఒక చిన్న చెంచాడు తేనెలో తాజాగులాబీ పూవులోని పూర్తి రేకులనైనా, లేకుంటే సగం రేకులన్నా రాత్రిపూట ఏ గాజుకప్పులోనైనా నానేసి ఉదయాన్నే తీసికొంటూండండి. ఇలా ఒక వారమూ, నెలా చేయాలనిలేదు. మీకు ఇష్టమువచ్చినంతకాలమూ చేయవచ్చును. ఆ తర్వాత మీరు పొందిన ఫలితాన్ని వ్రాస్తారుకదూ!

బి. ప్రేమలీల, పెద్దాపురం.

కనీ వినీ ఎరగనని

"ఉత్తరాల దొంగలు" అను వ్యాసము చదివాను. ఆవిడ చెప్పినదానిలో చాలవరకు సత్యము లేకపోలేదు. కాని భార్యా భర్తలు వ్రాసుకొనే జాబులను తనిఖీచేసి మరీ ఇచ్చే వారిని నేనింతవరకు చూడలేదు. వినలేదు. యుక్తవయస్సు వచ్చిన పిల్లలుంటే వారికి వచ్చే ఉత్తరాలను చూడకపోయినా కనీసం ఎక్కడినుంచి వచ్చిందని అడగటంలో తప్పు లేదనుకుంటాను. ఉదాహరణకు; ఆడపిల్లల హాస్టలులోని వార్డెను పిల్లలకు వచ్చిన ఉత్తరాలన్నిటిని చదివి మరీగాని వాళ్లకు ఇవ్వదు. మరి ఇది తప్పంటారా? వారు ఉత్తరాల దొంగలనుగురించి వ్రాశారు కాని తమకు వచ్చిన ఉత్తరాలను ఇతరులకు చూపించటానికి కొందరు ఎంత తహతహలాడుతుంటారో వ్రాయలేదు. ఈ వ్యాస రచయిత్రికి నా ధన్యవాదాలు.

సి. హెచ్. రాజకుమారి,
(విజయవాడ).

అతనెవరు

(34 వ పేజీ తరువాయి)

డం మాత్రం కాదు" అన్నాడు.

"అబ్బే—మీరు పొరబడుతున్నారు నాలో నిజానికి అంత గొప్పదనం లేదు. మీరిచ్చే గౌరవానికి నేను తగను" అన్నాడు దొంగ.

నాగేష్ తండ్రినిచూసి "నాన్నా! అదేదో వివరంగా నలుగురికీ అర్థమయ్యేలా చెబితే మేము కూడా వీరినభినందించ గల్గుతామనుకుంటూ" మన్నాడు.

"ఇదుగో చెప్తున్నాగా—ఈ రోజుని యీ కాఫీఫలహారాలు మనం సేవిస్తున్నామంటే, అది ఈ మహానుభావుడు పెట్టినభిక్షే. ఈసంగతి ఆయనకీ పూర్తిగా తెలియక పోవచ్చు. కాని భగవంతుడు యీయనలో దూరి మనకీమేలు కలుగజేసేడు" అంటూ దేముడికి నమస్కారం చేస్తూండగా వాసుగారి కళ్ళవెంబట నీటిబిందువులు రాలేయి. దాన్తో విషయం తెలియకున్నా రూపా, తల్లికూడా కంటతడిబెట్టుకున్నారు. రూప నాన్నగారిని "నాన్నా ఏమిటో సరిగా చెప్పరూ" అని ముక్కు ఎగబీల్చింది. దొంగ తెల్లమొహం మేసుక్కూచున్నాడు.

ఆఖరుకు విషయం తేల్చేడు వాసుదేవరావు "నిన్న మనం తప్పిపోయిన ట్రెయిను రాత్రి ఒంటిగంటకు పట్టాలు తప్పి నదిలో పడిపోయింది. ఏడు, ఎనిమిది పెట్టెలలో జనం చాలామంది చనిపోయిఉంటారని ఈ వుదయం పేపరులో వార్త. ఆపడిపోయిన పెట్టెలలో మనరిజర్వుడు పెట్టెకూడావుంది. అందులో బహుశా ఎవరూ బ్రతికిఉండరని వార్త. మనంమాత్రం మృత్యువునోట్లోంచి ఊడిపడ్డాం. అంతా భగవన్మాయ. ఈయనలో ఆ భగవంతుడుదూరి నా పర్సు యీయనద్వారా దొంగిలించకపోతే మనకు ఈరోజు భూమిమీద తిండిఉండేదికాదు గదా. అసలు కుటుంబనాశనం అయిపోయేది. ఈ మహానుభావుడు కాపాడేడు. ఇప్పుడేనా తెలుసుకోండి యీ మహానుభావు డెవరో."

అప్పటివరకూ కులాసాగావున్న దొంగకి వంటినిండా చెమటలుపట్టడం మొదలు పెట్టాయి. నోటంటమాటరాక బాధపడుతున్నాడు. శాంతమ్మ, రూప, నాగేష్ కూడా దొంగకి నమస్కారం చేశారు.

దొంగ లేచినిలబడి "వాసుదేవరావు గారూ! క్షమించాలి. మీవంటి పెద్దమనిషివద్ద యీ విధంగా నే నడుచుకున్నందుకు చాలా సిగ్గుపడుతున్నాను. నన్ను క్షమించమని వేడుకుంటున్నాను. ఈరోజునుంచి యీపని మరి చెయ్యను. నామాటనమ్మండి" అని వారి రెండుచేతులూ పట్టుకుని చెప్పి వెళ్తూండగా టెలిగ్రాం వచ్చింది. ఆడపెళ్ళివారు కారణాంతరాలచేత పెండ్లి వచ్చేవారానికి మార్చుకున్నట్లు కబురు. ★



★ మంచి ఆశ్రయము ★

పరమేశుని శిరమునగల
పావన గంగాజలమున
స్నానమాచరింపదలచె
మానసమున నొక్కచీమ.

తనకోరిక ఎట్లు తీరు
నని మదిలో చాలసేపు
చింతచేసి చింతచేసి
చివరకొక్క యుక్తిపన్నె.

ఒక్క కుసుమమందు దూరి
నక్కియుండె రహస్యముగ
దాని చిన్నిఎడదనేమి
దాగియున్నదో కదా!

మరునాడా పూదోటకు
గిరిజ చెలులగూడివచ్చె;
భూతేశుని పూజకొఱకు
పూవులు సమకూర్చుటకై.

మంచి మంచి పుష్పములను
త్రుంచి త్రుంచి బుట్టనింపె;
చీమయున్న దానిగూడ
ఆమె కోసి బుట్టనిడియె.

ఆ సుమములతో పార్వతి
అర్చించెను ముక్కంటిని;
చీమ యిట్లు సులభముగా
శివుని శిరముపై జేరెను.

అచటనున్న గంగయందు
అమితానందమున మునిగి,
నిజహృదయాభీష్టంబును
నెఱవేర్చుకొనెను చీమయు.

కాన నరసిచూడ నెంత
కష్టమైన పనియైనను
ఆశ్రయంబు మంచిదైన
నశ్రమమున సాధ్యమగును.

ఆర్. దొరసామి

కవి చెప్పిన కథ

హైస్కూలంతా గొడవ గొడవగా వుంది. ఎక్కడ చూచినా వొక్కటే గోల. పైగా నల్లబల్లమీద కూడా వ్రాశారు, "రచయిత రామూ! వెల్‌కం!" అని.

"నేను కథలు వ్రాసుకుంటే వీళ్ళకేం కడుపుబ్బరమూ? ప్రతి వాడూ నన్ను విమర్శించేవాడే! నా భావాలు నావి! వాళ్ళంతా దేనికి నన్ను వేళాకోళం చెయ్యటం" రాముకు తలుచుకుంటే వొళ్లు మండి పోతోంది. వీళ్లనుగూర్చిన రకరకాల భావాలు బుర్రలో గిరగిరా తిరిగి పోతున్నయ్—కారు చక్రాల్లాగా. అదోముఖంపెట్టి కూర్చున్నాడు.

"రామూ! భలేగా రాశావురా. ఇంతకీ అది నువ్వు రాసిందేనా అని."

"అదికాదురా! నిజంగా నువ్వే ఆ కథరాస్తే నీకు తెలుగులో యెందుకు రావురా మార్కులూ?"

"నోర్మొయ్యండోయ్. వాడికి ఇలా కథరాయరా అని చెప్పింది మొదట నేను. వాడు నా శిష్యుడు. అలాగే రాశాడు. కథ పత్రికలో పడిందీ! అంతే!"

"వాళ్ళ యీ వాగుడంతా, అర్థాంతరంగా నన్ను తిట్టటమే. గోల చెయ్యటమే," అనుకున్నాడు రామూ.

ఇంతలో లెక్కల పంతులుగారు తయారూ! కోతుల్లాగా కొందరు బెంచీలమీద గెంతుతూ వాళ్ళ సీట్లలో కూర్చున్నారు. చివరి బెంచీ మీద కూర్చున్నాడు రామూ. అందువల్ల వేలుపెట్టి వెతక్కుండానే పంతులుగారి కంటపడ్డాడు.

"ఏరా...రామూ హోంవర్కు చేశావా?"

మెదలకండా నుంచొన్నాడు.

"స్తంభంలా నిలబడకపోతే అవునో కాదో చెప్పరాదూ...ఊఁ.. చెప్పు" గద్దించాడు.

"హోంవర్కు చెయ్యలేదండీ." కాస్త గట్టిగానే సమాధానం ఇచ్చాడు బయటకు. "అసలు మీకూ ఇదే జబ్బు పుట్టాలీ! అటెండెంసు వేసుకోకండానే ఆరంభించారు ప్రశ్నలు. ఇదంతా నేను రాసిన కథ పత్రికలో పడిందనేగా. ఇంతకన్నా యేమన్నా అవమానముందీ......" అనుకుంటూ లోపల కుమిలిపొయ్యాడు.

"కథలు రాయమంటే తీరికుందీ? లెక్కలు చెయ్యటానికి లేదూ! ఒరే రామూ! మీనాన్న చంద్రయ్య గారితో చెప్పి...చూసుకో యేం చేయిస్తానో..." అంటూ తనకున్న వుక్రోషాన్ని కక్కేసుకున్నాడు. అసలు రామూకూ లెక్కల పంతులుకూ చుక్కెదురు.

"కథలురాయటం తప్పంటారా! దానికీ యెంత సీరియస్‌గా ఆలోచించాలో తెల్సా! ఆ ఆలోచన ముందు మీ లెక్కలబుర్ర వర్కు చేస్తుందీ!...అయినా కథలు రాయడం వో పెద్ద నేరంచేయటమా యేంటి?" ముఖాన అడిగివేద్దామని అనుకున్నాడు. అయితే ఆయనగారి చేతిబెత్తానికి లొంగిపోలాల్సి వచ్చింది.

వొదిలిపెట్టారు బడి. "నా కథను చూచి ఎందరు ఎలా ఆనందించారో, అభినందిస్తారో ప్రత్యక్షంగా చూదామనివస్తే ఇంత గోల దేనికి పుట్టింది చెప్మా! అందరూ నా కథ చూచి అంత పరిహాసించటం దేనికి? నా రచన నాదే! నాకుండే 'రచయిత రామూ' అనే యోగ్యత నాకే వుంటుంది. వీళ్లు నన్ను రాయనీకండా యేమాత్రం వుంటారో చూస్తాగా!" అనుకుంటో ఇల్లు జేరాడు.

"వెధవని...రానీ చెప్తా! పెద్ద సంస్కర్త అవుతాడా కథలు రాసి. వీడూ-వీడి పిండాకూడు కథలూను... అయినా చదువూ సంధ్యా అక్కర్లా. జీవితంలో బరువు భారాల్ని యేమ

★ కలిసొచ్చిన కథ ★

ర్థం చేసుకొన్నాడేం కథలు రాయ టానికి! కలంతో నాల్గు ముక్కలు గీకగానే కథలు అయిపోయినై... పరీక్షలు దగ్గిరికి రావటంలా..." చంద్రయ్యగారు చిందులుతొక్కుతూ అంటున్నాడు కోపంతో...గుండెల్లో గుబులు గుబులుగావుంది రామూకు.

నక్కి-నక్కి- గదిలో జొరబడ్డాడు.

"ఏరా—రామూ..." పిలుస్తూ అన్నాడు చంద్రయ్య. నోరు మెదప కండా నుంచున్నాడు వచ్చి.

"చదువక్కర్లేదూ..."

"అబ్బ! పోనిద్దురూ—కొడుకు కథలు రాస్తే గర్వంతో నల్గురికీ చెప్పుకోవాల్సిందిపోయి వాడిమీద దేనికీ యింత ఇదయిపోతారూ? పదరా రామూ...త్వరగా భోంచేసి బళ్ళోకి పో..." చెయ్యి పట్టుకొని రామును లోపలికి తీసుకుపోయింది జానకమ్మ, అమ్మమాటలు విని, ముఖం కాస్త తేటపడింది రాముకు.

"రామూ! వొక్క మాట విను. నువ్వు కథలు రాయటం మానివేస్తా నంటే నే పరీక్ష జీతం కడ్తా... లేకుంటే నువ్వూ నీ కథలూ...యే మయిపోయినా నాకు దిగుల్లేదు... యేం? చెప్పు త్వరగా పోవాలి!" వంటింట్లోకి వచ్చి చంద్రయ్య కొడు కును గట్టిగా ప్రశ్నించాడు.

"నే నింక కథలు రాయను నాన్నా...", కొద్దిగా రామూ గొం తులో పరితప్త చిహ్నాలు కని పించినయ్.

చంద్రయ్యకు కావాల్సిన సమా ధానం దొరికింది! "మర్చేపొయ్యా ను. పెద్దవాడికి కాలేజీఫీజుపంపారూ! రెండు మూడు వుత్తరాలు రాశాడు. వాడేం యిబ్బంది పడ్తాడోయేమో!" ఆయనగారికి గుర్తు చేసింది జాన కమ్మ, అబ్బాయికి నెయ్యి వేస్తూ.

"నా కన్నీ జ్ఞాపక మున్నయ్. నువ్వేమీ చెప్పనవసరం లేదు. చేతిలో నిండా పైకంలేదు. పది రూపాయిలు తరుగు అయినయ్... చేబదులు తీసుకుని పంపాలి..." అంటూ సావిట్లోకొచ్చి నులక మంచంమీద కూర్చున్నాడు. "యెవ రిస్తారా చేబదులూ?" అనుకుంటో, చుట్టముట్టించి ఆలోచిస్తున్నాడు.

"రామచంద్రయ్యగారూ యం. వో. వచ్చిందండీ!" సైకిలు దిగుతూ పోష్టుమ్యాన్ కేక పెట్టాడు.

"నాకేనా...రావటం!"

"మీకాక్కాదండీ—మీ అబ్బాయి

గారికి. రామూ పేరుతో వచ్చింది."

"వాడికెవరు పంపించారయ్యా... ..." అంటూ ఫారం అందుకొన్నాడు. చూసుకొన్నాడు.

"యేమేవ్! అబ్బాయికి పత్రికలో కథ తాలూకు పదిరూపాయలు ముట్టినయ్...చూచావా!" అంటూ సంతోషంతో వంటింటోకి వెళ్లాడు.

"చూచారూమరీ! వాణ్ని వొక్క-ళేగోల చేసి వదిలారు ఇందాకటి వరకూ...కథ రాయొద్దురా అని ... అప్పుడే రామూ పది రూపాయలు సంపాదించాడన్నమాట! భేషుగ్గా వుంది...పోన్లెండి! త్వరగా ఈపదితో పెద్దాడి ఫీజుకు పంపండి." జానకమ్మ గర్వానికి కట్టలు లేవు. "మానా యనకదూ! రామూ...మంచి కథ రాశావురా...నేనింతకూ చూణ్నే లేదు దాన్ని" అంది కొడుకుతో.

రాము త్వరగా ముగించాడు అన్నం తినటం. పదిరూపాయలూ తీసుకొని చంద్రయ్య చేతి కిచ్చాడు.

"రామూ - తెలీక అడుగుతాను కథ అంత బాగా రాశావన్నమాట! లెక్కల పంతులుగారు చదివారుట- ఇంకేముందీ నిన్నల్లా వొక్క-ళేగోల నాతో, 'మీ అబ్బాయి చెడిపోతా డ'ని...బాగా చదువుకుంటూ కథలు రాసుకున్నా ఫరవాలేదు. ఇందాక యేదో కోపంలో రాయవద్దన్నారా అంతే!", చంద్రయ్యకు తనుచేసిన పని పొరపాటనిపించింది.

"మా రాములాగ కథలల్లే వాళ్లు యీ వూళ్లో ఇంతవరకూ పుట్టటం నే చూడలేదు.....మావాడికి చిన్న కథరాస్తే పది రూపాయలు బహుమానం పంపారు." అంటూ పొరుగింటి లలితమ్మతో చెప్తోంది జానకమ్మ.

★

యాత్రా విశేషాలు

(4-వ పేజీ తరువాయి)

ఉంటే ఆ ప్రాంతపు రోడ్డు మాప్ కూడా ఇస్తారు. ఇంజన్ చెడితే బాగుచేసి పెడతారు. ఇలా రోడ్లపక్కన ఉండే పెట్రోల్ స్టేషన్లవద్ద కాఫీ, తినుబండారాలు కూడా దొరుకుతాయి.

అమెరికాలో కార్లు శుభ్రం చేయడం ఒక లలిత కళగా అభ్యసిస్తారని అనిపిస్తుంది. కొన్ని కొన్ని చోట్ల కారును ఏదో లాండ్రీ లాంటి గదిలోకి తీసుకెళ్ళడం, శుభ్రంగా తుడిచి, పాలిష్ కూడా చేసి బయటికి తీసుకు రావడం—అంతా పదినిమిషాల్లోపున జరిగిపోతుంది.

లాస్ఏంజలిస్‌లో ఒక చోట నేను చూసినన్ని కార్లు ఇంకెక్కడా ఎప్పుడూ చూడలేదు. లాస్ఏంజలిస్ చాలా విశాలమైన ఊరుకావడంవల్ల ఎక్కడికి పోవాలన్నా కారు ఉండి తీరాల్సిందే. ఊరికంతటికీ ఒకటే "స్కై-స్క్రేపర్" ఉంది. దానికి 35 అంతస్తులు. అది పురమందిరం. 150 అడుగులకంటే ఎత్తున మేడలు కట్టగూడదని పురపాలక సంఘంవారు నిషేధించారు. అందుకే ఆ ఊరు హాయిగా, చూడ ముచ్చటగా ఉంటుంది.

వినోదంగా ప్రారంభించిన వ్యాపకాన్ని లాభసాటి వ్యాపారంగా మార్చుకోవడానికి లాస్ఏంజలిస్‌లో ఉదాహరణలు కనిపిస్తాయి. పెట్రోలు వ్యాపారస్థు ("ఆయిల్ కింగ్") డొహొనీకి మొక్కలు పెంచడమంటే మోజు. ఆయన రకరకాల మొక్కలను తెప్పించి సరదాగా తన తోటలో నాటించి పెంచాడు. ఈ నాడు 'డాస్ పాబ్లోస్ కంపెనీ' బ్రహ్మాండమైన మొక్కల వ్యాపారం చేస్తోంది. ఆయనదగ్గర పనిచేసే ఉద్యోగులు కొత్తకొత్త మొక్కల కోసం దేశమంతా తిరుగుతూ ఉంటారు. కొత్త మొక్క దొరికితేచాలు, దాన్ని తనతోటలో ఆయన నాటించుతాడు. మొక్కల్ని శాస్త్రీయ పద్ధతుల్లో పెంచుతాడు. పువ్వుల్ని అమెరికాలో అన్ని ప్రాంతాలకూ విమానాల్లో ఎగుమతి చేస్తాడు. ముఖ్యంగా న్యూయార్కు-కు చాలా పువ్వులు ఎగుమతి అవుతాయి. ఈయన కంపెనీ శాఖ ఒకటి ఆస్ట్రేలియాలో కూడా వెలిసింది.

అమెరికాలో "ఐ డాగ్స్" అనే రకం కుక్కలు తమాషాగా ఉంటాయి. ఇవి గుడ్డివాళ్లని నడిపించుకుపోతాయి గనుక వీటికి "ఐడాగ్స్" అని పేరు వచ్చిందట. గుడ్డివాడు ఎక్కడికి పోవాలంటే అక్కడికి ఈ కుక్కలు తీసుకుపోగలవు. ఆ విధంగా వాటికి తర్ఫీదిచ్చారు. లాస్ఏంజలిస్ విశ్వవిద్యాలయంలో ఈ కుక్కలు పలువురు విద్యార్థులను ఇలా తీసుకుపోవడం నేను చూశాను.

లాస్ ఏంజలిస్ పట్టణం మధ్యలో "క్లిఫన్స్ కెఫెటేరియా" అని ఒక రెస్టారెంట్ ఉంది. "ఆర్థిక మాంద్యం" నాటి రోజుల్లో ఈ రెస్టారెంట్ యజమాని అడిగిన వారికి లేదనకుండా ఒకపూట భోజనం ఉచితంగా పెట్టేవాడని చెబుతారు. ఆనాటి ఔదార్య ఫలితంగా ఈ నాడు అతని వ్యాపారం జోరుగా సాగుతోంది.

ఆ నగరాన్ని ఎంతవర్ణించినా, చూస్తే గాని నమ్మలేనంత అద్భుతంగా ఉంటుంది. హాలీవుడ్‌లో అడుగుపెడితే చాలు, ఎక్కడ చూసినా గానా బజానా! ఎక్కడచూసినా సూర్యకాంతితో "స్నానం" చేసే సినిమా తారలు! రోడ్ల కటూ ఇటూ అల్లిబిల్లిగా అల్లుకున్న లతానికుంజాలు! ఎన్ని మైళ్లు తిరిగినా కలకలలాడే పచ్చని తీగెలు, పొదలు తప్ప ఏమీకనిపించనంత ప్రకృతిసౌందర్యం! చూసి తీరవలసిన దృశ్యం లాస్ఏంజలిస్!

★

నక్షత్ర ఫలితాలు

(8-వ పేజీ తరువాయి)

లను సాధించడానికి మీ నేర్పరితనం ఉపయోగించుకుంటారు. ఇది మీకు యోగకాలమగుటవల్ల మీరు ఎక్కువ శ్రమ పడకుండానే పనులన్నీ నెరవేరుతాయి. సకాలములో అనుకున్న ధనాదాయము వస్తుంది. తూర్పుదిక్కునుంచి శుభకార్యములను గురించి చేసిన ప్రయత్న ఫలితము తెలుస్తుంది. ఉద్యోగులకు అధికారుల ఆదరణ లభిస్తుంది. కుటుంబమందుండువారికి నూతన వస్త్ర లాభము, అలంకారలాభము కలుగుతుంది. తీపివస్తువులలో విందుల నారగించి వినోదముగా గడుపుతారు. విద్యార్థులకు లాభముగాను, వినోదముగాను వుంటుంది. 19నుంచి వర్తకులకు లాభసాటిగా వుంటుంది. 21,22 వినోదము, ఖర్చులు ఎక్కువ. కవులకు, కళాకారులకు, నటీనటులకు మేలుకాలం.

శ్రవణము [జూ, జే, జో, ఘా]

ఈ వారము శరీరమునకు కష్టము ఎక్కువవుతుంది. చేయదలచుకున్న పనులకు జాప్యము కలుగుతుంది. పితృవర్గమునుంచి ఆశించిన ఆర్థిక సహాయము మీకు సకాలమున చేతికందక ఆరాటపడతారు. మానసిక స్థితి తృప్తికరముగా వుండదు. అనారోగ్యసూచనలు కనబడినవెంటనే శ్రద్ధ వహించడం మంచిదివి కార్యంలోనూ తగిన నిర్ణయానికి రాలేక, అశాంతిని పొందుతారు. ఉద్యోగులకు వత్తిడి ఎక్కువ. వర్తకులకు ఉత్సాహముగా వుంటుంది. విద్యార్థులకు చదువుమీద కన్న, వినోదములపై మోజు ఎక్కువవుతుంది. 19న కొంత స్వస్థత కలుగుతుంది. 20న మార్పు, 21,22 తేదిలలో ఖర్చులు; అమితమైన అశాంతి.

ధనిష్ఠ [గా, గీ, గూ, గే]

ఈ వారము మీకు ప్రతికూల, అనుకూల వాతావరణంతో యోగము మిశ్రమ ఫలములు కలిగివుంటుంది. సకాలములో కార్యములు నెరవేరకపోవుటచేతను మొదట్లో ఆరాటపడినను వారమధ్యమందు మిత్రసహాయమువల్ల కొన్ని కార్యములు వింతగా అనుకూలిస్తాయి. మీరు ఆశించిన ఆర్థికసహాయము సకాలమునకు రాక అసంతృప్తిని చెందుతారు. ఉద్యోగులకు మొదట్లో వత్తిడి కలిగినను క్రమేపీ అధికారులు మీ విలువను గుర్తించి ఆదరిస్తారు. వర్తకులకు 19 నుంచి కొంత లాభసాటిగా వుంటుంది. విద్యార్థులకు బద్ధకము ఎక్కువై, చదువుపైకన్న వినోదములవైపు ఎక్కువ శ్రద్ధ చూపుతారు. ఆరోగ్యము భంగమయే సూచనలున్నాయి. 21,22 తేదిలు ఖర్చులు ఎక్కువ; కలతలు; అశాంతి.

శతభిషం [గో, సా, సీ, సూ]

గతవారములో ప్రారంభమైన అశాంతి ఈ వారమునకూడా మిమ్ములను వెన్నాడును. యత్నకార్యములు సకాలములో నెరవేరవు. ఆశించిన బంధుసహాయము వెనుకపడుతుంది. అయినను మీరు ప్రజ్ఞావంతులగుటచేత ధైర్యముతో పుణ్యకార్యభారమును వహించి నిర్వహింపపూనుకుంటారు. పెద్దల సాంగత్య సలహాలననుసరించి నడుచుకుంటే మేలు కలుగుతుందనే బుద్ధిబలము మిమ్ములను నడుపుతుంది. దానివల్ల 19 తేదినుంచి మీకు కొత్తవికాసము కలుగుతుంది. ఉద్యోగులకు కొంత ప్రయాసతో గడుస్తుంది. గృహమందుండువారి కోర్కెలు తీర్చలేకపోవుటచేత 21,22 తేదీలలో అశాంతిగా వుంటుంది. ఖర్చులు ఎక్కువ.

పూర్వాభాద్ర [సే, సో, దా, ది]

ఈ వారము మీకు ప్రతికూలవాతావరణం ఎక్కువ. ఇచ్చిపుచ్చుకునే విషయాలపట్ల నీచులతో వివాదమువచ్చి మనోవ్యధ కలుగును. ప్రయత్నించిన కార్యములు నెరవేరవు. ఆర్థికమాంద్యము కలుగుతుంది. కావలసిన కోరికలు నెరవేరకపోవుటచేతను గృహకలతలు కలుగుతవి. విద్యార్థులకు చదువుపైని శ్రద్ధ తగ్గుతుంది. వినోదములలో కాలము గడుపుదామనుకున్నా సాగక కించపడతారు. ఉద్యోగులకు ఒత్తిడి ఎక్కువ. కిందివారి సహాయమువల్ల 19 తేదీనుండి కొంత స్థిమితము వుంటుంది. 21, 22 తేదీలలో ఇబ్బంది, అశాంతి ఎక్కువ. ఆరోగ్యము చెడే సూచనలున్నవి.

* ఉత్తరాభాద్ర [దూ, శం, ఝా, థా] *

ఈ వారమున ఎక్కువ శ్రమకలిగే పనులు చేసేందుకు సాహసించి ఫలము పొందక నిరాశచెందుతారు. సోదరవర్గమునుండి ఆశించిన సహాయము ఆలస్యముగా లభించుటచేత మొదట్లో కొంత ఖేదమును పొంది, 19 తేదీన లభించుటచే వూరట చెందుతారు. అయినప్పటికీ అది మీ అవసరాలు తీర్చలేకపోవుటచేత మిమ్ముల ననుసరించియుండువారి కోరికలు తీర్చలేకపోతారు. చురుకుమాటలచేత మీ మనస్సు గాయపడుతుంది. ఉద్యోగులకు మనోవ్యధ. 20 తేదీని పరిస్థితులలో కొంత మార్పు. 21, 22 తేదీలలో ఖర్చులు ఎక్కువ, వ్యధ కలుగుతుంది.

రేవతి [దే, దో, చా, చీ]

గత కొద్దికాలమునుండి మిమ్ములను ఎదుర్కొంటూ త్రిప్పట, శ్రమ కలిగించిన ప్రతికూల సంఘటనలు సర్దుకొని, ఈ వారమందు మీ ప్రయత్నములు ఫలిస్తాయి. శుభోదయమవుతుంది. మిత్రులవల్ల సకాలములో సహాయము లభించుతుంది. ఇంట్లో వున్నవారి ఆరోగ్యం చక్కబడుతుంది. ఒడిదుడుకులు సర్దుకుంటాయి. పెద్దల సాంగత్యంవల్ల మానసోల్లాసము కలుగుతుంది. విద్యార్థులు వైజ్ఞానికవిషయాలను తెలుసుకుంటారు. వినోదముతో గడుపుతారు. ఒక ముఖ్యమైన ప్రయాణము చెయ్యవలసివస్తుంది. కోర్టువ్యవహారాలు పరిష్కారానికి వస్తాయి. ఉద్యోగులకు అధికారులదయ కలుగుతుంది. వ్యాపారస్తులకు లాభదాయకముగా యుంటుంది. 19 తేదీని నూతన చైతన్యము కలుగుతుంది. 21, 22 తేదీలు నూతన వస్త్రాలంకారములతోనూ, పిండివంటలతో కూడిన భోజనములోనూ వినోదముగా మీరు, మిమ్ముల ననుసరించినవారు గడుపుతారు. కవులకు, కళాకారులకు యోగకాలము. ★

సినిమా

★ పూజా నమస్కారాలు లేక - ★

మన చలనచిత్రాలలో సంగీతం మంచి దారి పట్టిందని, ఇప్పుడు స్థాయి దిన దినాభివృద్ధి నొందుతోందని గట్టిగా చెప్పవచ్చు. ఇటీవలి కొన్ని చిత్రాలలో పాటలు వింటూ ఉంటే, శాస్త్రీయ సంగీతపు శీవితో, నిండు తనంతో, జానపద సంగీత పరిమళాలతో ఒప్పుతున్న వరసలు మననం చేసుకుంటూ ఉంటే, ఈనాటి ప్రముఖ సంగీతదర్శకులు పలువురు, పూజా నమస్కారాలులేని దేవతల సామెతకు దగ్గర్లో ఉంటూ వచ్చారనిపిస్తుంది. పేరుకు సంగీత దర్శకులైనా, చాలకాలం స్వాతంత్ర్యం లేకుండా వారు పనిచేయవలసి వచ్చింది. సలక్షణమైన రాగం రూపు ధరించి, "నేను ఫలానా" అని చెప్పకుని, పలకరించినా తెలుసుకోలేని వాళ్లంతా నిర్మాతల, పెట్టుబడిదారుల హోదాలలో, అధికారాలు చెలాయించి సంగీత దర్శకులను షరతులతో బంధించి పని చేయించారు.

వరపడైన తరువాత తన 'ఒకనాటి లక్ష్యం' సాధించడానికి పూనుకొన్నాడు. "నయా దౌర్" చిత్రంలో సర్వజనాదరణకు పాత్రమైన సంగీతం ఇందుకొక నిదర్శనం. పాశ్చాత్య అనుకరణలు లేకుండా, శాస్త్రీయ సంగీతాన్ని సద్వినియోగం చేసుకుని లలితమూ మనోహరము, అయిన సంగీతం కూర్చాడు. జానపద సంగీతాన్ని ఉపయోగించుకుని తియ్యని పాటలు కట్టాడు. ఇప్పుడు 'ఫగుణ్' అనే చిత్రంలో సంగీతం అంతా 'పీలు' రాగంలోనే అల్లదలుచుకొన్నట్లు స్పష్టం చేశాడు. అందులో మధురాతిమధురమైన గానాన్ని వినగలమనడానికి సందేహంలేదు.

అలాగే "మిస్ ఇండియా" చిత్రంలోనూ, గురుదత్ "ప్యాసా"లోనూ, శచిన్ దేవ్ బర్మన్, ఇటీవలి "హిల్ స్టేషన్"లో హేమంతకుమార్, వినిపించిన సంగీతం మన స్థాయి పెరుగుతున్నదనడానికి మరొక నిదర్శనం.

ఇవన్నీ ఒక ఎత్తు. గత సంవత్సరం ఉత్తమ భారతీయ చిత్రంగా ఎన్నికై అయి రాష్ట్రపతి సువర్ణ పతకం అందుకున్న "కాబూలీవాలా" చిత్రానికి సితార్ విద్వాంసుడు పండిత రవిశంకర్ కూర్చిన సంగీతం ఒక ఎత్తు-బెర్లిన్ అంతర్జాతీయ చలనచిత్రోత్సవంలో దేశదేశాలవారిని రంజింపచేసి ప్రశంసలూ ప్రత్యేక బహుమతీ సంపాదించి పెట్టినది ఈ చిత్రంలో సంగీతమే. 'పథేర్ పాంచాలీ' చిత్రంలో 'పథదేవత' విశ్వగీతిని వేణునాదంలో వినిపించినవాడు ఈయనే. 1947

బొంబాయి సినిమాలేఖ

ఇపుడిపుడు వీరికి స్వేచ్ఛ లభిస్తోంది. ఇపుడిపుడే వారు తమ మహిమను, ప్రతిభను చూపిస్తున్నారు.

'ఓ. పి. నయ్యార్ కాపీరాయుడని' చాలామంది అన్నారు. అతనూ అన్నాడు. అయితే, నయ్యార్ బొంబాయిలో కాలుపెట్టి నిలబడడానికి ప్రయత్నాలు చేసిన రోజులలో అతడు ఎదుర్కొన్న సమస్యలను, సంగీత దర్శకుడుగా నలుగురిచేత ఔననిపించుకోవడానికి అతడు శిరసావహించిన షరత్తులను, అప్పటి కథను విన్నవారు, ఆ మాటను మనసారా అనరు. నయ్యార్‌కు శాస్త్రీయ సంగీతంపట్ల అపారమైన గౌరవం ఉంది. గుర్తి ఉంది. అందులో కృషిచేసి ప్రతిభ గడించాడు. ఒకప్పుడు అతడు శాస్త్రీయ బాణీలో ఒక పాట కట్టాడు. దాన్ని సి. హెచ్. ఆత్మ పాడాడు. ఆ పాటను అప్పుడు వాళ్ళు పదిహేను రూపాయలకు అమ్మకుని చెరి ఏడున్నర పంచుకున్నారు...

'అవకాశం దొరికితే నా తడాఖా చూపిస్తాను' అనేవాడు నయ్యార్ అప్పట్లో. ఇటీవల అతను చాలా పెద్దవాడై, అతని మాట



గోయెల్ సినీ ప్రొడక్షన్స్ చిత్రం 'ఏక్ సాల్'లో మధుబాల



సితార్ విద్వాంసుడు రవిశంకర్.

పూజా నమస్కారాలు లేక—

కాన్స్ ఉత్సవంలో ఉత్తమ బహుమతి సంపాదించిన 'నీచానగర్'కూ 1957 లో వెనిస్‌లో సువర్ణబహుమతి నందుకొన్న 'అపరాజిత'కూ రవిశంకర్ సంగీత దర్శకుడు.

మన చిత్రాలలో ఉత్తమస్థాయి సంగీతం వినిపించే మరొక వ్యక్తి వసంత్ (ఝనక్ ఝనక్ పాయల్ బాజే) దేశాయ్.

భారతీయ జీవితాన్ని చిత్రిస్తూ, బర్మాషెల్ వారు ఇటీవల నిర్మించిన రెండు చిన్న చిత్రాలు "మలబార్ నృత్యాలు" 'తెలుగునాటి కుటుంబం'—చూడడం జరిగింది. వాటిలో వసంత్ దేశాయ్, అత్యంతా అపూర్వమనిపించినంతటి గొప్ప సంగీతాన్ని, చిరకాలం మనసులో మెదలుతూ ఉండే మనోహరమైన స్వరతరంగాలను వినిపించారు.

ఇతర దేశాల ప్రజలకు మనపట్ల, మన చిత్రాలపట్ల ఆసక్తి కలిగించి, ఆకట్టి నిలబెట్ట గలది ఇటువంటివారు వినిపించే సంగీతమే...

దీనికి స్వేచ్ఛ కావాలన్న సంగతి మరువ రాదు.



సంగీత దర్శకుడు ఎస్. డి. (శచిన్ దేవ) బర్మన్.

★ వార్తలు ★

'కాలాపానీ'లో మధుబాల

నవకేతన్‌వారి కొత్త చిత్రం 'కాలాపానీ'లో నాయిక భూమికను మధుబాలకు ఒప్పగించారు. ఇంతకు ముందు వహీదా రెహమాన్‌కు ఇవ్వ నిశ్చయించడం విదితమే.

ఇందులో నాయకుడు దేవానంద్, రాజ్ ఖోస్లా దర్శకత్వాన ఫిలింస్థాన్‌లో ఈ చిత్రం చురుకుగా తయారవుతోంది.

'సేవిక'

దీపశిఖచిత్ర నికేతన్ అనే కొత్త సంస్థ తొలిచిత్రం 'సేవిక'కు మొన్న విజయదశమి నాడు మోహన్ స్టుడియోలో ప్రారంభోత్సవం జరిగింది. నిమ్మీ ఇందులో ముఖ్యనటి. రాజేంద్రకుమార్, జానీవాకర్, రాజ్ మెహ్రా ఇతర భూమికలు నిర్వహిస్తారు. దర్శకుడు మెహ్రిష్. సంగీతదర్శకుడు మదన్‌మోహన్.

మహారాణాప్రతాప్

'మహారాణా ప్రతాప్' చిత్రంతో సంపోటీ జరిగేటట్టు కనబడుతోంది. ఎస్. కె. మాలిక్ రెండువారాలనాడు ప్రదీప్‌కుమార్, బీనా రాయ్‌లతో నిర్మాణం ఆరంభించి మూడు రీళ్ళవరకూ 'షూట్' చేయడం జరిగింది ఇందులో ప్రతాపసింహుడి భూమికను ప్రఫూ ధరిస్తున్నాడు. కె. ఎన్. సింగ్, కుమ్మీ, తివారీ, ఎం. రాజన్, భగవాన్‌లు పాల్గొంటున్నారు. దర్శకుడు హార్బన్స్. సంగీతం జమాల్ సెన్.

రజనీచిత్ర అనే మరో కంపెనీ నిరూపరాయ్, జైరాజ్ లు నాయికానాయకులుగా బిపిన్‌గుప్త, శాంతాఆప్టే, రామసింగ్, ఎస్. ఎన్. త్రిపాఠీలతో ఇదే కథను తెర కెక్కించ తలపెట్టారు. దానికి దర్శకులు జస్వంత్ ఝవేరీ. సంగీత దర్శకుడు ఎస్. ఎన్. త్రిపాఠీ.

విభీషణుడి కథ

రజనిచిత్రవారి తాజాచిత్రం 'శ్రీ రామభక్త విభీషణ్' నిర్మాణం పూర్తి అయింది. ఇందులో నిరూపరాయ్, సాహూమోదక్, ప్రేమ్‌అదీబ్, శాంతాఆప్టే, బిపిన్‌గుప్త, కృష్ణకుమారి నటించారు. దర్శకుడు ఎస్. చటర్జీ.

జోహార్ చిత్రం

మోడర్న్ థియేటర్స్ వారు ఐ. ఎస్.

యన్. ఏ. టి వారి 'పాండురంగ మాహాత్మ్యం'లో పద్మనాభం, అంజలీదేవి, ఋష్యేంద్రమణి.



జోహార్ దర్శకత్వాన నిర్మించిన గేవాకలర్ చిత్రం "కిత్నా బదల్ గయా ఇన్‌సాన్" మొన్న బొంబాయిలో విడుదల అయింది. ఏడుగురు అన్నదమ్ములు వేటకెళ్ళి పెళ్ళి చేసుకు వచ్చిన అమెరికన్ కథ ఒకటి దీనికి మాతృక. ఇందులో నళినీజయవంత్, అజిత్, జోహార్ నటించారు. సంగీత దర్శకుడు హేమంతకుమార్.

'జీవితం — తుఫాను'

సెరాఫిన్ పిక్చర్స్‌వారు 'జిందగీ, యా తూఫాన్' అనే చిత్రం నిర్మిస్తున్నారు. ఇందులో నూతన్ ప్రదీప్ కుమార్, జానీ వాకర్, యాకూబ్, ఓంప్రకాష్, మినూ ముంతాజ్ నటిస్తున్నారు. దర్శకుడు నఖ్షబ్. సంగీతం నాషాద్.

కాళిదాసు కథ

భక్తుల, కవుల, గాయకుల పాత్రలు ధరించే భరత్ భూషణ్ ఇటీవల, మహాకవి కాళిదాసు భూమికను స్వీకరించాడు. సింధుఫిలింస్ వారు నిర్మించే ఈ చిత్రం 'కవి కాళిదాస్'కు విజయదశమి నాడు రంజిత్ స్టుడియోలో ప్రారంభోత్సవం జరిగింది. నిరూపరాయ్, అనితాగుహా, సప్రూ, నిరంజన్‌శర్మ, రత్నమాల మాస్టర్ రోమి, బేబీనాజ్ పాల్గొంటారు. సంగీత దర్శకుడు ఎస్. ఎన్. త్రిపాఠీ దీనికి దర్శకత్వంకూడా నిర్వహిస్తారు. భరత్ వ్యాస్ పాటలు వ్రాస్తారు.

నేరము - శిక్షా

పారిజాత పిక్చర్స్ అనే కంపెనీ 'ఫిర్ సుబాహోగీ' అనే చిత్రం నిర్మిస్తున్నది. దీనికి దిలీప్‌కుమార్ ప్రారంభోత్సవం జరిపారు.

రాజ్‌కపూర్ మాలాసిన్హా ఇందులో నటిస్తారు. పాటలు సాహిర్ లూధియాన్వీ. దర్శకుడు రమేష్ సైగల్. సంగీత దర్శకుడు ఖయ్యాం.

దీనికి మాతృక, డాస్టోవ్‌స్కీ నవల 'క్రైం అండ్ పనిష్‌మెంట్' అని నిర్మాతలు చెబుతున్నారు! పైగా మొన్ననే ఒక 'కామెడీ సాంగ్' రికార్డు చేశారట.

భాబీ

తమిళంలో ప్రజాదరణ పొందిన 'కులదైవం'ను ఏ. వి. ఎం. వారు హిందీలో పునర్నిర్మిస్తున్నారు. పంఢరీబాయ్, బాలరాజ్ సాహ్నీ, శ్యామా, కుమారినంద, దుర్గా ఖోటే, అన్వర్ హుసైన్ ఇందులో

(54-వ పేజీ చూడండి)



డోసీ ఫిలింస్‌వారి 'చందన్' చిత్రంలో శ్యామ.

★ సినిమా వార్తలు ★

గజదొంగ

రోహిణీ పిక్చర్స్ వారు తెలుగు తమిళ భాషలలో "గజదొంగ" చిత్రం నిర్మిస్తున్నారు. ఎన్. టి. రామారావు, సావిత్రి, గుమ్మడి, ఆర్. నాగేశ్వరరావు, రాజనాల, రమణారెడ్డి, సంధ్య, ముత్తులక్ష్మి ప్రభృతులు పాల్గొంటున్నారు.

రచన ఆరుద్ర. సంగీత దర్శకుడు చలపతిరావు. ఛాయాగ్రహణం వర్మ. దర్శకత్వం వై. ఆర్. స్వామి నిర్వహిస్తున్నారు. ఈ చిత్రం సగం పైచిలుకు పూర్తి అయింది. ★

రామాంజనేయ యుద్ధం

కాశీనాథ్ ప్రొడక్షన్స్ వారి పౌరాణిక చిత్రం "రామాంజనేయ యుద్ధం" సగానికి పైగా పూర్తి అయింది. ఇందులో శ్రీరాముడు అమర్‌నాథ్, ఆంజనేయుడు జంధ్యాల గౌరీనాథశాస్త్రి. సీత శ్రీరంజని. ఋగల (మల్లీశ్వరి) వెంకటేశ్వర్లు, కె. వి. యస్. శర్మ, ముక్కామల కృష్ణమూర్తి ప్రభృతులు ఇతర భూమికలు నిర్వహిస్తున్నారు. సంగీతం పెండ్యాల. దర్శకుడు ఎస్. ఎస్. అచార్య. ఛాయాగ్రహణం పి. ఎల్. రాయ్.

బండరాముడు

సాహిణీవారు తెలుగు తమిళ భాషలలో నిర్మిస్తున్న చిత్రం "బండరాముడు" మూడు రీళ్లు పూర్తి అయింది. పి. పుల్లయ్య దర్శకత్వాన తయారవుతున్న ఈ చిత్రంలో ఎన్. టి. రామారావు, సావిత్రి, నాగయ్య నటిస్తున్నారు.



దీప్ అండ్ ప్రదీప్ వారి "పోలీస్" చిత్రంలో నాదిరా.

జయభేరి

పుల్లయ్యగారి దర్శకత్వాన తయారవుతున్న మరో చిత్రం శారదా ప్రొడక్షన్స వారి "జయభేరి" అంజలీదేవి, నాగేశ్వరరావు, నాగయ్య నటిస్తున్నారు. పాటలు మల్లాది, మాటలు ఆత్రేయ వ్రాస్తున్నారు. సంగీతం ఘంటసాల. ఈ చిత్రం దాదాపు సగం తయారైంది.


'గంగాగౌరి సంవాదం'

విజయగోపాల్ ప్రొడక్షన్స్‌వారి "గంగాగౌరి సంవాదం" వి. ఎస్. రెడ్డి దర్శకత్వాన హుషారుగా తయారవుతోంది. నిర్మాణం చాలవరకు పూర్తిఅయింది. జానకి, కృష్ణకుమారి, ఋష్యేంద్రమణి, పి. హేమలత, కాంతారావు, సి. హెచ్. నారాయణరావు నటిస్తున్నారు. స్క్రీన్‌ప్లే మహతి. రచన పరశురాం, సంగీతదర్శకుడు పెండ్యాల నాగేశ్వరరావు. నృత్యాలు వెంపటి సత్యం. నిర్మాతలు చంద్రశేఖరరెడ్డి, ముంగమూరు బ్రదర్స్.

పియామిలన్

సంగీత దర్శకుడు రమేష్ (స్వయంప్రభ) నాయుడు, "వేగుచుక్క" చిత్రాన్ని ఆర్. ఆర్. ప్రొడక్షన్స పేరిట హిందీలోకి డబ్ చేస్తున్నారు. ఇదికాక ఆయన స్వయంగా ఒక చిత్రం నిర్మించడానికి సన్నాహాలుచేస్తున్నారు. "మర్మవీరన్" అనే తమిళ చిత్రానికి 'వేగుచుక్క' తెలుగు తర్జుమా, ఉభయప్రాంతాలలోనూ ఇది ఆదరణ పొందింది. వైజయంతిమాల, హెలెన్, రాజసులోచన, నాగయ్య, శ్రీరాం, బాలయ్య, తంగవేలు, చంద్రబాబు మొదలగువారు పాల్గొన్నారు. జెమినీ, శివాజీగణేశన్‌లు, నాగేశ్వరరావు, రామారావు, రంగారావు మొదలగువారంతా 'అతిథులు'గా హాజరు అయ్యారు.

ఈచిత్రానికి పాటలూ, నేపథ్యసంగీతం కూడా తిరిగి కొత్తగా తానే సమకూర్చదలిచినట్లు నిర్మాత రమేష్‌నాయుడు చెప్పారు. ఈయన సంగీత దర్శకత్వం వహిస్తున్న చిత్రాలు మరి మూడున్నాయి. సెల్వకోటి వారి 'రత్నకిరీటం', విశ్వరూపావారి తొలి



విఠల్ ప్రొడక్షన్స్‌వారి 'వద్దంటే పెళ్ళి' చిత్రంలో కృష్ణకుమారి, చలం.

చిత్రసమీక్ష:

దో ఆంఖే(బారా హాత్

సెప్టెంబరు నెల ఆఖరువారంలో విడుదల అయిన శాంతారాం కొత్తచిత్రం "దో ఆంఖే(బారాహాత్" (రెండు కళ్లూ, పన్నెండు చేతులూ) ఇటీవలి చిత్రాలన్నిటి కన్నా అన్నివిధాలా గొప్పగావున్నది. కొత్త తరహాకథ, ఉత్తమమైన సంగీతం, సమర్థుడి దర్శకత్వం, చెప్పుకోతగ్గ నటన, ఎన్నికచేయ తగ్గ ప్రయోజనం ఈ చిత్రంలో గోచరిస్తాయి.

ఒకసారి తప్పుచేసి దండనపొందిన మనుషులమీద దొంగలు అన్న ముద్రవేసి శాశ్వతంగా వెలివేయకుండా, వాళ్లని మనుషులుగా గౌరవించి ఆదరిస్తే వాళ్ళుతప్పకుండా మనసులు మార్చుకుని సవ్యమైన పద్ధతులలో జీవితం కొనసాగించగలరని, అలాచేయడం అవసరమని ఈచిత్రం ప్రబోధిస్తుంది. ఈసూత్రాన్ని నమ్మిన ఒక జైలర్, దీన్ని ఆచరణలో పెట్టి, యథాశక్తి మానవసేవ చేయాలని సంకల్పించి అందుకై ఆరుగురు ఖైదీలను వేరు కుంటాడు. వాళ్ళను సంస్కరించి, తిరిగి సమాజంలో తోటిమానవులమధ్య సాటిసభ్యులుగా బ్రతికే సదుపాయాలు చేయడానికి పూనుకుంటాడు. ఒక వ్యవసాయక్షేత్రంలో వారితో కలిసి మకాంపెడతాడు. కటకటాల బెడదలేకుండా, తాము దుష్టులన్న భావం ఆ ఖైదీలకు కలగకుండావారినిదయతోసాకుతూ, కష్టించి పనిచేయమని చెబుతాడు. తమను నమ్మి ఖైదు బెడద తొలగించిన ఈ జైలు అధికారిమీద గౌరవం ఉంచి వాళ్లు బుద్ధిగా ప్రవర్తిస్తూ ఉంటారు. క్రమంగా తమ ఊహాపోహలు, నడవడిక మార్చుకుని బాగు పడతారు. కూరగాయలు కాపించి అమ్ముకుంటూ మర్యాదస్థులుగా రోజులు గడుపుతారు. ఆ స్థితిలో, వాళ్లకి ఆనందంగా కాలక్షేపం కావడానికి, బొమ్మలు అమ్ముకునే ఒక బొమ్మ రోజూ అటువేపు వచ్చి ఆటపాటలతో కబుర్లతో నవ్వించివెళ్తూ వుంటుంది. 'ఖైదీలు', కూరగాయలను మిగతావారికన్న కొంత చవగ్గా అమ్మబోవడంతో ఊళ్లో కొందరికి ఒళ్లుమంటుతుంది. వాళ్ల ఆనందం చూసి కన్నుకుడుతుంది. అందుకని ఒకరోజున జైలర్ లేనపుడు ఈ ఆరుగురికీ పూటుగా సారాయి పట్టించి వదలిపెడతారు. ఆ మైకంలో ఖైదీలలో పశుప్రకృతి ప్రకోపించి, పాటలు పాడ వచ్చిన అమ్మాయిని బలాత్కరించి చెరచ వబోతారు. సకాలంలోనే జైలర్ అక్కడికిచ్చి వాళ్లని మందలించి అదుపులో పెడతాడు.

ఆనక వాళ్ళు పశ్చాత్తాపపడి ఇటుపై అకార్యాలు ఎన్నడూ తలపెట్టబోమని ప్రతిజ్ఞచేస్తారు. ఈ పతాక సన్నివేశాన్ని శాంతారాం ఉజ్వలం అనతగ్గరీతిన కట్టుకు వచ్చారు. అప్పటి హడావుడిలో, అక్కడి పసువులశాలకు ఎవరో నిప్పంటిస్తారు. అందులోని పసువులు కట్లుతెంచుకు చెలరేగు



అశోకావారి 'భూలోక రంభ' చిత్రంలో

షోలా జిత్తుల.

చిత్రం, చేతనా ఫిలింస్ వారి 'గుళ్లో పెళ్లి'.

'గుళ్లో పెళ్లి'

చేతనాఫిలింస్ పేరిట గిరిబాబు నిర్మిస్తున్న ఈచిత్రానికి కె. ఎస్. ప్రకాశరావు దర్శకత్వం నిర్వహిస్తున్నారు. రచయిత అనిసెట్టి. జానకి, సూర్యకళ, రమణారెడ్డి, చదలవాడ మొదలగువారు నటిస్తున్నారు. ఆరురీళ్ళు పూర్తిఅయింది.

రత్నకిరీటం

యోగానంద్ దర్శకత్వాన సెల్వకోటి పిక్చర్స్‌వారి 'రత్నకిరీటం' రెండుభాషలలో తయారవుతోంది. రెండింటిలోనూ సావిత్రి, గణేశన్‌లు ముఖ్యపాత్రలు నిర్వహిస్తున్నారు. ఆర్. నాగేశ్వరరావు, ముక్కామల, నాగయ్య, కన్నాంబ ప్రభృతులు పాల్గొంటున్నారు.

రాజనందిని

వేదాంతం (సువర్ణసుందరి) రాఘవయ్య దర్శకత్వాన తయారవుతున్న జలరుహావారి "రాజనందిని"సగం పూర్తికావచ్చింది. అంజలీదేవి, రామారావు నాయికానాయకులు. రచయిత మల్లాది రామకృష్ణశాస్త్రి. స్టుడియో...వీనస్.

దీపావళికి...

మినర్వా పిక్చర్స్‌వారి 'సారంధర' దీపావళి కానుక. భానుమతి, రామారావు, రంగారావు, రేలంగి, ముక్కామల, గుమ్మడి, ప్రభృతులంతా పాల్గొన్నారు. రచయిత సముద్రాల రాఘవాచార్య, దర్శకుడు శ్రీనివాసరాఘవన్, సహాయదర్శకుడు కురుమద్దాలి రామచంద్రరావు.

'భూకైలాస్'

ఎ. వి. ఎం. వారి 'భూకైలాస్' కూడా దీపావళికానుకే. నాగేశ్వరరావు, రామారావు, జమున, బి. సరోజ పాల్గొన్నారు. ఈ చిత్రానికి శంకర్ దర్శకుడు.

* * *

విదారురంగులలో, ఏడెనిమిది భాషలలో ఎం. హెచ్. ఎం. (ప్రపంచం) మూనాస్ నిర్మించిన 'దేవసుందరి' తెలుగుప్రతి త్వరలోనే విడుదల కాగలదని తెలుస్తోంది. జానకి, కాంతారావు, శివరావు ఇందులో నటించారు

వద్దంటే పెళ్లి

విరల్ ప్రొడక్షన్సు వారి 'వద్దంటే పెళ్లి' ఈ నెలాఖరు ప్రాంతాలలో విడుదల అవుతుంది. చలం, కృష్ణకుమారి, శ్రీరంజని, రమణారెడ్డి, సి. ఎస్. ఆర్, అమర్‌నాథ్. నటించారు. రచన రామచంద్, జి. కె. మూర్తి. దర్శకుడు విరలాచార్య.

కుటుంబ గౌరవం

త్వరలో విడుదల కానున్న మరోచిత్రం విక్రం ప్రొడక్షన్స్‌వారి 'కుటుంబ గౌరవం.' రామారావు, సావిత్రి, కన్నాంబ, ఇ. వి. సరోజ, రాజనాల, బాలకృష్ణ, పద్మనాభం, వంగర, దొరస్వామి, బేబీ ఉమ నటిస్తున్నారు. దర్శకుడు బి. ఎస్. రంగా.

రచన అనిసెట్టి. సంగీత దర్శకులు విశ్వనాథం, రామమూర్తి.

★

దో ఆంఖే బారా హాత్

శాయి. కన్నబిడ్డలా కనిపెట్టుకుంటూ వచ్చిన ఆ ఖైదీలకు ప్రమాదం జరుగుతుందని భయపడి జైలు అధికారి రంగంలోకి ఉరికి ఒక ఎద్దుతో పోట్లాడి తీవ్రంగా గాయపడి మరణిస్తాడు.

బలం గల ఈ కథను, దర్శకనిర్మాత శాంతారాం తెరమీద అతి కట్టుదిట్టంగా చిత్రించారు.

కథన శిల్పం విశిష్టంగా వుంది. ఛాయాగ్రహణం, దర్శకుడి కృషి ఫలించడానికి ఎంతో ఉపకరించింది. ముఖ్యంగా ఉత్తరార్థంలో కథాచిత్రణ, ఉత్తమశ్రేణి హాలీవుడ్ చిత్రాల స్థాయిలో సాగింది. ఒక్క ముక్కలో చెప్పాలంటే, చలనచిత్ర శిల్పానికి ఈ చిత్రం వాచకపుస్తకం వంటిది.

60వ పడిలో పడిన శాంతారాం ఇందులో వేషంకూడా వేసి జైలర్ భూమికను నిర్వహించారు. వేషంమీద చూస్తే శాంతారాం విగ్రహసౌష్టవం, ఈనాటి ఏ నాయక నటుడికీ తీసిపోదనిపిస్తుంది. అయితే సంభాషణలు చెప్పడంలోమటుకు కొంత తొట్రుపాటు కనబడుతుంది. యువకుడి ధాటీ లేదు. నటనకూడా కొంచెం బెట్టుగావుంది. అయితే దీనివల్ల చిత్రానికి లోపం లేదు.

బొమ్మలు అమ్ముకునే భామగా, సంధ్య అమోఘమైన నటన ప్రదర్శించింది. ఖైదీలుగా ఉల్హాస్, బి. ఎం. వ్యాస్ ప్రభృతులు నటించారు. వాళ్ళ నటన మటుకు 'అతి' అనిపించేవిధాన సాగింది. నిష్కారణంగా గర్జించినట్లు అరవడం, అవక రొప్పుతూండడం ఏ విధానా రాణించలేదు.

వసంత్ దేశాయ్ సంగీతం నిజమయిన విందులా వుంది. పాటలకన్నా నేపథ్య వాద్య సంగీతం మరింత బాగుంది. అపూర్వమైన రీతిన ఆయన సంగీతం సమకూర్చారు.

మొత్తంమీద ఈ చిత్రం శాంతారాం వ్యక్తిగతంగా సాధించిన విజయం. ఆయన ప్రతిభకు నిదర్శనం. ★

(ఆంధ్రపత్రిక బొంబాయి విలేఖరి)

భారతీయ చిత్రాలు: బ్రిటన్ ప్రశంసలు

లండన్‌లోని స్కాలాథియేటర్‌లో గత వారం భారతీయ చలనచిత్రోత్సవం జరిగింది.

తొలి రోజున ప్రదర్శించిన గురుదత్ చిత్రం 'ప్యాసా'ను లండన్ పత్రికలన్నీ వేనోళ్ల కొనియాడాయి. 'ప్యాసా' చిత్రంలో అరగంటసేపు జరిగిన కథ ఆరు హాలీవుడ్ చిత్రాలకు సరిపడే సరుకు అవుతుంది" అని 'రేనాల్డ్స్ న్యూస్' అనే పత్రిక విమర్శకుడు వ్రాశాడు. 'సండే టైమ్స్' విమర్శకురాలు, సమాజంపై 'ప్యాసా' చిత్రం చేసిన వ్యాఖ్యానం సాహసోపేతమైనదని మెచ్చుకొంది.

మెహబూబ్ చిత్రం 'మదరిండియా' లండన్ ఫిలిం పారిశ్రామికులను బాగా ఆకర్షించింది. ఆ చిత్రాన్ని బ్రిటన్‌లోనూ, ఇతర యూరోపియన్ దేశాలలోనూ విడుదల చేయడానికి అక్కడివారు దర్శకనిర్మాత మెహబూబ్‌ఖాన్‌తో సంప్రతింపులు జరుపుతున్నారు.

ఈ చిత్రంలో "ఛాయాగ్రహణం మనోహరంగా" ఉన్నదనీ, అనేక సన్నివేశాలలో "కాంపోజిషన్" అద్భుతంగా, ఉన్నదనీ, లండన్‌లోని 'టెక్నికలర్' అనే సంస్థకు చెందిన జార్జి గన్ ప్రశంసించాడు. 'మదర్ ఇండియా' ఛాయాగ్రహణ దర్శకుడు ఫరెదూన్ ఇరానీని అభినందిస్తూ కేబుల్ ద్వారా ఆయన పంపిన సందేశంలో తాను చూచిన చిత్రాలన్నిటిలోనూ ఇది ఉత్తమంగా ఉన్నదనీ, దీన్ని ఎక్కడ ప్రదర్శించినా ఘనవిజయం సాధించగలదని నమ్ముతున్నాననీ ఆయన పేర్కొన్నారు. ★

వార్తలు (51- పేజీ తరువాయి)

పాల్గొంటున్నారు. దర్శకుడు కృష్ణన్‌పంజు. సంగీతం: చంద్రగుప్త.

ఆర్. కె. ఫిలింస్ వారి కొత్తచిత్రం 'అబ్ దిల్లీ దూర్ నహీ' త్వరలోనే విడుదల కాబోతూంది. సులోచన, యాకూబ్, జగ్‌దీప్, నంద్‌కిషోర్, మాస్టర్ రోమి, అన్వర్ హుసేన్ పాల్గొన్న ఈ చిత్రానికి అమర్‌కుమార్ దర్శకుడు. సంగీతం దత్తారాం.

ప్రసాద్ ప్రొడక్షన్స్‌వారి హిందీ చిత్రం 'శారద' నిర్మాణం పూర్తిఅయినట్లే. ఒకటి రెండు నృత్యాలు తరువాయి. ఈ చిత్రాన్ని నవంబరులో విడుదలచేస్తారు. రాజ్ కపూర్, మీనాకుమారి, అగా నటించిన ఈ చిత్రానికి దర్శకుడు ఎల్. వి. ప్రసాద్. ఇది పూర్తికాగానే, ప్రసాద్ తమ తరువాతి చిత్రాన్ని మద్రాసులో నిర్మిస్తారు. లోగడ "కొడుకులూ కోడళ్ళు" అని వ్యవహరిస్తూ వచ్చిన కథకే ఇపుడు పేరుమార్చడం జరుగవచ్చునని తెలిసింది. ★

మత్కుణాభి రామాయణం

(5-వ పేజీ తరువాయి)

నల్లులు. మా మామయ్య ఎప్పుడైనా మా యింటికి వచ్చినప్పుడు ఖర్మకొద్దీ ఏ నల్లిఅయినా కంటపడితే చాలు, "నేయి బోయగగ్గున దరికొన్న భీషణ హుతాశన కీలయనంగ లేచి", దాన్ని ఏ ఆయుధంతోనైనా చంపే వరకూ నిద్రపోడు. ఈయనకు నల్లులంటే ఇంత కసి ఏమిటా అని వాకబుచేస్తే, అధికార రీత్యా తెలియవచ్చిం దిది :

ఓ రోజున మామయ్య వాళ్లో ఆఫీసరుకు లీవులెటరు రాస్తూ, అందులో—తన మామగారికి తీవ్రంగా టైఫాయిడ్ కాస్తోందని, వెళ్ళి చూసి రావటానికి ఓ వారంరోజులు సెలవు గ్రాంటు చేయమనీ కోరాడట. అలా రాసుకున్నవాడు దాన్ని ముందు పంపించెయ్యక అట్టేపెట్టి, పుట్టింట్లో ఉన్న భార్యకు జాబు రాయనారంభించాడట. అందులో తను ఆఫీసరుకు మస్కాకొట్టి, అబద్ధాలాడి వారంరోజులు సెలవు ఇప్పించుకుంటున్నాననీ, ఆ రోజు గ్రాండ్ ట్రంక్ ఎక్స్‌ప్రెస్సుకే వూరికి బయలుదేరుతున్నాననీ ఆమెకు విశదీకరించాడట. ఇలా జాబు పూర్తయిందో లేదో—సరిగ్గా ఆ క్షణంలోనే—వయ్యారంగా దిండుమీద కూచుని ఆవులిస్తున్న ఆయనను, అంతదాకా వేచివున్న నల్లి ఒకటి తొడమీద ముద్దెట్టుకున్నదట. ఆ దెబ్బతో, ఆకాశవీధులలో విహరిస్తున్న మామయ్య ఒక్కసారిగా ఈ లోకంలోపడి, దిగ్భ్రాంతి పడినవాడై, ఆ భ్రాంతిలో భార్యకు రాసిన లేఖ ఆఫీసరుకూ, లీవు లెటరు భార్యకూ పోస్టు చేసేశాడట!—ఇక తరువాత జరిగినదేమిటి?—సమాధానానికి వెండితెరపై చూడవలసిందే! ఇక్కడేమో ఆఫీసరు దుర్వాసుడై ధుమధుమలాడిపోయి ఆశీర్వచనాలు కురిపించేశాడు. అక్కడినుంచీ భార్య జాబురాసింది "మా నాన్నకు టైఫాయిడ్ రావాలని మీకు కోరికగా వుందా?" అని! ఇక మామయ్య అవస్థ ఏంచెప్పను? ... అందుకే ఈనాటికీ ఎక్కడయినా నల్లి కనిపిస్తే చాలు, ఆయనకు ఆనాటి విషాద సంఘటనలన్నీ కళ్లకు కట్టినట్టయి, ఒళ్లు జలదరిస్తుందట!

నల్లులవల్ల ఇలాంటివే చాల అవస్థలున్నాయి. చాలాచోట్ల పెళ్లిచూపుల కార్యక్రమం సాగేటప్పుడు, వాళ్ళకై ఏర్పాటుచేసిన ఆ అద్దె కుషన్‌లలో ఏ కొన్ని నల్లులైనా చేరివుండి ఆ 'వుడ్ బీ' అల్లుడినీ, ఆయన పరివారాన్నీ కాస్త పరామర్శిస్తే, వాళ్లు కంగారెత్తి—"బాబో, ఈ మామగారు వరక్రయంతోబాటు నల్లుల్నికూడా ప్రసాదిస్తాడు కాబోలు" అనుకుని, ఆ కోపంతో తిరిగిపోవటం లాంటివి జరుగుతూ ఉంటాయి. జరిగినప్పుడు మనం ఏ మాత్రం ఆశ్చర్యపడవలసిన అవసరంలేదుకూడా ... కొందరికి పైత్యప్రకృతి కావటంవల్ల, నల్లి కరిస్తే ఒళ్లంతా పెద్ద పెద్ద దద్దుర్లు పేలి మహాబాధ వేస్తుంది. 'కించిత్తు నల్లి గరచిన మంచమునకు దెబ్బవచ్చు' అన్నాడు సుమతీ శతకకారుడు.

అయితే యింత ఉపద్రవమయిన నల్లుల వల్ల కూడా కొంచెం ప్రయోజనము లేకపోలేదు. ముఖ్యంగా సినిమాహాలువాళ్ళకు నల్లులు చేసే ఉపకారం ఇంతింతా కాదు. చాలా థియేటర్లలో యజమానులు అర్ధరూపాయిసీట్లలో నల్లుల్ని భారీప్రమాణంలో ఉంచుతారు. ఇందువల్ల వాటి బాధపడలేక (మానవమాత్రులు గనుక) ఆ సీట్లకు వచ్చే ఆసాములంతా ముప్పావలికమంది పద్నాలుగణాల టిక్కెట్టు కొనుక్కుంటారు. కాని దూరదృష్టిగల యజమానులు ఆ సీట్లలోనూ



మత్కుణాభిరామాయణం

కొద్దిగా మత్కుణయూధాన్ని ప్రవేశపెట్టి ఉంచటంవల్ల, చాలామంది, ఈ ఏడుపంతా ఎందుకులెమ్మని రిజర్వేషను పోతుంటారు. అందుకే ఇప్పుడు చాలా హాళ్లలో రూపాయున్నర టిక్కెట్లే ఎక్కువ పోతున్నాయి!

ఇంతెందుకూ? మొన్న మొన్న మా శేషుబావ నూక్కులుపైనలునుంచి బయటపడేది మత్కుణ సహాయంవల్ల నేనని గుండెమీద చెయ్యివేసుకు చెప్పగలను. సెలవుల్లో రాత్రి పదివరకూ రాని నిద్ర, మాసపత్రికలు పట్టుకుంటే పదకొండువరకూ రాని నిద్ర, పరీక్షల్లో రాత్రి ఏడింటికి క్లాసు బుక్కు స్పృశిస్తే చాలు, ముంచుకొచ్చేది వాడికి. మా పక్కింటి ఆచార్లుగారింట్లో నల్లులున్నాయి చూడండీ—అవి నల్లులా అని అనుమానం వేస్తుంది; ఒక్కొక్కటి అర్ధణా అంతవి వున్నాయి. మా శేషుబావ, ఇక ఇది పనిగాదని, ఒక్కసారి వాడి పరుపు తీసుకెళ్లి ఆచారుగారింట్లో పడకచుట్టలమీద రెండు నిమిషాలపాటు ఉంచి తెచ్చుకున్నాడు. ఆనాటినుంచి రాత్రిళ్ళు పుస్తకం పట్టుకున్నప్పుడు నిద్ర వస్తే వెళ్ళి ఒక అరనిముషం ఆ పరుపుమీద పడుకునేవాడు. పడుకున్న మరుక్షణంలోనే నవ చైతన్యం పొంది, ఆ దెబ్బతో ఇవతలికి వచ్చి చదువు మొదలెట్టేవాడు. మళ్ళీ నిద్ర వస్తే మళ్ళీ......

ఇంకా, పంచతంత్రాల్లో ఒకటైన 'విగ్రహానికి' కూడా నల్లులు పనికివస్తాయి. మొన్న ఒకసారి మా పొరుగింటి దుర్గమ్మబామ్మగారు మా తాతయ్యను రెండు మాటకూరకొమ్మ లడిగితే, ఆయన లేవు పొమ్మన్నాడట. ఆమె అందుకే కోపపడి "పామైన మరచిపోవును, భామిని మరువంగబోదు పగ సెన్నటికిన్" అని జ్ఞాపకంచేసేందుకు—వాళ్ళింట్లో అసంఖ్యాకంగా వున్నవాటిల్లో ఓ పది నల్లుల్ని పట్టుకొచ్చి మా యింట్లో వదిలిపెట్టింది. ఇంతా జరిగి వారంరోజులైనా కాలేదు; అవి బహుముఖంగా సంతానాభివృద్ధి చేసుకుని ఎక్కడా కూచోనివ్వకుండా అవస్థ పెడుతున్నాయి. ఇంకా రాద్దామని వుంది కాని, అవి కుర్చీలో కూడా చేరుకుని కరిచి పారేస్తూ వ్రాయనివ్వటం లేదు. మరేం చెయ్యను?

★

న్యూఢిల్లీ లేఖ

(10వ పేజీ తరువాయి)

విషీకనిపించవు. చాపలుమాత్రమే. కనిపిస్తాయి. వాటిమీద పిల్లలు. పిల్లలవంటినిండా దద్దుర్లు. అక్కడక్కడ ఓ మేక. ఇంత దారుణం ఇక ఏనగరంలోను కనబడదనుకుంటాను. 70 లక్షలమంది పోర్చుగీసుప్రజల్లో బహుశా 70 వేలమందికి మాత్రమే కడుపునిండా తిన డానికి ఉన్నది."

పైతరగతుల ప్రజలను రచయిత్రి ఇలా వర్ణించింది:

"వీరంతా నల్లటినూట్లు ధరిస్తారు. బాగా గంజిపెట్టిన కాలర్లు, బౌటైలుధరిస్తారు. పట్టిపట్టి మర్యాదగా మాట్లాడతారు. కాని ఉండుండి వారిముఖాలపై ఏదోగాఢమైన విద్వేషం రేఖామాత్రంగా కనిపిస్తుంది. వీరిలో కొందరు మాజీమంత్రులు. కొందరు మాజీ జర్నలిస్టులు. కొందరు మాజీప్రొఫెసర్లు. కొత్తప్రభుత్వం అడుగులకు మడుగులొత్తక పోవటంవల్ల వీరందరూ అణగారిపోయారు. అంతా బీదవారే. చెరలో బంధితుల్లాగ కనిపిస్తారు. ఇంకా స్వతంత్రంగా వ్యవహరిస్తున్నవారెవరైనా ఉంటే, వారికికూడా లోలోపల ఏదోరాబోతోందనే భయం పీకుతూనే ఉంటుంది. డబ్బుతీసుకోకుండా బీదవారికి వైద్యంచేసే డాక్టరు, ఒక చిన్న ఆస్పత్రిని స్థాపించడానికి ప్రయత్నించిన డాక్టరు, కనీసం ఉన్నఆస్పత్రులను శుభ్రంగాఉంచాలనుకున్న డాక్టరు వెంటనే అనుమానాస్పదుడుగా జమఅవుతాడు. సాయంకాలాలప్పుడు విద్యాబోధన చేయదలచినవాడుగాని, దానధర్మాలు చేయదలచినవాడుగాని ఉంటే చర్చి, ప్రభుత్వమూకూడా వెంటనే అతన్ని శత్రువుగా జమకట్టడం జరుగుతుంది. అయినా అలాంటి ఉదారస్వభావులు ఇంకా ఉన్నారు. నాజీలశకం అంతరించగానే తమదేశంలోని ఫాసిజం కూడా నశిస్తుందని వీరంతా ఆశలతో బ్రతికారు. సాలాజార్ ప్రభుత్వాన్ని పడగొట్టాలని వీరు కలలుకన్నారు. కాని తాము ఏకాకులమని వారికి ఇప్పుడు తెలిసింది. పోర్చుగల్ లో బ్రిటిష్ పెట్టుబడిదారులకు వ్యాపారాలున్నాయనీ, అజోర్స్ లో విమానస్థావరాలకోసం అమెరికన్లు పోర్చుగీసు ప్రభుత్వంతో మంతనాలు జరుపుతున్నారని వారు గుర్తించారు."

'స్వేచ్ఛ, వ్యక్తిస్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం వర్ధిల్లాలి!' ఎంత చక్కని నినాదం!

★

[illegible]

(11-వ పేజీ తరువాయి)

మొగాడేనన్న పిచ్చినమ్మకం, ఎలా ఉండిపోయాయా అని ఎడతెగకుండా ఆలోచించారు. తెగలేదు...ఎంతకీ తెలియలేదు వాడిగుట్టు...మీటింగు వాయిదా వేసి, షూటింగ్ కాన్సెల్ చేసి, స్పెషల్ డిటెక్టివ్ లచేత మూడు అహోరాత్రులు పరిశోధన జరిపించారు.

వాళ్లు, నీడలా వాడినెంట పడ్డారు. దురాశలా వాడిలోదూరి కూర్చున్నారు. మూడోనాటికల్లా వాడి గుండెనిబ్బరం గుట్టు కనిపెట్టేశారు. తక్షణం ఇంకో ఎమర్జెన్సీ మీటింగుచేసి ఓరహస్యతీర్మానం చేశారు. మర్నాడే బహిరంగ విచారణ జరిపారన్న మాట. ఇందాక నేచెప్పినట్టు ఆ రైటరుని మధ్య నించోపెట్టి అంతా చుట్టూరానిలబడి వాడి నేరం జాబితా చదివారు.

తరవాత కిరాయి జడ్జి గంభీరంగా నిల్చుని అతనికి అందరూ కలిసి విధించిన శిక్షను పైకి చదివాడు.

అదేమిటని అడగవే? ...అది వినగానే అందరూ హాహాకారాలుచేశారు. ఆరైటరు గోల చెప్పనక్కరేదు.

"ఆశిక్షమటుకు వద్దు...... అది తప్ప ఇంకేదేనా సరే" అని కాళ్లావేళ్లాపడి మొరపెట్టుకున్నాడు...

'ఏమిటండీ ఆశిక్ష' అన్నాడు రాజు ఉండబట్టలేక.

సుబ్బారావు బాధగా నవ్వి ఒక నిముషం మౌనంపాటించాడు.

"అదా?......మూడు నెలలపాటు ఈ స్టుడియో కాంటీన్లో కాఫీ ముప్పూటలా పూటకి కప్పు చొప్పున ఈముద్దాయి త్రాగవలెను" అని శిక్ష వేశారు. డిటెక్టివ్ లు కనిపెట్టిన గుట్టు అదే. ఆరైటరు ఇంటివద్ద దగ్గిర్నించి వేరే కాఫీ తెచ్చుకుంటున్నాట్ట. స్టుడియో కాఫీ చుక్కకూడా ముట్టుకోటం లేదుట...అదే ఈ ధైర్యానికి కారణం... ఇంకేముంది వారంరోజులు తాగినేచాలు... నువ్వు ఇక్కడ కాఫీ తాగుతానంటే నాకు ఈ గాథ గుర్తుకొచ్చింది. కావాలా తేనా? ఇంద అన్నాడు సుబ్బారావు.

"అయ్య బాబోయ్...వద్దండి"అన్నాడు రాజు.

సుబ్బారావు జాలిగా నవ్వాడు. అయితే లాభంలేదు బ్రదర్ ...నువ్వు సినిమాలకిపనికి రావు నీ ధైర్యం, గట్రా దాచుకోవాలంటే అన్నాడు.


(పైవారం — హీరోయిన్ ప్రవేశం)

Printed and Published for Nageswara Rao Estates (Private) Ltd., by S. Radha Krishna at The Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street, Madras-1. Editor S. Sambhu Prasad



గాజుల సింగారం

ఫొటో: వి. శేషశర్మ.


'ఓహా! లైఫ్‌బాయ్ సబ్బుతో
ఇప్పుడు స్నానం చేయుటఅవుసరం'
- అది సంతృప్తి కరమైన
శుభ్రతాభావమును కలిగించును!
LIFEBUOY
SOAP
LIFEBUOY
SOAP
LIFEBUOY
SOAP